# ‘తెలంగాణ పాముల’ను కాపాడుతున్నదెవరు?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో జరిగిన వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో తెలంగాణ లింకులపై విచారణ ఎందుకు ముందుకు సాగడం లేదు? కార్పొరేషన్ నుంచి దారిమళ్లించిన రూ.45 కోట్లు హైదరాబాద్‌కు చేరాయని విచారణ సంస్థలు తేల్చినా లోతైన విచారణ ఎందుకు చేయడం లేదు? మొదట్లో సోదాలతో హడావుడి చేసిన దర్యాప్తు సంస్థలు ఇప్పుడు ఎందుకు హైదరాబాద్‌వైపే చూడటం లేదు? ఊరూపేరు లేని కంపెనీలకు డబ్బులు జమ కావడం, అందునా డబ్బులు జమ అయిన ఖాతాలన్నీ ఒకే బ్యాంకుకు చెందినవి కావడం అనుమానాలను బలపరుస్తున్నా దర్యాప్తు సంస్థలు ఎందుకు పట్టించుకోవడం లేదు?.. వాల్మీకి స్కామ్ దర్యాప్తుపై ఎదురవుతున్న ప్రశ్నలివి. లోక్‌సభ ఎన్నికల ముందు ఈ డబ్బులు తెలంగాణకు చేరాయని, ఎన్నికల్లో వీటిని వినియోగించినట్టు అనుమానాలు ఉన్నప్పటికీ ఈ దిశగా విచారణ చేపట్టకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. అసలు, ఈ స్కామ్‌తో సంబంధమున్న తెలంగాణకు చెందిన వారిని ఎవరు కాపాడుతున్నారు, ఎందుకు కాపాడుతున్నారనేది అంతుచిక్కని ప్రశ్న.

### ఆర్బీఎల్ బ్యాంకుకే రూ. 44.6 కోట్లు బదిలీ

వాల్మీకి కార్పొరేషన్ నుంచి దారిమళ్లిన మొత్తం రూ.187 కోట్లలో తెలుగు రాష్ట్రాలకు రూ.90 కోట్లు చేరినట్టు కర్ణాటక సిట్ అంతర్గత నివేదికలో వెల్లడించింది. ఇందులో రూ.44.6 కోట్లు హైదరాబాద్‌కు చెందిన తొమ్మిది కంపెనీల బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్టు వివరించింది. సిట్ నివేదిక ప్రకారం.. వాల్మీకి కార్పొరేషన్ ఎండీ, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న జేజీ పద్మనాభ్, సస్పెండైన అకౌంట్స్ అధికారి పరశురామ్ బెంగళూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంజీ రోడ్డు బ్రాంచీలో మార్చి 30, 2024న రూ.50 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ టర్మ్ డిపాజిట్‌పై అదే రోజు రూ. 45 కోట్ల మేర రుణానికి దరఖాస్తు చేశారు. ఇందులో నుంచి అదేరోజు హైదరాబాద్‌లోని ఆర్బీఎల్ బ్యాంకుకే చెందిన 9 బ్యాంకు ఖాతాలకు రూ.44.6 కోట్లను బదిలీ చేశారు.

### ఖాతాలన్నీ నకిలీవే

డబ్బు జమ అయిన 9 ఆర్బీఎల్ బ్యాంకు ఖాతాలు నకిలీవని, కేవలం స్కామ్ డబ్బులు తరలించడానికే వీటిని తాత్కాలికంగా వినియోగించుకొన్నట్టు ఈడీ తెలిపింది. ప్రస్తుతం ఈ అకౌంట్‌లు క్రియాశీలంగా లేవని వెల్లడించింది. వాల్మీకి కార్పొరేషన్‌లో నిధులు పక్కదారి పట్టాయని సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే పేర్కొనడం గమనార్హం.

## హైదరాబాద్‌లో కర్ణాటక వాల్మీకి స్కామ్ లింకులు..

- ఆర్బీఎల్ బ్యాంకుకు చెందిన 9 ఖాతాల్లో 45 కోట్లు జమ
- స్కామ్‌కు సంబంధించి రాష్ట్రంలో సిట్, సీబీఐ, ఈడీ సోదాలు
- సోదాల తర్వాత ఎలాంటి ప్రకటన విడుదల చేయని కేంద్ర ఏజెన్సీలు
- అనుమానాలు ఉన్నా లోతైన విచారణ జరపని దర్యాప్తు సంస్థలు
- వాల్మీకి కార్పొరేషన్ స్కామ్ విచారణలో రోజుకో కొత్త మలుపు
- నిందితులను తప్పించి.. బాధితులే లక్ష్యంగా సిట్ విచారణ
- సూసైడ్‌తో స్కామ్ గుట్టురట్టు చేసిన సూపరింటెండెంట్‌పై కేసు
- అతడే కీలక నిందితుడు అని పేర్కొంటూ సిట్ రెండో చార్జిషీట్
- అదే చార్జిషీట్‌లో ఎక్కడా కనిపించని ప్రధాన నిందితుల పేర్లు
- తన భర్తను కావాలనే ఇరికిస్తున్నారన్న మృతుడి భార్య కవిత




**కాంగ్రెస్ పాలిత కర్ణాటకలోని వాల్మీకి కార్పొరేషన్‌లో వెలుగు చూసిన రూ.187 కోట్ల స్కామ్ లింకులు తెలంగాణలో బయటపడటం సంచలనంగా మారింది. ఈ స్కామ్‌లోని మొత్తం డబ్బులో రూ.45 కోట్లు హైదరాబాద్‌కు తరలిరావడం, అందునా ఒక్క ఆర్బీఎల్ బ్యాంకులోని 9 ఖాతాల్లోనే ఆ డబ్బు జమ కావడం అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నది. ఈ స్కామ్ విషయమై గతంలో ఈడీ, సీబీఐ, సిట్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా సోదాలు నిర్వహించారు. అయితే, అనూహ్యంగా దానిపై ఏ ఏజెన్సీ ఏ ఒక్క ప్రకటన కూడా విడుదల చేయలేదు. దీంతో కర్ణాటక, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వాలను కాపాడుతున్నదెవరన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. స్కామ్ జరిగిన మాట వాస్తవమే అయినప్పుడు, హైదరాబాద్‌కు నిధులు చేరాయన్నది కూడా నిజమే అయినప్పుడు ఆ డబ్బు ఎవరికి చేరింది? ఎందుకోసం ఈ డబ్బును వినియోగించారు? అనేది ఎందుకు విచారించడం లేదనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. మరోవైపు, కర్ణాటకలో ఈ స్కామ్ దర్యాప్తు తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు నిందితులను తప్పించి స్కామ్‌ను బయటపెట్టిన వ్యక్తినే కీలక నిందితుడిగా చేర్చడం కలకలం రేపుతున్నది.**

### సోదాలు చేశాక.. ఈడీ ప్రకటన ఏది?

వాల్మీకి కార్పొరేషన్ నుంచి హైదరాబాద్‌లోని తొమ్మిది ఆర్బీఎల్ బ్యాంకు ఖాతాలకు రూ.44.6 కోట్లు బదిలీ కాగా ఏపీలోని మరో 9 బ్యాంకు ఖాతాలకు మరో రూ.45 కోట్లు బదిలీ అయినట్టు ఈడీ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌కు చేరిన రూ.44.6 కోట్ల నగదుతో లోక్‌సభ ఎన్నికల ముందు పెద్దయెత్తున మద్యం, ఖరీదైన వాహనాలను కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. ఈ స్కామ్‌కు సంబంధించి తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఈడీ, సీబీఐ, సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. అయితే, ఆ సోదాల్లో ఏం లభించాయన్న విషయంపై మాత్రం కేంద్ర ఏజెన్సీలు ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

### లోగుట్టు వాళ్లకే ఎరుక

ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకే కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్కామ్‌కు పాల్పడిందని, స్కామ్‌లోని రూ.44.6 కోట్లు హైదరాబాద్‌కు చేరడాన్ని చూస్తే, ఇక్కడి కాంగ్రెస్‌కు కూడా ఈ స్కామ్‌తో సంబంధం ఉన్నట్టు అర్థమవుతున్నదని పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ స్కామ్‌ను విచారిస్తున్న కేంద్రప్రభుత్వ ఏజెన్సీ ఈడీ వైఖరి కూడా అనుమానాస్పదంగా ఉన్నది. దీంతో కేంద్రంలోని బీజేపీ, ఇరు రాష్ట్రాల్లోని కాంగ్రెస్ పెద్దలు ఈ స్కామ్‌లోని అసలు నిజాలు బయటకు రాకుండా ప్రయత్నాలు చేస్తున్నట్టు విశ్లేషకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ స్కామ్ లోగుట్టు కాంగ్రెస్, బీజేపీ నేతలకే తెలుసునని సోషల్‌మీడియాలో పలువురు కామెంట్లు పెడుతున్నారు.

### తొలుత ఈడీ దూకుడు

లోక్‌సభ ఎన్నికల్లో మద్యం, డబ్బు పంచడం కోసమే ‘వాల్మీకి కార్పొరేషన్’ నిధులను అక్రమంగా వాడుకొన్నట్టు ఈడీ, సిట్ విచారణలో ప్రాథమికంగా తేలింది. అయితే, నిధుల బదిలీని వాల్మీకి కార్పొరేషన్ సూపరింటెండెంట్ పీ చంద్రశేఖరన్ తొలుత వ్యతిరేకించడంతో ఆయన్ని తప్పించినట్టు సమాచారం. దీంతో ఆయన గత మే 26న ఆత్మహత్య చేసుకొన్నారు. అయితే, తన మరణ వాంగ్మూలంలో స్కామ్‌కు సంబంధించిన కీలక వివరాలను బయటపెట్టారు. దీంతో విచారణ జరిపిన ఈడీ.. కుంభకోణంలో భాగమైన మాజీ మంత్రి నాగేంద్ర, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బసనగౌడ దద్దల్, మరో ఇద్దరు బ్యాంకు అధికారులు సహా మొత్తం 11 మందిని అరెస్ట్ చేసింది.


నాగేంద్ర


చంద్రశేఖరన్


బసనగౌడ

### బయటపెట్టిన వ్యక్తే.. స్కామ్‌కు పాల్పడుతాడా?

స్కామ్‌ను బయటపెట్టిన తన భర్తనే కీలక నిందితుడిగా చిత్రీకరించేందుకు కుట్రలు మొదలయ్యాయని సూపరింటెండెంట్ పీ చంద్రశేఖరన్ సతీమణి కవిత ఆరోపించారు. ఈ మేరకు ‘నమస్తే తెలంగాణ’ ప్రతినిధి.. కవితను సంప్రదించినప్పుడు కీలక విషయాలు బయటకు వచ్చాయి. ‘అసలు ఈ వాల్మీకి స్కామ్‌ను మొదటి నుంచి వ్యతిరేకించిన ఏకైక వ్యక్తి నా భర్త పీ చంద్రశేఖరన్. అయితే, ఈ స్కామ్‌కు సహకరించాలని అందరూ ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో అది ఇష్టంలేని ఆయన గత మేలో ఆత్మహత్య చేసుకొన్నారు. ప్రజాధనం వృథాగా పోవొద్దని సూసైడ్ నోట్‌లో ప్రధాన నిందితుల పేర్లతో సహా స్కామ్‌కు సంబంధించిన అన్ని వివరాలు పేర్కొన్నారు. అయితే, శివమొగ్గ జిల్లా కోర్టుకు గురువారం సిట్ సమర్పించిన రెండో చార్జిషీట్‌లో అసలు నిందితుల పేర్లు కనిపించలేదు. నా భర్తను కీలక నిందితుడిగా సిట్ తాజాగా చేర్చింది. ఆయన డబ్బు తీసుకొన్నట్టు అబద్ధపు ఆరోపణలు చేసింది. ఇది ఎంత అన్యాయం? స్కామ్‌ను బయటపెట్టిన వ్యక్తే.. ఎక్కడైనా ఆ స్కామ్‌కు పాల్పడుతాడా? దీనిపై హైకోర్టును ఆశ్రయిస్తాం. ఈ స్కామ్ వెనుకున్న అసలు నిజాలు బయటకు రావాలంటే ఈ కేసు దర్యాప్తును ప్రభుత్వం సీబీఐకి అప్పగించాలి’ అని నమస్తే తెలంగాణ ప్రతినిధితో కవిత అన్నారు. కేసుకు సంబంధించి తనను కూడా విచారించాల్సిందిగా ఈడీ అధికారినంటూ ఒకరు తనకు ఫోన్ చేసినట్టు పేర్కొన్న కవిత.. కేసు తేలేవరకూ శివమొగ్గ వదిలి వెళ్లొద్దని తనతో చెప్పినట్టు వాపోయారు.

### థ్రిల్లర్ సినిమాను మించిన ట్విస్ట్‌లు

‘కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్’కు చెందిన పలు బ్యాంకు ఖాతాల్లో ఉండాల్సిన రూ. 187 కోట్లు పక్కదారిపట్టాయి. దీన్నే ‘వాల్మీకి కార్పొరేషన్’ స్కామ్‌గా పిలుస్తున్నారు. నిజానికి ఈ స్కామ్ జరిగినట్టు ఎవరికీ తెలియదు. అయితే, చంద్రశేఖరన్ గత మే 26న ఆత్మహత్య చేసుకోవడంతో ఈ కుంభకోణం వెలుగు చూసింది. వాల్మీకి కార్పొరేషన్ నుంచి చట్ట విరుద్ధంగా పలు బ్యాంకు ఖాతాలకు రూ.187 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశారని చంద్రశేఖరన్ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. స్కామ్‌లో భాగమైన నిందితుల పేర్లనూ లేఖలో ప్రస్తావించారు. దీనిపై సర్వత్రా ఒత్తిడి పెరుగడంతో సిద్ధరామయ్య ప్రభుత్వం.. ఈ కుంభకోణంపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేసింది.

### చివరకు విచారణ పక్కదారి

ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ శివమొగ్గ జిల్లా కోర్టుకు గురువారం సమర్పించిన రెండో చార్జిషీట్ నివేదికలో అసలు నిందితుల పేర్లను తప్పించడం కలకలం రేపుతున్నది. వాల్మీకి కుంభకోణంలో ప్రధాన నిందితులైన మాజీ మంత్రి నాగేంద్ర, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బసనగౌడ దద్దల్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) చీఫ్ మేనేజర్ సుచిస్మితా రావల్ పేర్లు సిట్ రెండో చార్జిషీట్‌లో కనిపించలేదు. స్కామ్‌ను బయటపెట్టిన చంద్రశేఖరన్‌ను నిందితుడిగా సిట్ కొత్తగా చేర్చింది. దీంతో ఈ విచారణ పక్కదారి పడుతున్నదని పలువురు విమర్శిస్తున్నారు.

### హైదరాబాద్‌లోని ఆర్బీ ఎల్ బ్యాంకులో ఏ కంపెనీ ఖాతాలో ఎంత డబ్బు జమ అయిందంటే??

| కంపెనీ పేరు | జీఎస్టీఐఎన్/యూఐఎన్ నంబర్ | ఖాతా నంబర్ | జమ అయిన డబ్బు |
|---|---|---|---|
| సిస్టమ్ అండ్ సర్వీస్ కంపెనీ | 29ఏడీఏఎఫ్ఎస్4751ఎం1జడ్ఎల్ | 00015010145200202 | రూ. 4.55 కోట్లు |
| రామ్ ఎంటర్‌ప్రైజెస్ | 37ఏఏవీఎఫ్ఆర్5337ఏ1జడ్‌జడ్ | 00015010145200203 | రూ. 5.07 కోట్లు |
| స్కిల్‌మ్యాప్ ట్రైనింగ్ | ---------------------- | 00015010145200204 | రూ. 4.84 కోట్లు |
| స్వాప్ డిజైన్ | 27ఏటీఎన్‌పీసీ5821హెచ్1జడ్‌వో | 00015010145200205 | రూ. 5.15 కోట్లు |
| జీఎన్ ఇండస్ట్రీస్ | 36బీఏఎల్‌పీఏ6399సీ1జడ్ఎం | 00015010145200206 | రూ. 4.42 కోట్లు |
| నావెల్ సెక్యూరిటీ | 29ఏడీవీపీఆర్2142ఎల్1జడ్‌టీ | 00015010145200207 | రూ. 4.56 కోట్లు |
| సుజల్ ఎంటర్‌ప్రైజెస్ | ---------------------- | 00015010145200208 | రూ. 5.63 కోట్లు |
| గ్రాబ్ ఏ గ్రబ్ | 36ఏఏఎఫ్‌సీజీ7837ఎఫ్1జడ్ఎఫ్ | 00015010145200209 | రూ. 5.88 కోట్లు |
| వీ6 బిజినెస్ | ---------------------- | 00015010145200210 | రూ. 4.50 కోట్లు |

### మంత్రి మాటల్లో మర్మమేంటో?

కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్యకు నోటీసులు ఇచ్చినట్టే, తెలంగాణ సీఎం రేవంత్‌కు కూడా రేపోమాపో నోటీసులు రావొచ్చంటూ కర్ణాటక పీడబ్ల్యూడీ మంత్రి సతీశ్ జార్కిహోళి ఇటీవల చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. వాల్మీకి సామాజిక వర్గంలో బలమైన నేతగా ఉన్న జార్కిహోళి.. తమ కార్పొరేషన్ నిధులు పక్కదారి పట్టినప్పటికీ ఏమాత్రం స్పందించడం లేదంటూ ఆ వర్గం ప్రజలు ఆయనపై గుర్రుగా ఉన్నారు. ఇదే విషయమై ఆయనపై పలు విధాలుగా అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీంతో పెరుగుతున్న అసమ్మతిని చల్లార్చడానికి ఆయన చేయని ప్రయత్నంలేదు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్‌కు కూడా రేపోమాపో నోటీసులు రావొచ్చని జార్కిహోళి కీలక వ్యాఖ్యలు చేశారు. ‘వాల్మీకి స్కామ్’ కాంగ్రెస్ పాలిస్తున్న కర్ణాటకలో జరుగడం, అక్కడి డబ్బు తెలంగాణకు చేరడం, తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అధికారంలో ఉండటం, నోటీసుల గురించి ‘వాల్మీకి’ సామాజిక వర్గానికి చెందిన బలమైన నేత జార్కిహోళి సంచలన వ్యాఖ్యలు చేయడాన్ని చూస్తే.. ఈ స్కామ్‌లోనే సీఎంకు నోటీసులు వస్తాయా? అంటూ పలువురు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

---

## తెలంగాణ కాంగ్రెస్‌ను కాపాడుతున్న అదృశ్య శక్తి ఎవరు?

- వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో తగిన ఆధారాలు ఉన్నా ఇక్కడ చర్యలెందుకు లేవు?
- తెలంగాణలో ఈడీ అధికారులు మౌనమెందుకు దాల్చారు?
- కర్ణాటక మంత్రి జార్కిహోళి వ్యాఖ్యల వెనుక అర్థమేంటి?
- ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నల వర్షం
- వాల్మీకి స్కామ్ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో చోటుచేసుకొన్న వాల్మీకి కార్పొరేషన్ స్కామ్ వ్యవహారంలో తెలంగాణ కాంగ్రెస్‌ను కాపాడుతున్న అదృశ్య శక్తి ఎవరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ప్రశ్నించారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కుదిపేస్తున్న ఈ కుంభకోణం వ్యవహారంలో తెలంగాణకు చెందిన రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలకు రహస్య లింక్ ఉన్నదనే వార్తలు వస్తున్నాయని, అయినా ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని కేటీఆర్ శనివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. కోట్లాది రూపాయల ఈ కుంభకోణం, తెలంగాణ నాయకులకు దానితో ఉన్న లింకులకు సంబంధించి తగిన ఆధారాలు ఉన్నా రాష్ట్రంలో చర్యలు తీసుకోవడంలో ఈడీ ఎందుకు మౌనం దాల్చిందని నిలదీశారు. ‘తెలంగాణలో కాంగ్రెస్‌ను కాపాడుతున్నది ఎవరు? ఏమైనా సమాధానం ఉందా?’ అని కేటీఆర్ ఈడీని ప్రశ్నించారు. వాల్మీకి స్కామ్ వ్యవహారంలో తలెత్తుతున్న పలు ప్రశ్నలను ఆయన ఎక్స్(ట్విట్టర్) వేదికగా సంధించారు. వాటికి సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నేతలను డిమాండ్ చేశారు.

### కేటీఆర్ సంధించిన ప్రశ్నలు ఇవీ..



- కర్ణాటక ఎస్టీ కార్పొరేషన్ నుంచి రూ.45 కోట్లు బదిలీ అయిన హైదరాబాద్‌లోని తొమ్మిది బ్యాంకు ఖాతాలు ఎవరివి?
- రూ.4.5 కోట్లు అందుకొన్న ‘వీ6 బిజినెస్’ యజమాని ఎవరు?
- కర్ణాటక వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌కు సంబంధించి తెలంగాణలో సిట్, సీఐడీ, ఈడీ దాడులు చేసిన తర్వాత కూడా సంబంధిత వార్తలు రాష్ట్ర మీడియాలో ఎందుకు బయటకు రానివ్వలేదు?
- లోక్‌సభ ఎన్నికల సమయంలో కొన్ని బార్లు, బంగారం దుకాణాల నుంచి భారీయెత్తున నగదు విత్‌డ్రా చేశారు. వాటి యాజమానులు ఎవరు? వారికి కాంగ్రెస్ పార్టీతో ఉన్న సంబంధం ఏంటి?
- వాల్మీకి స్కామ్‌లో రూ.90 కోట్ల అవినీతి జరిగిందని సాక్ష్యాత్తూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీలోనే ఒప్పుకొన్నారు.
- ముఖ్యంగా కర్ణాటక సీఎంగా సిద్ధరామయ్యను తొలగిస్తే తెలంగాణ ప్రభుత్వం కూలిపోతుందంటూ ఆ రాష్ట్ర మంత్రి సతీశ్ జార్కిహోళి ఎందుకు వ్యాఖ్యానించారు? ఆ మాటల వెనుక అర్థం ఏంటి?
- ఈ స్కామ్‌కు సంబంధించి తగిన ఆధారాలు కనిపిస్తున్నప్పటికీ, తెలంగాణలో ఈడీ ఎందుకు మౌనంగా ఉన్నది?
- ఇక్కడి కాంగ్రెస్‌ను కాపాడుతున్నది ఎవరు?
- ఈ ప్రశ్నలకు సమాధానాలు ఉన్నాయా? అంటూ కేటీఆర్ ఈడీని ప్రశ్నించారు.

## 10 వేల కోట్లతో ‘విజ్ఞాన్ ధార’

- బయో ఈ3 పాలసీకి ఆమోదం
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 24: విజ్ఞాన్ ధార పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఐటీశాఖ అమలు చేస్తున్న మూడు పథకాలను విలీనం చేసి ‘విజ్ఞాన్ ధార’ పేరుతో కొత్త పథకం తీసుకొచ్చింది. 15వ ఆర్థిక సంఘం కాలమైన 2021-22 నుంచి 2025-26 మధ్య రూ.10,579 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేయనున్నట్టు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఈ పథకం కింద 11వ, 12వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, యూజీ, పీజీ, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ రిసెర్చ్ విద్యార్థులకు ఫెలోషిప్‌లు అందించనుంది. అధునాతన పరిశోధనల కోసం అంతర్జాతీయ భాగస్వామ్యం, సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, ఫెలోషిప్‌లు వంటివి ఈ పథకంలో ఉంటాయి. ఆర్థిక, పర్యావరణ, ఉపాధి కోసం జీవసాంకేతిక విజ్ఞానం(బయో ఈ3) విధానానికి సైతం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. స్వచ్ఛ ఇంధన, పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీ, పరిశోధన, ఈ రంగంలోని నూతన సాంకేతికత ప్రోత్సాహానికి ఈ విధానం ఉపయోగపడుతుందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

## కర్ణాటకలో సీఎం మార్పు?

- కేసుల్లో కూరుకుపోతున్న సీఎం సిద్ధరామయ్య
- ‘సిద్ధూకు మద్దతు’ అంటూనే ప్లాన్ బీ సిద్ధం చేస్తున్న కాంగ్రెస్ హైకమాండ్
- పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న డీకే
- హైకమాండ్ పరిశీలనలో పరమేశ్వర పేరు?

బెంగళూరు, ఆగస్టు 24: కర్ణాటక కాంగ్రెస్‌లో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వరుసగా కేసుల్లో కూరుకుపోతున్నారు. ముడా, వాల్మీకి స్కామ్‌లు ఆయన ముఖ్యమంత్రి పీఠానికి ఎసరు తెచ్చేలా ఉన్నాయి. దీంతో సీఎం పదవిపై కన్నేసిన నేతలు కుర్చీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోవాల్సిన లేదా దింపేయాల్సిన పరిస్థితి వస్తే.. సీఎం కుర్చీని ఎవరికి అప్పగించాలనే దానిపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్లాన్ బీ సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తున్నది. సిద్ధరామయ్యకు తమ మద్దతు ఉంటుందని చెప్తూనే ప్రత్యామ్నాయ ప్రణాళికను రచిస్తున్నట్టు సమాచారం.

### తెరపైకి హోంమంత్రి పరమేశ్వర పేరు

గత ఏడాది జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రి పదవిపై పీటముడి పడింది. ఈ పదవికి సిద్ధరామయ్య, పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ చివరి వరకు పోటీ పడగా సిద్ధరామయ్య వైపు మెజారిటీ ఎమ్మెల్యేలు, అధిష్ఠానం మొగ్గు చూపింది. డీకేకు ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టింది. ఇప్పుడు సిద్ధరామయ్య సీఎం పీఠం కోల్పోయే పరిస్థితి వస్తే డీకే శివకుమార్‌కే దక్కుతుందని అంతా ఊహిస్తున్న సమయంలో అనూహ్యంగా హోంమంత్రి జీ పరమేశ్వర పేరు తెరపైకి వచ్చింది. దళిత నేత అయిన పరమేశ్వర పేరును అధిష్ఠానం పరిశీలిస్తున్నది. ఆయనను సీఎంను చేస్తే కర్ణాటకకు మొదటి దళిత ముఖ్యమంత్రి అవుతారు. ‘నేను రాజకీయాల్లో ఉన్నాను. నేనేమీ సన్యాసిని కాను సీఎం పదవిని ఆశించకపోవడానికి’ అంటూ ఈ పరిణామాలపై పరమేశ్వర స్పందించారు.


శివకుమార్


పరమేశ్వర

### డీకేకు మళ్లీ హ్యాండేనా?

సీఎం పదవి కోసం డీకే శివకుమార్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యులంతా ఢిల్లీ వెళ్లి హైకమాండ్‌ను కలిశారు. సిద్ధరామయ్య కర్ణాటక తిరిగి వచ్చినా డీకే మాత్రం ఢిల్లీలోనే మంత్రాంగం నడుపుతున్నారు. అయితే, ఈసారి కూడా డీకేకు కాంగ్రెస్ హైకమాండ్ హ్యాండిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయనకు సీఎం పదవి ఇచ్చేందుకు సిద్ధరామయ్య వర్గం వ్యతిరేకంగా ఉంది. సీనియర్ నేత సతీశ్ జార్కిహోళి సైతం శివకుమార్‌ను వ్యతిరేకిస్తున్నారు. వీరంతా ముఖ్యమంత్రిని మార్చొద్దని అంటున్నారు. ఒకవేళ మార్చాల్సి వస్తే శివకుమార్ బదులు జీ పరమేశ్వర పేరును ప్రతిపాదించేందుకు సిద్ధమవుతున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. ఇదే జరిగితే డీకేకు మళ్లీ చుక్కెదురయ్యే చాన్స్ ఉంది. ఈ పరిణామాలపై కర్ణాటక ప్రతిపక్ష నేత ఆర్ అశోక స్పందిస్తూ.. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి కోసం మ్యూజికల్ చైర్స్ ఆట మొదలయ్యిందని ఎద్దేవా చేశారు.

---

# బేసిక్‌పై 50% పింఛన్

- యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ప్రకటించిన కేంద్రం
- చివరి 12 నెలల సగటు బేసిక్ పేపై 50% పెన్షన్
- 2004 ఏప్రిల్ 1 తర్వాత చేరిన వారికి వర్తింపు
- 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం
- ఎన్‌పీఎస్‌లో కొనసాగడమా, యూపీఎస్‌లో చేరడమా అన్నది ఉద్యోగులే నిర్ణయించుకోవచ్చు


మీడియాతో మాట్లాడుతున్న అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, ఆగస్టు 24: ఉద్యోగుల కోసం కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్) పేరుతో కొత్త పింఛన్ పథకాన్ని శనివారం ప్రకటించింది. దీని ప్రకారం ఉద్యోగి తన పదవీ విరమణకు ముందు 12 నెలల్లో అందుకున్న బేసిక్ పే సగటులో 50 శాతం కచ్చితంగా పింఛన్ రూపంలో అందుతుంది. 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ కొత్త పింఛన్ పథకం వర్తిస్తుంది. 2004లో తీసుకువచ్చిన కొత్త పింఛన్ పథకాన్ని(ఎన్‌పీఎస్) రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగులు చాలా రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2023 ఏప్రిల్‌లో కేంద్రం టీవీ సోమనాథన్ నేతృత్వంలో ఒక కమిటీ వేసింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను ప్రభుత్వం రూపొందించింది. శనివారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ పథకాన్ని ఆమోదించినట్టు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు.

### యూపీఎస్‌లోని 5 కీలక అంశాలు

**కచ్చితమైన పింఛన్:** కనీసం 25 ఏండ్ల సర్వీసు ఉన్న వారు కచ్చితమైన పింఛన్‌కు అర్హులు. వీరు పదవీ విరమణకు ముందు 12 నెలల పాటు అందుకున్న బేసిక్ పే సగటు 50 శాతం పింఛన్ రూపంలో ప్రతి నెల కచ్చితంగా అందుతుంది. కనీసం పదేండ్ల పైన, 25 ఏండ్లకు తక్కువ సర్వీసు చేసి పదవీ విరమణ పొందిన వారికి వారి సర్వీసుకు తగ్గట్టుగా పింఛన్ ఉంటుంది.

**కచ్చితమైన కుటుంబ పింఛన్:** ఉద్యోగి మరణించే నాటికి అందుకుంటున్న పింఛన్‌లో 60 శాతం కచ్చితమైన కుటుంబ పింఛన్‌గా ఉద్యోగి కుటుంబానికి అందుతుంది.

**కచ్చితమైన కనీస పింఛన్:** కనీసం పదేండ్ల సర్వీసు ఉండి రిటైర్ అయిన వారికి కనిష్టంగా రూ.10,000 కచ్చితంగా పింఛన్ అందుతుంది.

**ద్రవ్యోల్బణ ఇండెక్సేషన్:** కచ్చితమైన పింఛన్, కచ్చితమైన కుటుంబ పింఛన్, కచ్చితమైన కనీస పింఛన్‌పై ఇండెక్సేషన్ ప్రయోజనం ఉంటుంది. ఇది డియర్‌నెస్ రిలీఫ్ ఆల్ ఇండియా కన్జూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్(ఏఐసీపీఐ-ఐడబ్ల్యూ)పై ఆధారపడి ఉంటుంది.


### పదవీ విరమణ సమయంలో..

గ్రాట్యూటీకి అదనంగా పదవీవిరమణ సమయంలో ఉద్యోగులకు కొంత మొత్తాన్ని చెల్లిస్తుంది. ప్రతి ఆరు నెలల సర్వీసు పూర్తిపై నెల వేతనం(పే + డీఏ)లో పదో వంతును లెక్కగట్టి ఇస్తుంది. ఈ చెల్లింపు కచ్చితమైన పింఛన్ మొత్తాన్ని తగ్గించదు.

### యూపీఎస్ ఎవరికి?

ఎన్‌పీఎస్‌లో కొనసాగడమా? కొత్తగా యూపీఎస్‌లో చేరడమా అనేది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులే నిర్ణయించుకోవచ్చని అశ్వినీ వైష్ణవ్ స్పష్టత ఇచ్చారు. ఇది 2004లో ఎన్‌పీఎస్‌ను అమలులోకి తీసుకొచ్చినప్పటి నుంచి యూపీఎస్ అమలులోకి వచ్చే ముందురోజైన 2025 మార్చి 31 వరకు పదవీ విరమణ పొందిన వారికి, పొందబోయే వారికి కూడా వర్తిస్తుందని క్యాబినెట్ కార్యదర్శిగా ఎంపికైన టీవీ సోమనాథన్ తెలిపారు. ఇందుకుగానూ వారు అందుకున్న పింఛన్, యూపీఎస్ ప్రకారం అందాల్సిన పింఛన్‌ను సర్దుబాటు చేసి బకాయి ఉంటే చెల్లించనున్నట్టు చెప్పారు.

### ఎన్‌పీఎస్‌కు, యూపీఎస్‌కు తేడా ఏంటి?




కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఉద్యోగులకు ఎన్‌పీఎస్ అమలు చేస్తున్నది. దీంట్లో కచ్చితంగా ఇంత మొత్తం పింఛన్ అందుతుందనే హామీ లేదు. ఉద్యోగి తన సర్వీసులో పింఛన్ కోసం అందించిన కంట్రిబ్యూషన్‌ను ప్రభుత్వం పెట్టుబడిగా పెట్టి, దానిపై వచ్చే రిటర్న్స్‌పై పింఛన్ ఆధారపడి ఉంటుంది. యూపీఎస్ అంటే కచ్చితంగా ఇంత పింఛన్ అందుతుందనే హామీ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఉంటుంది.

## కోర్టు ఆదేశించినా విచారించరా?

- సీఎం సిద్ధరామయ్యపై ‘లంచం’ ఆరోపణలు
- విచారణ నిర్వహించని లోకాయుక్త పోలీసులు
- నోటీసులు జారీ చేసిన ప్రజాప్రతినిధుల కోర్టు



బెంగళూరు: వాల్మీకి స్కామ్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు మరిన్ని చిక్కులు తప్పేలా లేవు. ఆయనపై నమోదైన 2014నాటి ముడుపుల కేసులో లోకాయుక్త పోలీసుల తీరుపై ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. విచారణకు ఆదేశించినప్పటికీ పట్టించుకోకపోవడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సిద్ధరామయ్య మొదటిసారి సీఎంగా ఉన్నప్పుడు 2014 జూలై 28న మైసూరులోని వివేక్ హోటల్స్ ఎండీ వివేకానంద అలియాస్ కింగ్స్ కోర్టు వివేక్ వద్ద నుంచి రూ.1.3 కోట్ల చెక్కును లంచంగా తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. బెంగళూరు టర్ఫ్ క్లబ్ లిమిటెడ్‌కు స్టెవార్డ్‌గా నియమించేందుకు ముడుపులు తీసుకున్నారని ఆరోపణ. ఈ కేసులో క్విడ్ ప్రోకో జరగలేదని పేర్కొంటూ గత ఏడాది జూన్ 7న కర్ణాటక లోకాయుక్త డిప్యూటీ ఎస్పీ కోర్టులో కేసు క్లోజర్ రిపోర్టును సమర్పించారు.

### ఆరు నెలలైనా విచారణ ప్రారంభించలే

లోకాయుక్త నివేదికను సవాల్ చేస్తూ బీబీఎంపీ మాజీ కౌన్సిలర్ రమేశ్ కోర్టును ఆశ్రయించారు. మరోసారి విచారణ జరపాలని ప్రత్యేక కోర్టు ఫిబ్రవరి 21న లోకాయుక్త ఎస్పీని ఆదేశించింది. ఆరు నెలలైనా కేసులో విచారణ జరగలేదు. కోర్టు ఉత్తర్వులపై సమాచారం లేదని, అందుకే విచారణ జరపలేదని విచారణ అధికారి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో న్యాయమూర్తి సంతోశ్ గజానన్ భట్.. లోకాయుక్త పోలీసులకు షోకాజ్ నోటీసు జారీ చేసి, విచారణను సెప్టెంబరు 12కు వాయిదా వేశారు.

- భారత సరిహద్దుల్లో బంగ్లా సుప్రీం మాజీ జడ్జి అరెస్ట్
- హైదరాబాద్‌కు వస్తుండగా పుణెలో కూలిన హెలికాప్టర్
- 8 రోజుల కోసం వెళ్లి.. 80 రోజులుగా చిక్కుకొని
- 10 వేల కోట్లతో 'విజ్ఞాన్ ధార' పథకం: కేంద్రం
- కేంద్రంపై మళ్లీ దేశవ్యాప్తంగా రైతుల ఆందోళనలు

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

ఆదివారం SUNDAY 25.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+32 పేజీల ఆదివారం అనుబంధం Pages: 12+4+32 Pages SUNDAY supplement | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 81 ‖ వెల (Price) రూ.8.00 | సప్తమి

ఆదివారం, సూర్యోదయం: 6-01, సూర్యాస్తమయం: 6-35. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షం తిథి: సప్తమి తెల్లవారుజామున 3-39 వరకు. నక్షత్రం: భరణి సాయంత్రం 4-45 వరకు. వర్జ్యం: తెల్లవారుజామున 4-21 నుంచి తెల్లవారుజామున 5-53 వరకు. రాహుకాలం: సాయంత్రం 4-59 నుంచి సాయంత్రం 6-33 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 4-53 నుంచి సాయంత్రం 5-43 వరకు. అమృతకాలం: పగలు 12-13 నుంచి పగలు 1-43 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline


కొత్త టేపులు తెచ్చి కొల్చుకోండి.. నా ఫామ్ హౌస్ ఎఫ్‌టీఎల్‌లోనో, బఫర్ జోన్‌లోనో ఉంటే కూల్చుకోండి.. ఇదీ ఓ మంత్రిగారు విసిరిన సవాల్

జలాశయం పక్కనే ఎకరాల్లో ఇల్లు కట్టుకున్న మంత్రి ఇంత ధాటిగా ఎలా మాట్లాడారు అని ఆరా తీస్తే.. లోపలెక్కడో దాచిపెట్టిన మెమో ఎవరికి తెలుస్తుందిలే అన్న ధైర్యమే ఆ మాటల వెనుక ఉన్నదని బయటపడింది.


కానీ,దాచిపెట్టిన మెమోను నమస్తే తెలంగాణ జనం ముందుకు తెస్తున్నది. హైదరాబాద్ జంట జలాశయాల పరిధిలో నిర్మాణాలకైనా, కూల్చివేతలకైనా ప్రాతిపదిక ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ కానే కావు. ఎఫ్‌టీఎల్ నుంచి 500 మీటర్ల దూరం అంటే అక్షరాల అరకిలోమీటరు వరకూ నిషిద్ధ ప్రాంతం. అక్కడ ఎలాంటి కట్టడాలూ కట్టకూడదు. కడితే కూల్చిపారేయాలి. ఇది 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించి మరీ తెచ్చిన మెమో (261/I1/2006, Dt.16.7.2007) సారాంశం.

మరోవైపు భవన నిర్మాణ అనుమతుల కోసం 7.4.2012న కాంగ్రెస్ ప్రభుత్వమే 19 జీవోలను మేళవించి కొత్తగా 168 జీవోను ఇచ్చింది. దీని ప్రకారం ఎఫ్‌టీఎల్ నుంచి 100 మీటర్ల పరిధిని రిక్రియేషన్ జోన్‌గా పరిగణించింది. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్ట కూడదు.

మరి మీరే చూడండి. కింది ఫొటోల్లో కనిపిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇల్లు (1వ ఫొటో), ఎమ్మెల్యే వివేక్ ఫామ్‌హౌస్ (2వ ఫొటో) జలాశయానికి 100 మీటర్ల దూరం పైబడి ఉన్నాయా? కనీసం అర కిలోమీటర్ దూరం పైబడి ఉన్నాయా? ఉన్నట్టు మీకు అనిపిస్తున్నాయా? కనిపిస్తున్నాయా?

## కొత్తగా టేపులు కొనడం అవసరమా?




## ఈ సర్కారుకు వీటిని కూల్చే దమ్ముందా?




# టేపులెందుకు దండగ.. ఉత్తర్వులే ఉండగ!

**ఈ ప్రభుత్వానికి ఒక చట్టం లేదు. ఒక నిబంధన లేదు.** ఒక విధానం లేదు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కుల పట్ల కనీస గౌరవం లేదు. ఆఖరుకు పౌరునికి తన వాదన వినిపించుకునే సమయం కూడా లేదు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా.. ఏ ఒక్క వాదనా వినకుండా..ఏ చట్ట ప్రక్రియనూ పాటించకుండా అర్ధరాత్రి.. తెల్లవారు జామున..దానితో పాటు శని, ఆది వంటి కోర్టులకు సెలవులుండే రోజుల్లో.. ఏదో శత్రుదేశం మీద జరిపినట్టు దాడులు, ధ్వంసాలు. కనీసం ఇంట్లోని విలువైన లేదా అవసరమైన వస్తువులు కూడా తీసుకునే వ్యవధి ఇవ్వకుండా కూల్చివేతలు.

**అక్రమాలని ఎవరు నిర్ధారించారు? ఏ పద్ధతి పాటించారు?** తెలియదు.. నిర్మించిన వారి వాదన ఏమిటి? తెలియదు.. మరి అలాంటి స్థలంలో ఎలా అనుమతులిచ్చారు? తెలియదు.. ఇంటి నంబరు, విద్యుత్తు, మంచినీరు, రహదారి తదితర పౌర సౌకర్యాలు ఎలా కల్పించారు? తెలియదు. ఒకే స్థలంలో ఒక భవనం కూల్చి పక్కనే మరో భవనాన్ని మాత్రం ఎందుకు ముట్టుకోవడం లేదో అంతకన్నా తెలియదు.

**అక్రమ నిర్మాణమైతే నిరభ్యంతరంగా కూల్చేయండి. తప్పు లేదు.** కానీ భారత రాజ్యాంగం, చట్ట సభలు ఇందుకోసం కొన్ని చట్టాలు రూపొందించాయి. వాటిని పాటించాలి. నోటీసులివ్వాలి. వాదనలు వినాలి. తగినంత సమయం ఇచ్చి తర్వాత కూల్చివేతలు మొదలు పెట్టాలి. అంతేగాని రాత్రికి రాత్రి పిండారీలు మీద పడట్టు ఈ దాడులేమిటి? రజాకార్లు ఊరిమీద పడట్టు ఈ భయోత్పాతం సృష్టించడమేమిటి? ఆ భవనాలేం రాత్రికి రాత్రి ఎక్కడికన్నా పారిపోతాయా?! వాటిని నిర్మించిన వారు ఎక్కడికైనా ఎత్తుకుపోతారా? కోర్టుకు పోయే అవకాశం కూడా ఇవ్వకుండా ఈ చీకటి దాడులేమిటి?

**కూల్చివేతల్లో ఒక్క కాంగ్రెస్ నేత భవనమూ ఎందుకు లేదు?** ప్రత్యర్థి పార్టీ నేతలే టార్గెట్‌గా ఫ్యాక్షన్ రాజకీయాలు నడుస్తున్నాయి. రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి, ప్రత్యర్థులను టెర్రరైజ్ చేయడానికి 'ఏలినవారు కోరిన కోర్కెలు' తీర్చని వారిపై కక్ష తీర్చుకోవడానికి ప్రభుత్వం ఉత్తరాదిలోని బుల్డోజర్ రాజకీయం ఎంచుకుందా? దీని వెనక ఉన్న ఎత్తుగడ ఏమిటి? ప్రభుత్వం గమనించిందో లేదో ఇలాంటి కూల్చివేతల మీద ఈ మధ్యే ఒక కోర్టు '20 ఏండ్ల క్రితం కట్టిన భవనానికి అన్ని రకాల అనుమతులు ఇచ్చి, పౌరసౌకర్యాలన్నీ కల్పించి, పన్నులు కూడా వసూలు చేసుకొని ఇప్పుడు హఠాత్తుగా అక్రమ కట్టడమని కూలుస్తామంటారా?' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలో ఒక రాజ్యాంగం ఉంది. దాన్ని ప్రభుత్వం, దాని తాలూకు కూల్చివేతల బ్రిగేడ్‌లు గమనించాలి! రాష్ట్రం ఎవరి జాగీరు కాదు!

## ఎఫ్‌టీఎల్ నుంచి 500 మీటర్ల దాకా ఇటుక పేర్చొద్దు.. గోడ కట్టొద్దు

### అది పూర్తిగా నిషిద్ధ ప్రాంతం.. 2007లోనే పురపాలక శాఖ మెమో జారీ

### కిలోమీటరు పరిధిలోని నిర్మాణాలపైనా ప్రత్యేక ఆంక్షలు విధించిన సర్కారు

- **ఈ మెమో మేరకే నిర్మాణ అనుమతులకు ఎన్‌వోసీ జారీ**
- **బయటికి రాకుండా మెమోను తొక్కిపెడుతున్న జలమండలి**
- **జీవో 168 ప్రకారమూ వంద మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు**

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్) నుంచి అర కిలోమీటరు వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జారీచేసిన మెమోలో ఉన్న కీలకమైన నిబంధన ఇది. ఈ రూల్‌ను ఏదో ఆషామాషీగా తీసుకురాలేదు. ఈపీటీఆర్ఐ, ఐఐసీటీ, ఎన్జీఆర్ఐ వంటి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలతో వివిధ శాఖల ఇంజినీర్లు కలిసి ఏకంగా రెండేండ్లపాటు లోతైన అధ్యయనం చేసిన తర్వాతే ఈ నిబంధనలను తీసుకొచ్చారు. కూల్చివేతలకు కారణమేంటని హైడ్రా అధికారులను అడిగితే, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఈ నిర్మాణాలు ఉన్నాయని చెప్తున్నారు. 2007 మెమో ప్రకారం ఎఫ్‌టీఎల్ నుంచి అర కిలోమీటరు వరకు ఉన్న నిర్మాణాలను కూడా కూలగొట్టాలి › 2వ పేజీలో

### 111 జీవో ప్రాంతాలకూ
## హైడ్రా విస్తరణ?



- పరిధి పెంచనున్న ప్రభుత్వం
- రేపో మాపో ఆర్డినెన్స్ జారీ
- అందుకోసమే అసెంబ్లీ ప్రొరోగ్ › 3

### సినీ పెద్దలు కలవలేదనే కక్ష!

- ఎన్ కన్వెన్షన్‌పై మంత్రి కోమటిరెడ్డి ఫిర్యాదు
- మూడు రోజుల్లోనే నేలమట్టం చేసిన హైడ్రా › 3

## టార్గెట్ పల్లా



అనురాగ్, గాయత్రి విద్యా సంస్థల భవనాలు బఫర్‌జోన్‌లో ఉన్నాయని ఇరిగేషన్‌శాఖ ఫిర్యాదు

పోచారం ఐటీ కారిడార్ పీఎస్‌లో కేసు నమోదు

రాజకీయ కక్షలతోనే కేసులు.. చట్టపరంగా పోరాడుతాం: పల్లా రాజేశ్వర్‌రెడ్డి › 2

- సీఎం రేవంత్.. వింటున్నారా?




## బుల్డోజర్ న్యాయం అనాగరికం

ఎవరైనా వ్యక్తి తప్పు చేసినట్టు ఆరోపణలు వస్తే.. అతడు తప్పు చేశాడా, లేదా? అని నిర్ధారించి, శిక్ష వేయాల్సింది కోర్టు. ఏవైనా ఆరోపణలు రాగానే న్యాయన్యాయాలను విచారించకుండా ప్రభుత్వమే కూల్చడం చట్టాలను పాటించకపోవడమే అవుతుంది. ఇది తీవ్ర అనాగరికం, అన్యాయం. బుల్డోజర్ న్యాయం ఆమోదనీయం కాదు. అలాంటి కూల్చివేతలు వెంటనే ఆపాలి.

- ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ నాయకురాలు
(బుల్డోజర్ న్యాయంపై శనివారం చేసిన వ్యాఖ్యలు)

### నాగార్జున ఎన్ కన్వెన్షన్
# కూల్చివేత

- తెల్లవారుజాము నుంచే హైడ్రా ఆపరేషన్
- తుమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో 3.30 ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు: రంగనాథ్
- ఫిర్యాదులు రావడంతోనే కూల్చివేత › 3



తుమ్మిడికుంట చెరువును ఆనుకుని ఉన్న నటుడు నాగార్జున ఎన్‌కన్వెన్షన్ సెంటర్‌ను కూల్చేసిన దృశ్యం

## అంగుళం భూమినీ ఆక్రమించలేదు!

- కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా కూల్చివేతలు
- నోటీసులివ్వకుండా కూల్చడం బాధాకరం
- తీర్పు వ్యతిరేకమైతే నేనే కూల్చేస్తా: నాగార్జున › 3

## నోటీసులు, గడువు ఇవ్వకుండా ఎట్ల కూలుస్తరు?


- ఏ నిబంధన కింద ఇంత అర్జంట్ చర్యలు
- హైడ్రాను నిలదీసిన హైకోర్టు.. స్టే విధింపు › 3

## కొలువు రాలేదని ఆత్మహత్య

భూదాన్‌పోచంపల్లిలో విషాదం › 7

## డెంగ్యూతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో ఘటన › 6



## ప్రజాభవన్ ముట్టడి తథ్యం

- రుణమాఫీకి డెడ్‌లైన్ సెప్టెంబర్ 15
- రైతు ఐక్య కార్యాచరణ కమిటీ అల్టిమేటం
- రైతుల నిరసనకు బీఆర్‌ఎస్ సంఘీభావం
- హాజరైన వేముల, బాజిరెడ్డి, జీవన్‌రెడ్డి › 7
- ఆర్మూర్‌లో రైతుల మహాధర్నా సక్సెస్

*షరతుల్లేని రుణమాఫీ, రైతుభరోసా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని నిజామాబాద్ రూరల్, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల పరిధిలోని రైతులు మామిడిపల్లి చౌరస్తాలో శనివారం మహాధర్నా నిర్వహించారు.*



*శనివారం హైదరాబాద్ మహిళా కమిషన్ కార్యాలయంలో కేటీఆర్‌కు రాఖీ కడుతున్న మహిళా కమిషన్ సభ్యురాలు*



## తెలంగాణ పాములను కాపాడుతున్నదెవరు?

హైదరాబాద్‌లో కర్ణాటక వాల్మీకి స్కామ్ లింకులు

- ఆర్బీఎల్ బ్యాంకుకు చెందిన 9 ఖాతాల్లో 45 కోట్లు జమ › 10
- స్కామ్‌కు సంబంధించి రాష్ట్రంలో సిట్, సీబీఐ, ఈడీ సోదాలు
- వాల్మీకి కార్పొరేషన్ స్కామ్ విచారణలో రోజుకో కొత్త మలుపు
- సూసైడ్‌తో స్కామ్ గుట్టురట్టు చేసిన సూపరింటెండెంట్‌పై కేసు
- అతడే కీలక నిందితుడు అని పేర్కొంటూ సిట్ రెండో చార్జిషీట్
- తన భర్తను కావాలనే ఇరికిస్తున్నారన్న మృతుడి భార్య కవిత



## సిద్ధూ ఔట్?

- కర్ణాటకలో సీఎం మార్పు?
- పీకల్లోతు కేసుల్లో సీఎం › 10
- సిద్ధూకు మద్దతంటూనే ప్లాన్ బీ సిద్ధం చేస్తున్న హైకమాండ్

## బేసిక్‌పై 50% పింఛన్


- **యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ప్రకటించిన కేంద్రం**
- **చివరి 12 నెలల సగటు బేసిక్ పేపై 50% పెన్షన్**
- **2004 ఏప్రిల్ 1 తర్వాత చేరిన వారికి వర్తింపు**
- **23 లక్షల మంది కేంద్ర ఉద్యోగులకు ప్రయోజనం**
- **ఎన్‌పీఎస్‌లో కొనసాగడమా, యూపీఎస్‌లో చేరడమా అన్నది ఉద్యోగులే నిర్ణయించుకోవచ్చు** › 10

## రాఖీ కడితే నోటీసులు!

- కేటీఆర్‌కు దట్టి, రాఖీలు కట్టిన ఆరుగురు మహిళా కమిషన్ సభ్యులకు తాఖీదులు
- వారికి నోటీసులు జారీ చేసిన చైర్‌పర్సన్
- మహిళా కమిషన్ ఎదుట కేటీఆర్ హాజరు
- యథాలాపంగా చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేసినట్టు కమిషన్‌కు వివరించా
- మరోసారి రమ్మన్నారు.. తప్పకుండా వెళ్తా

**బీఆర్‌ఎస్ మహిళా నేతలపై కాంగ్రెస్ మహిళా నేతల దాడులను ఖండిస్తున్నా: కేటీఆర్** › 5

# బఫర్ ముట్టుకోవద్దు




## 'నమస్తే' కథనంపై అధికారపక్ష నేతల్లో కలకలం

- హైడ్రా కమిషనర్‌కు మంత్రులు, ముఖ్యనేతల పిలుపు
- ఎఫ్‌టీఎల్ వరకే పరిమితం కావాలని అల్టిమేటం ..
- తమవీ కూల్చాలని ప్రజలు డిమాండ్ చేస్తారని భయం

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): హైడ్రా పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న రాజకీయ హైడ్రామాపై శనివారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనం కాంగ్రెస్‌లో కలకలం సృష్టించింది. గండిపేట (ఉస్మాన్‌సాగర్), హిమాయత్‌సాగర్ చుట్టూ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు కట్టుకున్న విలాసవంతమైన ఇండ్లు, ఫామ్‌హౌజ్‌లను ఆధారాలతో బయటపెట్టడంతో అధికారపక్ష నేతలు ఉలిక్కిపడ్డారు. 'నిబంధనలకు విరుద్ధంగా ఉంటే మా భవనాలనూ కూలగొట్టండి' అని గంభీర ప్రకటనలు చేసినవారు కూడా నాలుక కరుచుకున్నట్టు తెలిసింది. కొందరు మంత్రులు, ముఖ్యనేతలు శనివారం ప్రత్యేకంగా సమావేశమై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను పిలిపించుకున్నట్టు సమాచారం. చెరువులు, నాలాల ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాల వరకు మాత్రమే పరిమితం కావాలని, బఫర్ జోన్‌ను ముట్టుకోవద్దని అల్టిమేటం జారీ చేసినట్టు తెలిసింది. బఫర్ జోన్ పరిధిలో అధికారపక్ష నేతల భవనాలు ఉన్నాయని, వాటిని కూల్చాలని ప్రజల నుంచి డిమాండ్లు వస్తాయని, అన్ని వర్గాల నుంచి ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని చెప్పారట. 'మీ కూల్చివేతలతో మా ఇంటి కిందికే నీళ్లు వచ్చేలా ఉన్నాయి' అని వాపోయారని సమాచారం. మా ఇంటి దగ్గరికి మీరు వచ్చినా.. మేమే ఇల్లు ఖాళీ చేసినా అక్రమ నిర్మాణం అని ఒప్పుకున్నట్టు అవుతుందని, పరువు గంగలో కలుస్తుందని చెప్పుకొచ్చారట. ఎఫ్‌టీఎల్ వరకే పరిమితం అయితే ఇబ్బంది ఉండదని సూచించినట్టు సమాచారం. మంత్రుల విన్నపంపై సీపీ ఎలాంటి సమాధానం ఇవ్వలేదని తెలిసింది.

### ఎఫ్‌టీఎల్.. లెక్క ఎలా తెలిసింది?

ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌ను తగ్గించిన విషయం బయటికి ఎలా పొక్కిందని మంత్రులు రుసరుసలాడినట్టు సమాచారం. ఎఫ్‌టీఎల్ 1970 అడుగులు అనే లెక్కతోనే 'మా భవనాలు ఉన్నా కూల్చేస్తాం' అని గంభీర ప్రకటనలు చేశారని చెప్తున్నారు. అసలు ఎఫ్‌టీఎల్ 1972 అడుగులు అని బయటికి రావడంతో పచ్చి వెలక్కాయ గొంతులో పడినట్టు అయ్యిందని సమాచారం. 1972 అడుగులు అనే విషయాన్ని ఎందుకు బయటపెట్టారని జలమండలి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. 1972 అడుగుల ప్రకారం కొలిస్తే.. ఒక్క ఇటుక కాదు, మొత్తం భవనాలే ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే ప్రమాదం ఉన్నదని చర్చించుకుంటున్నారట. ఈ అంశాలపై వివరణ కోరేందుకు జలమండలి అధికారులను ప్రయత్నించగా.. అధికారులు సమాధానం ఇవ్వకుండా 'ఇవన్నీ మీకెవరు ఇస్తున్నారు?' అంటూ ఎదురు ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్ 1792 అడుగుల గొడవ ఇప్పుడు ఎందుకు?, ఈ అంశంలో నోరు మెదపవద్దని మాకు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు ఉన్నాయి.. అంటూ సమాధానం ఇచ్చారు.

### వాళ్లే ఒప్పుకుంటారా.. వీళ్లు కూలగొడతారా?

ప్రతిపక్ష నేతల ఆస్తులను లక్ష్యంగా చేసుకొని హైడ్రాకు రూపకల్పన చేస్తే, అధికారపక్ష నేతల బండారం బయటపడిందని చెప్పుకుంటున్నారు. హైడ్రా బుల్డోజర్లు వాళ్ల ఇండ్లదాకా వెళ్తాయా? లేదా? అని ఆసక్తికర చర్చ జరుగుతున్నది. 'వాళ్లే ఖాళీ చేస్తే.. చెరువులను ఆక్రమించామని ఒప్పుకున్నట్టు అవుతుంది. హైడ్రా అధికారులు వెళ్లి కూల్చితే అక్రమ నిర్మాణాలని అధికారికంగా ప్రకటించినట్టు అవుతుంది. ఏం జరిగినా వాళ్లు కూడా దొంగలే అనే ముద్ర తప్పదు' అని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ మిగతావారివి కూల్చి, అధికార పక్ష నేతలవి ముట్టుకోకపోతే ప్రజల్లో తిరుగుబాటు మొదలవుతుందని అంటున్నారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రారంభించిన రాజకీయ డ్రామా భస్మాసుర హస్తంగా మారే అవకాశం ఉన్నదని విశ్లేషకులు చెప్తున్నారు.

---



# రేవంత్.. డైవర్షన్ పాలిట్రిక్స్!

- రుణమాఫీ వైఫల్యం నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ఎత్తుగడలు
- మొదటి నుంచీ ముఖ్యమంత్రిది అదే తీరు
- బియ్యం స్కాం వెలుగు చూడగానే ఫోన్ ట్యాపింగ్ లీక్‌లు
- అమెరికా పర్యటన ఒప్పందాలపై విమర్శలు రావడంతో తెరపైకి తెలంగాణతల్లి, రాజీవ్‌గాంధీ విగ్రహాల వివాదం
- రైతుల ఆగ్రహాన్ని కప్పిపుచ్చేందుకు కూల్చివేతల పర్వం

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రగతి, ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న ఒక పెద్ద అంశం తెరపైకి వచ్చి సర్కార్‌ను అతలాకుతలం చేస్తున్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగిపోవడం, ప్రజల దృష్టిని మళ్లించేందుకు పరుష భాషను ప్రయోగించడం, లేదంటే దృష్టి మళ్లింపు చర్యలకు అవసరమైన ఆసక్తికరమైన అంశాన్ని ఎంపిక చేసుకోవడమే పాలనగా భావిస్తున్నారా? అంటే రాష్ట్రంలో జరుగుతున్న వరుస పరిణామాలు అవుననే అంటున్నాయి. అసంపూర్ణ రుణమాఫీపై రైతులు ఊరూరా రణగీతం ఆలపిస్తున్నారు. ఆ వాతావరణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ఎత్తుగడలో భాగంగా ఇతర అంశాలను ఉద్దేశపూర్వకంగానే తెరమీదికి తెస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. గత డిసెంబర్ 7న కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరినప్పటి నుంచి తాజాగా శనివారం 'ఎన్' కన్వెన్షన్ కూల్చివేతల దాకా సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న వైఖరే అందుకు సాక్ష్యంగా కనిపిస్తున్నది. రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలపై రైతుల నుంచి వ్యతిరేకత వస్తున్నది. వీటినుంచి తప్పించుకోవడానికి రేవంత్‌రెడ్డి సర్కార్ దారులు వెదుక్కుంటున్నదని అందులో భాగంగా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని బీఆర్‌ఎస్ ఆరోపిస్తున్నది. మరోవైపు రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో ఇద్దరు మహిళా జర్నలిస్టుల పట్ల సీఎం అనుచరుల హంగామా జాతీయ స్థాయిలో మార్మోగుతున్నది. ఈ వ్యతిరేకత నుంచి ఇప్పటికిప్పుడు తప్పించుకోవడానికి సీఎం ఎంచుకున్న మార్గమే సినీనటుడు నాగార్జునకు చెందిన 'ఎన్' కన్వెన్షన్‌ను కూల్చివేత అనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### రుణ రణ జనగీతం

రుణమాఫీ విషయంలో రైతుల్లో ఆగ్రహం పెల్లుబికుతున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ రైతులు నిలదీస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ వారికి అండగా నిలబడుతున్నది. రాష్ట్రంలో కొత్త బ్రాండ్ల మద్యం రాబోతున్నదని, బియ్యం కొనుగోలు టెండర్లలో రూ.1,100 కోట్ల కుంభకోణం జరిగిందనే విషయం వెలుగులోకి రాగానే ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్ సర్కార్ హయాంలో ఫోన్‌ట్యాపింగ్ జరిగిందంటూ లీక్ లిచ్చి, మీడియాలో డెయిలీ సీరియళ్లను మించిన కథనాలు వండివార్చారు. మరోవైపు, సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు కోసం ఉద్దేశించిన స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో తెలంగాణ మేధో సమాజం సీఎం వ్యవహరిస్తున్న తీరుపై రాహుల్‌గాంధీకి లేఖ రాసింది. అమెరికా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తన సోదరుడి సంస్థతో రూ.1,000 కోట్ల ఒప్పందం దుమారం రేపింది. వీటి నుంచి దృష్టిని మళ్లించేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారు.

### ఒకటా.. రెండా.. అసెంబ్లీ సాక్షిగా అనేకం!

**రాష్ట్రంలో** మహిళలపై దాడులు జరుగుతున్నాయని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అసెంబ్లీ సాక్షిగా సర్కార్ వైఫల్యాలను ఎండగడితే, వాటిపై సమాధానం చెప్పాల్సిందిపోయి 'ఆ ఇద్దరు అక్కలను నమ్ముకుంటే బతుకు జూబ్లీ బస్టాండే' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి తీరును రాజకీయ విశ్లేషకులు ఉదహరిస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్తు కొనుగోళ్లపై చర్చ జరిగిన సందర్భంలో 'మోటర్లకు మీటర్లు పెడతామని కేసీఆర్ సర్కార్ సంతకాలు చేసింది' అంటూ సభలో సమాధానాలు చెప్పకుండా అసత్యాలు ప్రచారం చేయడం, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు విషయంలోనూ సభను తప్పుదారి పట్టించి విమర్శల పాలు కావడం, బీఆర్‌ఎస్ సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇవ్వడం తెలిసిందే. కాంగ్రెస్ సర్కార్ అసెంబ్లీ వేదికగా 2 లక్షల ఉద్యోగాల భర్తీకి సంబంధించి జాబ్ క్యాలెండర్ విడుదల అని లీకులు ఇచ్చింది. తీరా ఉద్యోగాల సంఖ్య లేకుండా ఇప్పటికే ప్రకటించిన పరీక్షల తేదీలను స్టేట్‌మెంట్ రూపంలో అసెంబ్లీలో వెల్లడించి ఉద్యోగార్థుల దృష్టిని దారిమళ్లించే ప్రయత్నం చేశారు. ఇక రుణమాఫీ జన నిరసన గీతం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు 'ఎన్' కన్వెన్షన్ కూల్చివేతను సీఎం తెరమీదికి తెచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

---

# టేపులెందుకు దండగ.. ఉత్తర్వులే ఉండగ!

మొదటిపేజీ తరువాయి...

కదా! అని మీకు సందేహం కలుగుతుంది కదూ.. ఇక్కడే అసలు మతలబు దాగి ఉంది. జంట జలాశయాలకు సంబంధించి 2007 నాటి అత్యంత కీలకమైన నిబంధనలు ఉన్న అంతర్గత ఉత్తర్వులను జలమండలి అధికారులే తొక్కి పెడుతున్నారు. కొందరు 'ఇది మాకు తెల్వదే' అంటున్నారు. కానీ 'నమస్తే తెలంగాణ' చేతికి 2007లో జారీ చేసిన మెమో (మెమో నెంబర్ 261/ఐ1/2006, తేదీ: 16.07.2007) చిక్కింది. దీంతో ఇందులోని అసలు విషయం బయటికొచ్చింది. జంట జలాశయాల పరిరక్షణ కోసం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు మాత్రమే కాదు నిషేధిత జోన్, ఆంక్షల జోన్ కూడా ఉన్నట్టు ఈ మెమో ద్వారా బయటపడింది. మరి, జలాశయాల పరిరక్షణకు కేవలం ఎఫ్‌టీఎల్‌ను మాత్రమే పర్యవేక్షిస్తామంటే అదెలా సమంజసం అవుతుంది? అన్ని జోన్లలో నిబంధనలు ఉండాలి కదా!

### మేకపోతు గాంభీర్యం అందుకే!

ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలను మాత్రమే హైడ్రా కూల్చేస్తుండటం.. 2007 నాటి మెమోను జలమండలి అధికారులు ఉద్దేశపూర్వకంగా తొక్కిపెడుతుండటంతో.. బఫర్, నిషేధిత, ఆంక్షల జోన్‌లో నిర్మాణాలు ఉన్న వాళ్లు ఎలాంటి భయంలేకుండా ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తున్నారు. మెమో ఎలాగూ బయటకు రాదన్న ధీమాతో 'కొత్త టేపులు కొనుగోలు చేసి తెచ్చుకోండి... కొలుచుకోండి' అంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే, గత కాంగ్రెస్ ప్రభుత్వమే రూపొందించిన 'అర కిలోమీటరు' నిబంధన అమలు మెమో వెలుగుచూడటంతో ఇక ఎలాంటి టేపులు ఇప్పుడు అవసరం లేదని తేలిపోయింది.

### గత ప్రభుత్వాలు ఏమేం చేశాయి?

హైదరాబాద్ ఎగువన నగర శివారులోని హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల పరిరక్షణపై ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా కొత్తగా ఏర్పాటుచేసిన హైడ్రా ఇప్పటికే ఎఫ్‌టీఎల్ పరిధిలో తాము గుర్తించిన మేరకు కొన్ని అక్రమ నిర్మాణాలను కూల్చివేసింది. దీంతో ఇప్పుడు జలాశయాల చుట్టూ అసలు నిర్మాణాలు ఎంత పరిధిలో ఉండటం అక్రమం? ఏ పరిధి దాటిన తర్వాత ఎంత వరకు ఉండవచ్చు? అనేది చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో జంట జలాశయాల పరిరక్షణకు ఉమ్మడి రాష్ట్రంలో గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు అనేకసార్లు అధ్యయనాలు చేయించి ఎప్పటికప్పుడు కఠినమైన నిబంధనలు అమలులోకి తెచ్చాయి. ఈ మేరకు జీవోలు, మెమోలు కూడా జారీ అయ్యాయి.

### 1989లో చెక్‌డ్యాంల తొలగింపు


హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఇప్పుడంటే మంజీరా, కృష్ణా, గోదావరి జలాలు అందుబాటులో వచ్చాయి. అయితే, అప్పట్లో హైదరాబాదీల తాగునీటికి హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) జంట జలాశయాలే శరణ్యంగా ఉండేవి. ఈ క్రమంలో ఈ జలాశయాల్లో నీటి నిల్వలు ఎప్పుడూ నిండుగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో ఈ జలాశయాలకు ఎగువ నుంచి వరద వచ్చేందుకు ఎగువ ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు కట్టకుండా 1989లో జీవో 50ని తీసుకొచ్చారు. అనధికారికంగా నిర్మించిన చెక్‌డ్యాంలను తొలగించాలనేది ఈ జీవో ముఖ్యోద్దేశం.

### 1994లో కాలుష్య నివారణకు జీవో

నగరీకరణ నేపథ్యంలో జంట జలాశయాల చుట్టూ నివాసాలు భారీగా పెరిగాయి. దీంతో జంట జలాశయాల నీరు కలుషితం కావడం మొదలైంది. ఈ క్రమంలో జలాశయాల్లోని నీటి వనరులు కలుషితం కావొద్దన్న ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం అధ్యయనం కోసం 1993లో ఓ నిపుణుల కమిటీని నియమించింది. ఏడాదిపాటు సుదీర్ఘ అధ్యయనం చేసిన ఆ కమిటీ ప్రభుత్వానికి ఓ మధ్యంతర నివేదిక ఇచ్చింది. నివేదికలోని అంశాలను బట్టి అప్పటి సర్కారు 31.3.1994న జీవో 192ను జారీ చేసింది. జంట జలాశయాల ఎఫ్‌టీఎల్‌కు 10 కిలోమీటర్ల వ్యాసంలోని పరీవాహక ప్రాంతంలో ఎలాంటి కాలుష్యకారక పరిశ్రమలు, భారీ హోటళ్లు, నివాస కాలనీలతో పాటు కాలుష్యకారకాలైన కార్యకలాపాలు నిర్వహించకూడదని ఆ జీవోలో నిబంధనలను తీసుకొచ్చింది. ఏమైనా నిర్మాణాలు చేపట్టాలనుకుంటే కచ్చితంగా జలమండలి, పీసీబీ, డీటీసీపీ, హుడా, పరిశ్రమల శాఖ నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌వోసీ) తీసుకోవాలని ఆ జీవోలో సూచించారు.

### 1996లో 84 గ్రామాలపై ఆంక్షలు

జలాశయాల్లో నీటి వనరులు కలుషితం కాకుండా ఉండేందుకు నిబంధనలు తీసుకొచ్చినప్పటికీ, జంట జలాశయాల చుట్టూ ఉన్న గ్రామాల వల్ల నీటి వనరులు కలుషితం అవుతున్నాయి. దీని నివారణ చర్యల కోసం ప్రభుత్వం నిపుణుల కమిటీని మరో అధ్యయనం చేయాల్సిందిగా ఆదేశించింది. 1995లో నిపుణుల కమిటీ ఇచ్చిన రెండో నివేదిక ప్రకారం, 8.3.1996న అప్పటి ప్రభుత్వం జీవో 111 ను జారీ చేసింది. పరీవాహక ప్రాంతాల నుంచి డౌన్‌స్ట్రీమ్‌లోకి వరద నీరు వచ్చే క్రమంలో కలుషితం కాకుండా ఉండేందుకు జంట జలాశయాల ఎఫ్‌టీఎల్ చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 84 గ్రామాల్లో నిర్మాణాలపై ప్రభుత్వం తీవ్ర ఆంక్షలు విధించింది. ఈ జీవో అమలు సుప్రీంకోర్టు దాకా వెళ్లింది. ఇప్పటికీ ఈ అంశం కోర్టు పరిధిలోనే ఉన్నది.


GOVERNMENT OF ANDHRA PRADESH
MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT DEPARTMENT


Memo No. 261/I1/2006 Dt: 16.07.2007.

2 And whereas, in 1993 Hyderabad Metro Water Supply & Sewerage Board constituted an Expert Committee to suggest ways and means to monitor the quality of water in the above two reservoirs. Based on the interim report of the Committee orders were issued in G.O.Ms.No. 192, dt: 31.03.1994 prohibiting the establishments of any polluting industries, major hotels, Residential colonies or other establishments that generate pollution in the catchment area within 10 km radius from Full Tank Level of above two lakes; permitting the development activities beyond 10 Km radius (within the catchment area) subject to No Objection Certificate from Hyderabad Metro Water Supply & Sewerage Board, Andhra Pradesh Pollution Control Board, Director of Town Planning, Hyderabad Urban Development Authority and Industries Department.

3 And whereas, in 1995, after detailed discussions and field visits the expert committee submitted second report, based on which orders were issued in G.O.Ms.No. 111, MA dt: 8.3.1996. The fundamental objective of this notification was to protect the above reservoirs by preventing upstream pollution and to certain extent downstream pollution and declare a zone as a prohibited zone. For this purpose 84 villages falling within 10 kms distance in the catchment area were notified as prohibited zone wherein polluting industries, major hotels, residential colonies or other establishments that generate pollution are prohibited and polluting industries are prohibited within 10 Km radius i.e., both on upstream and downstream side to prevent acidification of lakes (due to air pollution).

S.P.SINGH
PRINCIPAL SECRETARY TO GOVERNMENT

హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ చెరువుల ఎఫ్‌టీఎల్ నుంచి పది కి.మీ.ల వరకు నిషేధిత జోన్‌గా ప్రకటిస్తూ 1994, 1996ల్లో జారీ చేసిన జీవోలను వివరిస్తూ ప్రభుత్వం 16-07-2007న విడుదల చేసిన మెమో నెం. 261/I1/2006లో పేర్కొన్న అంశాలు


GOVERNMENT OF ANDHRA PRADESH
MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT DEPARTMENT


Memo No. 261/I1/2006 Dt: 16.07.2007.

7 Now, therefore, after careful consideration of the matter, Government with a view to prevent any possible direct pollution into the Osman Sagar / Himayat Sagar lakes proposes to issue following regulatory measures, which would be applicable to the downstream areas of above two Reservoirs:-

(i) No development will be allowed upto 500 m from the bund / Full Tank Level in the down stream and same shall be declared as prohibited zone.
(ii) Beyond 500 m and upto 1000 mts (one Km) in the downstream, only low rise residential development (ground + 2 floors) will be allowed.
(iii) Beyond 1000 mts distance in the down stream, all developments such as Residential, Commercial, IT Units, Hotels, Public and Semi Public developments will be allowed except 68 industries listed in Annexure-I of this Notification, subject to compliance of all other extant rules.
(iv) For protection of raw water channel from Osmansagar to Asifnagar no layout or building permission will be granted and while approving the layout along the above 100 feet distance shall be maintained.
(v) 30 Meter green belt will be earmarked all along the existing two surplus channels.
(vi) 30 Meter buffer zone will be maintained all along the reserve forest and the heritage structures.
(vii) As the proposal deals with the downstream areas only, the villages falling within 10 kms distance from the Full Tank Level / bund in the downstream are indicated in the Annexure-II of this notification.
(viii) Hyderabad Urban Development Authority will be designated as Nodal Agency to enforce the regulations; take action against the violators and develop green belt in the prohibited zone.
(ix) Hyderabad Metro Water Supply & Sewerage Board will (i) prepare a comprehensive integrated underground drainage system (ii) constitute a Special Watch and Ward Wing to monitor the water quality and to furnish the periodical reports to Nodal Agency for taking effective steps against the violators and for strict implementation of regulations.
(x) Other special measures proposed to be enforced, as recommended by the committee, are indicated in Annexure –III of this notification.

S.P.SINGH
PRINCIPAL SECRETARY TO GOVERNMENT


2005లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ చేసిన సిఫారసుల మేరకు 16-07-2007న విడుదల చేసిన మెమో నెం. 261/I1/2006లో ప్రభుత్వం పేర్కొన్న నియంత్రణ చర్యలు


GOVERNMENT OF ANDHRA PRADESH
MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT DEPARTMENT

Memo No. 261/I1/2006 Dt: 16.07.2007.

5 And whereas , the Technical Committee constituted by the Government has submitted their report recommending that upto 500 m from the bund / Full Tank Level in the down stream may be declared as Prohibited Zone, beyond 500 mts and upto 1000 mts (1Km) only low rise residential development (ground + 2 floors) may be allowed and beyond 1 Km distance in the downstream all developments such as Residential, Commercial, IT Units, Hotels, Public and Semi Public may be permitted. The Environment Protection Training & Research Institute while agreeing with the recommendations of the Committee have recommended that except 68 listed industries, all other industries / activities could be permitted in the down stream areas of the above two reservoirs.

హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ చెరువుల ఎఫ్‌టీఎల్ నుంచి నిషేధిత జోన్‌ను 500 మీ.లోపు, 1,000 మీ.లోపు, 1,000 మీ.లకు వెలుపల అని విభాగిస్తూ 2005లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ చేసిన సిఫారసు


GOVERNMENT OF ANDHRA PRADESH
MUNICIPAL ADMINISTRATION & URBAN DEVELOPMENT DEPARTMENT

Memo No. 261/I1/2006 Dt: 16.07.2007.

4. In order to protect raw water channel from Osman Sagar to Asifnagar, no layout or building permission shall be granted by MCH / HUDA / Director of Town and Country Planning up to a maximum of 100 feet from the conduit site boundary. While approving layout plans for building permission with the above condition also it shall be ensured that the conduit a minimum of 9 Meters wide road plus green belt to a maximum width of 100 feet shall be maintained to act as buffer on either side of conduit. The green belt which will be part of mandatory open space to be left out in the layout. Drainage pipelines must be laid parallel to the conduit and no sewage / sullage water discharges will be allowed from the layout towards the conduit.

5. The Government may take up a detailed drainage and sewerage plan for the entire area i.e., 10 km distance in the downstream of lakes. For augmenting the resources for this purpose, a special cess may be imposed while permitting any development activities in the downstream of the lakes.

S.P.SINGH
PRINCIPAL SECRETARY TO GOVERNMENT

2005లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ సిఫారసు చేసిన ప్రత్యేక చర్యలు

### అర్థంలేని వివరణ

**2007** మెమోపై 'నమస్తే తెలంగాణ' సంబంధిత జనరల్ మేనేజర్ డేవిడ్‌రాజును సంప్రదించగా.. మెమోలో బండ్ డౌన్‌స్ట్రీమ్ (దిగువ ప్రాంతం) అని ఉన్నదని, జలాశయాల బండ్ అంటే గేట్ల దిగువ భాగాన అని అర్థం వస్తుందని కొత్త అర్థం చెప్పారు. కానీ అదే మెమోలో బండ్‌తోపాటు ఎఫ్‌టీఎల్ అని కూడా ఉన్నదనే విషయాన్ని ఆయన విస్మరించారు. ఎఫ్‌టీఎల్‌కు దిగువ భాగం అంటే ఎఫ్‌టీఎల్ పరిధే అవుతుంది. ఇందులో కొత్తగా నిబంధనల అమలు ఏం అవసరం? సదరు అధికారి చెబుతున్నట్టు బండ్ దిగువ ప్రాంతమే అయితే మెమోలో ఎఫ్‌టీఎల్ దిగువ ప్రాంతం అని ఎందుకు పేర్కొంటారు? దీంతో పరీవాహక ప్రాంతం నుంచి జలాశయంలోకి వరద వచ్చే ప్రాంతాన్ని డౌన్‌స్ట్రీమ్‌గా పేర్కొన్నప్పటికీ జీఎం ఆ వాస్తవాన్ని పట్టించుకోలేదని అర్థమవుతున్నది. మరోవైపు జలాశయాల్లోకి వచ్చే వరద నీరు, జలాశయంలో ఉండే నీళ్లు కలుషితం కాకుండా ఉండేందుకే ప్రభుత్వం నియమించిన కమిటీ నిషేధిత జోన్‌ను సూచించింది. జీఎం చెబుతున్నట్టుగా బండ్ (గేట్లు బిగించిన ప్రాంతం) నుంచి దిగువ ప్రాంతంలో ఆంక్షలు అమలు చేస్తే ఎగువన ఉన్న జలాశయంలోని నీళ్లు ఎలా కలుషితం కాకుండా ఉంటాయి? బండ్ దిగువన వచ్చే నీళ్లు ఎలాగూ మూసీలోకి వెళ్తాయి. ఆ నీళ్లు కలుషితమైతే జంట జలాశయాల్లోని నిల్వలపై ఎలాంటి ప్రభావం ఉండదు కదా.

#### 2007 మెమోలో కఠిన నిబంధనలు ఇవి..

- పరీవాహక ప్రాంతం నుంచి దిగువకు (డౌన్‌స్ట్రీమ్) జంట జలాశయాల బండ్/ఎఫ్‌టీఎల్‌కు 500 మీటర్లు (అర కిలోమీటరు) వరకు ఉన్న పరిధి నిషేధిత జోన్‌గా పరిగణిస్తారు. ఇందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు.
- పరీవాహక ప్రాంతం నుంచి దిగువకు (డౌన్‌స్ట్రీమ్) అర కిలోమీటరు నుంచి కిలోమీటరు వరకు కేవలం నివాసాలకు మాత్రమే అనుమతులు ఇవ్వాలి. అవి కూడా జీ+2 వరకు మాత్రమే పరిమితం కావాలి.
- గండిపేట నుంచి ఆసిఫ్‌నగర్ వరకు ఉన్న కాండ్యూట్‌కు రెండువైపులా వంద ఫీట్ల వరకు లేఅవుట్లు, భవన నిర్మాణ అనుమతులు ఇవ్వొద్దు.
- 30 మీటర్ల చొప్పున గ్రీన్ బెల్ట్, బఫర్‌జోన్ నిర్వహించాలి.
- హుడా నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. జలమండలి సమగ్ర మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు జలాశయాల్లో నీటి నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించాలి.

### 2007లో కఠిన నిబంధనలు అమలు

గత ప్రభుత్వాలు అన్నిరకాల చర్యలు తీసుకున్నప్పటికీ జలాశయాల్లో నీరు కలుషితమవుతూనే ఉన్నది. జలాశయ పరీవాహక ప్రాంతాల్లో నిర్మాణాలు కూడా ఊపందుకొన్నాయి. దీంతో ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, జలాశయాల ఉనికే ప్రశ్నార్థకం అవుతుందనుకొన్న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 29.11.2005న జీవో 952 ప్రకారం ఒక కమిటీని నియమించింది. జలమండలి, పీసీబీ, హుడా, పరిశ్రమల శాఖ అధికారులతో ఏర్పాటైన ఈ కమిటీ రెండేండ్లపాటు సుదీర్ఘ అధ్యయనం చేసింది. ఇదే సమయంలో పర్యావరణ పరిరక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్‌ఐ), ఎన్జీఆర్‌ఐ, ఐఐసీటీతో కూడా సర్కారు మరో అధ్యయనం చేయించింది. చివరకు ప్రభుత్వం నియమించిన ఈ కమిటీలు పలు కీలక సూచనలు చేశాయి. గత కమిటీలు చేసిన సూచనలతో పోలిస్తే ఈ నిబంధనలు మరింత కఠినంగా ఉన్నాయి. ప్రభుత్వం వాటిని 2007లో మెమో ద్వారా అమలులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు హైడ్రా, జలమండలి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అంటూ ఏవేవో రూల్స్ మాట్లాడుతున్నప్పటికీ.. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలు ఇంతకంటే ఎన్నో రెట్లు కఠినంగా ఉన్నాయి.

### 2007 మెమోనే ప్రామాణికం.. అయితే??

ఇప్పటికీ జంట జలాశయాల పరిధుల్లో 2007 మెమో ప్రామాణికంగానే అనుమతులు ఇస్తున్నారు. కానీ జలమండలి అధికారులు ప్రస్తుతం ఈ నిబంధనల ప్రకారం నిర్మాణాలను గుర్తించి, హైడ్రాకు నివేదిక ఇవ్వడం లేదు. కేవలం ఎఫ్‌టీఎల్ పరిధిని.. అందునా కొన్ని నిర్మాణాలను మాత్రమే గుర్తించి, హైడ్రాకు నివేదించడం అనుమానాలకు తావిస్తున్నది.

---

# అనురాగ్, గాయత్రి విద్యా సంస్థలపై కేసు

- బఫర్‌జోన్‌లో భవనాలున్నాయని ఇరిగేషన్ శాఖ ఫిర్యాదు
- అన్ని అనుమతులతోనే నిర్మాణాలు
- రాజకీయ కక్షలతోనే కేసులు
- చట్టపరిధిలో పోరాడుతాం
- అనురాగ్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో/మేడ్చల్, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): అనురాగ్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్స్, గాయత్రి ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌కి చెందిన భవనాలు కొర్రెముల గ్రామ పరిధిలోని వెంకటాపూర్‌లోని నాదం చెరువు బఫర్ జోన్‌లో ఉన్నాయని ఘట్‌కేసర్ ఇరిగేషన్ సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ పరమేశ్ గురువారం పోచారం ఐటీ కారిడార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని పోచారం పోలీసులు తెలిపారు.



ఇదంతా రాజకీయ కక్ష్యతో కుట్రపూరితంగా చేస్తున్నారని అనురాగ్ సంస్థల చైర్మన్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. గాయత్రి ట్రస్ట్, అనురాగ్ సంస్థలు 25సంవత్సరాలలో ఏనాడు ప్రభుత్వ అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేయలేదని ఆయన ఓ ప్రకటనలో వివరించారు.

- సర్వే నంబర్ 813/పి, 796/పి సంబంధించిన వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతర భూమిగా మార్చుకున్నామని, అందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ (బీ2/334/2019, తేదీ: 3-04-2018) పొందామన్నారు.
- సంబంధిత భూమికి నీటి పారుదల శాఖ నుంచి (లెటర్ నెం ఈఈ/ఐబీ/హైచ్‌వైడీ/డీబీ/హెచ్‌డీ/డీ4/2017-2018/2505, 15-12-2017) నో అబ్జక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ) పొందినట్టు తెలిపారు. నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖ సంయుక్తగా తనిఖీలు చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లకు తమ భూమి ఎంత దూరంలో ఉందో కొలిచి ఎనోవోసీ ఇచ్చారని గుర్తు చేశారు.
- మేడ్చల్ కలెక్టర్ 23/04/2018న డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీలో చర్చించారని, అనంతరం 9/5/2028న లెటర్ నెం. ఈ2/1140/2018 ద్వారా హెచ్‌ఎండీఏ కమిషనర్‌కి ఎన్‌వోసీ పంపించారని తెలిపారు.
- నీటిపారుదల శాఖ, రెవెన్యూ, ఫైర్, ఎయిర్‌పోర్టు అథారిటీలు జారీ చేసిన ఎన్‌వోసీలను పరిశీలించిన తరువాత హెచ్‌ఎండీఏ 2819/ఈసీ/పీఎల్‌జీ/జీటీకేఆర్/హెచ్‌ఎండీఏ/2021, తేదీ 8/7/2022న అనుమతులు ఇచ్చారని వెల్లడించారు.
- అన్ని అనుమతులు తీసుకుని నిబంధనల మేరకు సెట్ బ్యాక్ వదిలి భవన నిర్మాణాలు చేశామని, మరికొన్ని చేస్తున్నామని చెప్పారు. 22, ఆగస్టు 2024న నీటి పారుదల శాఖ అధికారులు అనురాగ్, గాయత్రీ ట్రస్ట్ విద్యాసంస్థలకు వచ్చారని, మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో కనీస సమాచారం ఇవ్వకుండా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారని అన్నారు.

### కక్షపూరితంగానే కేసులు

**విద్యాజ్యోతి** ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అనురాగ్ ఇంజినీరింగ్ కాలేజీ, కోదాడలో ఐఏసీటీఈ, జేఎన్‌టీయూ అనుమతులు ఇచ్చిన తరువాత ప్రస్తుతం నడుస్తున్న కోర్సులలో 480 సీట్లను కోత పెట్టి, రాష్ట్రంలోని 99 శాతం కాలేజీలకు అనుమతులిచ్చి మాకు మాత్రం ఇవ్వకుండా ప్రభుత్వ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. తనపై వ్యక్తిగతంగా జనగామలో ఎన్నికలు పూర్తయిన తరువాత 4 కేసులు, హైదరాబాద్ 2 కేసులు పెట్టారని అన్నారు. అనురాగ్ యూనివర్శిటీపై వివిధ డిపార్టుమెంట్లు నిత్యం సోదాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఏమీ దొరకకపోవడంతో ఇలా ఒత్తిడి తెస్తున్నారని, అయినా చట్ట పరిధిలోనే న్యాయం కోసం పోరాడుతానని రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు.

---

# అనురాగ్ వర్సిటీపై చర్యలొద్దు

**చట్టం ప్రకారమే వ్యవహరించాలి • హైడ్రాకు తేల్చి చెప్పిన రాష్ట్ర హైకోర్టు**

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, కొర్రెముల (వెంకటాపూర్) గ్రామం, నాదం చెరువు సమీపంలో అనురాగ్ యూనివర్సిటీ ఆక్రమణలు ఉన్నాయని చెప్పి చట్ట వ్యతిరేకంగా చర్యలు తీసుకోరాదని హైడ్రాకు హైకోర్టు తేల్చి చెప్పింది. ఏ విధమైన చర్యలు చేపట్టాలన్నా చట్ట నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఆక్రమణలపై అభియోగాలు ఉంటే వాటిని నిర్ధారణ వ్యవహారంపై హైడ్రా చట్ట నిబంధనలకు అనుగుణంగా నోటీసులు జారీ చేయాల్సిందేనని ఉత్తర్వులు జారీచేసింది. అక్రమణలు ఉన్నట్లయితే వాటి తొలగింపును చట్టప్రకారం చేపట్టాలని పేర్కొంది. వెంకటాపూర్ గ్రామ సర్వే నం.813 నాదం చెరువు బఫర్ జోన్‌లో ఏమైనా నిర్మాణాలు ఉన్నట్టయితే వాటి విషయంలో చట్ట ప్రకారం వ్యవహరించాలని స్పష్టం చేసింది. అధికారులు తమ హక్కుల్లో జోక్యం చేసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, అనురాగ్ యూనివర్సిటీ, నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ శనివారం అత్యవసరంగా లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశాయి. వీటిపై శనివారం రాత్రి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ వినోద్‌కుమార్ విచారణ జరిపారు. యూనివర్సిటీతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కుటుంబానికి ప్రమేయం ఉన్నదని చెప్పి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ప్రభుత్వం తరపు న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎలాంటి చర్యలు చేపట్టకముందే పిటిషనర్ ఆందోళనతో కోర్టుకు వచ్చారని చెప్పారు.

4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 25 ఆగస్టు 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని బయటపడ్డాం

2008, హెచ్‌ఎంటీవీలో ట్రైనీ జర్నలిస్టుగా మొదలైన నా పాత్రికేయ ప్రయాణం ఆ తర్వాత 'టీ' న్యూస్, ఇప్పుడు 'తెలుగు స్క్రైబ్'లో కంటెంట్ హెడ్‌గా కొనసాగుతున్నది. పాత్రికేయురాలిగా ప్రజలకు నేనందించిన సేవలను గుర్తించిన నాటి ప్రభుత్వం నన్ను ఉత్తమ జర్నలిస్టుగా గుర్తించింది. ఇదంతా ఇప్పుడెందుకు చెప్తున్నానంటే..? నిజం గడప దాటేలోపు అబద్ధం ఊరంతా చుట్టేస్తుందన్నట్టు.. 'ఆవుల సరిత అసలు జర్నలిస్టే కాదని', 'ఆమె ఒక రాజకీయ పార్టీకి చెందిన కార్యకర్త' అంటూ అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారాలు చేశారు. నేనేంటో, గత 16 ఏండ్లుగా నాతో పాటు పనిచేసిన జర్నలిస్టులందరికీ తెలుసు. కానీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో చెప్పే అబద్ధాలు ఒకరిద్దరు నమ్మే అవకాశాలు కూడా ఉంటాయి. కాబట్టి, నా గతాన్ని ఒకసారి మీకు పరిచయం చేస్తున్నాను. ఇక అసలు విషయానికి వస్తే.. 16 ఏండ్ల నా జర్నలిజం ప్రస్థానంలో 2024, ఆగస్టు 22 ఒక చీకటి రోజు. అదొక దుర్దినం. ఆ రోజు అసలేం జరిగిందంటే..?



ఆవుల సరిత యాదవ్
95539 55313

***

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరినప్పటి నుంచి 'రుణమాఫీ'పై చర్చలు జరుగుతున్నాయి. గత నెల రోజులుగా ఆ చర్చలు జోరందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నాకు తెలిసిన కొంతమంది రైతులతో మాట్లాడినప్పుడు పాపం వాళ్లకు రుణమాఫీ కాలేదనే విషయం తెలిసింది. ఓ వైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులు ఒకేసారి రైతులందరికీ మొత్తం రుణమాఫీ చేశామని చెప్పుకుంటున్నారు. ఇంకోవైపు రైతులేమో మాకు రుణమాఫీ కాలేదంటున్నారు. దీంతో ఎవరు నిజం చెప్తున్నారో?, ఎవరు అబద్ధం చెప్తున్నారో నాకు అర్థం కాలేదు. అందుకే ఫీల్డ్‌లోకి వెళ్లి రుణమాఫీపై కేస్ స్టడీ చేయదలచుకున్నాను. అందులో భాగంగానే పది రోజుల కిందట ఓ రోజు మెదక్ నియోజవర్గంలోని ఒక ఊరుకు వెళ్లాను. అక్కడి రైతులతో మాట్లాడితే చాలా మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదనే చెప్పారు. రుణమాఫీ అంశంపై రైతులతో మాట్లాడేందుకు రాష్ట్రం మొత్తం కలియదిరగాలని అప్పుడే, ఆ క్షణమే అనుకున్నాను. ఆ తర్వాత మునుగోడు నియోజకవర్గంలోని సర్వేల్, సంస్థాన్ నారాయణపూర్, మల్లారెడ్డిగూడెంతో పాటు ఇతర గ్రామాల్లోనూ నాతో పాటు మా ఛానల్ జర్నలిస్టులు సందర్శించారు.

2024, ఆగస్టు 22 గురువారం రోజు ఉదయం 6 గంటలకు సోమాజిగూడ నుంచి కొండారెడ్డిపల్లికి మా కారు బయల్దేరింది. 'మిర్రర్ టీవీ' ప్రతినిధిగా జర్నలిస్టు సోదరి విజయారెడ్డి కారు కూడా మాకు తోడైంది. ఆమెతో సహా అందులోనూ ముగ్గురు వ్యక్తులున్నారు. కొండారెడ్డిపల్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ఊరు. కొండారెడ్డిపల్లిలో ఇలా కాలుపెట్టామో లేదో.. ఎడమవైపున పాల కేంద్రం కనపడింది. పాల కేంద్రంలో రైతులు ఎక్కువగా ఉంటారనే ఆలోచన రావడం, డ్రైవర్‌కు ఆపమని చెప్పడంతో ఆయన కారుకు బ్రేకులు వేశాడు. వెంటనే మా కెమెరామెన్ మైక్, కెమెరాలతో సిద్ధమయ్యాడు. అప్పటికే ఉదయం 9 అవుతున్నది. కారులోంచి దిగిన మేం ముగ్గురు రైతులతో మాట్లాడినం. 'మీకు రుణమాఫీ అయిందా?' అన్న మా ప్రశ్నకు ముగ్గురూ 'మాకు కాలేదు' అని చెప్పారు. అక్కడి నుంచి మా కార్లు కదిలి, కొంచెం ముందుకువెళ్లిన తర్వాత కిరాణా దుకాణం వద్ద జన సమూహం కనపడటంతో అక్కడ ఆగాయి. అక్కడ కూడా నలుగురు రైతులతో మాట్లాడినం. ఆ నలుగురు రైతులూ 'మాకు రుణమాఫీ కాలేదు' అనే చెప్పారు. మేం అక్కడనే ఉన్నాం. అటుగా వెళ్తున్న ఇద్దరు రైతులను రుణమాఫీపై ప్రశ్నిస్తే.. ఒక రైతేమో 'నాకు రుణమాఫీ అయ్యింది' అని చెప్పగా, ఇంకో రైతు 'నాకు రుణమాఫీ కాలేదు' అని చెప్పాడు. అయితే అప్పుడే అక్కడికి వచ్చిన మరో రైతును ప్రశ్నిస్తే.. 'రుణమాఫీ కాలేదని చెప్తే మమ్మల్ని కొట్టి చంపుతరమ్మా... మా ఊరోళ్లు, అసలే మంచోళ్లు కారు' అని చెప్పడం గమనార్హం. కొండారెడ్డిపల్లిలో ఉన్న రైతులను 'మీ ఊళ్లో ఎన్ని క్రాప్ లోన్లున్నాయి, ఎంత మందికి మాఫీ అయ్యింది' అని అడిగితే.. 'వెయ్యి నుంచి పదకొండు వందల మందికి క్రాప్‌లోన్లుంటే... మూడొందల మందికే మాఫీ అయిందని' చెప్పారు.



కిరాణా దుకాణం నుంచి రేవంత్‌రెడ్డి ఇల్లు పక్కన కొంచెం అటూ ఇటుగా ఉన్న గ్రామపంచాయతీకి మా కార్లు బయల్దేరినయి. అయితే, అప్పటికే రెండు వాహనాలపై నలుగురు వ్యక్తులు మా కదలికలను గమనిస్తున్నారనే విషయాన్ని మేం పసిగట్టలేకపోయాం. మా కార్లు గ్రామ పంచాయతీకి చేరేసరికి ఆ రెండు వాహనాలు కాస్తా నాలుగయ్యాయి. ఆ నాలుగు కాస్తా ఎనిమిది అయ్యాయి. ఇలా పంచాయతీలో కారు ఆపి ఇలా మేం దిగామో, లేదో.. మా చుట్టూ సుమారు వంద మంది గుమిగూడారు. ఒకతను.. 'మీరెవ్వరు? ఎందుకు కొండారెడ్డిపల్లికి వచ్చారు?' అని అడిగాడు. 'మేం జర్నలిస్టులం, రుణమాఫీపై ప్రజల స్పందనను తెలుసుకునేందుకు వచ్చాం' అని చెప్పడంతో.. 'మా కొండారెడ్డిపల్లికి వచ్చేందుకు మీకెన్ని గుండెలు' అంటూ రాయలేని భాషలో దుర్భాషలాడటం మొదలుపెట్టారు. ఆ సమయంలో వాళ్లంతా రౌడీల్లా, నరరూప రాక్షసుల్లా వ్యవహరించారు. 'మీరు కేవలం రుణమాఫీ కాని రైతులతోనే మాట్లాడుతున్నారు, రుణమాఫీ అయిన రైతులతో మాట్లాడటం లేదు. మా ఊరు దాటి ఆ కెమెరాలు బయటికి ఎలా పోతాయో చూస్తాం' అంటూనే కెమెరాలు, మైక్‌లు, ఫోన్లు గుంజుకున్నారు. అడ్డుకున్న నా చున్నీని లాగారు. నెట్టేస్తే నేను వెళ్లి బురదలో పడిపోయాను. అడ్డుకున్న విజయారెడ్డిపైనా అదే తీరు. నాపై జరుగుతున్న దాడిని విజయారెడ్డి తన ఫోన్‌లో రికార్డు చేస్తుండగా ఆమె ఫోన్‌ను సైతం లాక్కున్నారు. ఈ పెనుగులాట గంటకుపైగా జరిగింది. ఆ తర్వాత బయటపడ్డ మేం ఎలాగోలా తప్పించుకొని ఒంగూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాం. పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న క్రమంలో మా కార్లపై రాళ్లతో దాడి చేశారు. పోలీస్‌స్టేషన్‌లో మేం పిటిషన్ రాస్తుండగానే విజయారెడ్డిని పిలిచి ఎస్సై ఫోన్ ఇచ్చేశాడు. 'ఇది ఎవరు ఇచ్చారు సార్' అనడిగితే 'ఊరిలో ఈ సెల్‌ఫోన్ దొరికిందని ఎవరో ఒకతను తీసుకువచ్చి ఇచ్చాడని' ఎస్సై చెప్పడం గమనార్హం.

కంప్లయింట్ ఇచ్చి, హైదరాబాద్‌కు బయల్దేరాం. మేం హైదరాబాద్‌కు చేరుకోవాలంటే మళ్లీ కొండారెడ్డిపల్లి మీదుగా రావాల్సిందే.. మేం కొండారెడ్డిపల్లికి చేరుకోగానే.. నాలుగైదు కార్లు మా కోసం కాపు గాస్తున్నాయి. ఆ కార్లలోంచి మమ్మల్ని చూస్తున్న వాళ్లు చూపుడు వేలు ఊపుతూ బెదిరించారు. వాటిని మా కార్లు దాటగానే అవి మా వెనుకే వచ్చాయి. మేం ఎటు వెళ్తే అటే మమ్మల్ని ఫాలో అవుతున్నాయి. నాకు తెలిసీ మా కార్లు ఆగితే అక్కడ మమ్మల్ని కొట్టేవాళ్లేమో, ప్రాణాలతో మేం బయటపడేవాళ్లం కాదేమో.. ఇక గత్యంతరం లేదు, ఏదో ఒక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సిందేనని గమనించిన మేం దగ్గరలో ఏ పోలీస్‌స్టేషన్ ఉందని గూగుల్‌లో సెర్చ్ చేస్తే.. వెల్దండ ఠాణా కనిపించింది. రక్షణ కోసం మా కార్లు వెంటనే వెల్దండ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. పోలీస్‌స్టేషన్ లోపలికి కార్లు వెళ్లే మార్గం లేకపోవడంతో గేట్లముందే కార్లు ఆపి దిగి లోపలికి వెళ్లే లోపు మా వెంటే నాలుగైదు కార్లు వచ్చి ఆగాయి. ద్విచక్ర వాహనాలపైనా రౌడీలు వచ్చారు. సుమారు అరవై మంది ఠాణాకు వచ్చారు. ఫోన్లు, కెమెరాలు ఇవ్వండంటూ మళ్లీ దాడులు మొదలుపెట్టారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే నాపై దాడికి ప్రయత్నించారు. మహిళా జర్నలిస్టులమని కూడా చూడకుండా ఆ రౌడీలు పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే రాయలేని భాషలో బూతులు తిట్టారు. మా కండ్లలోంచి నీళ్లు ఉబికివస్తున్నాయి. ఇది గమనించిన ఇద్దరు, ముగ్గురు కానిస్టేబుళ్లు మమ్మల్ని లోపలికి తీసుకువెళ్లి బ్యాక్‌సైడ్ తలుపులు క్లోజ్ చేశారు.

> రక్షణ కోసం మా కార్లు వెంటనే వెల్దండ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. పోలీస్‌స్టేషన్ లోపలికి కార్లు వెళ్లే మార్గం లేకపోవడంతో గేట్లముందే కార్లు ఆపి దిగి లోపలికి వెళ్లే లోపు మా వెంటే నాలుగైదు కార్లు వచ్చి ఆగాయి. ద్విచక్ర వాహనాలపైనా రౌడీలు వచ్చారు. సుమారు అరువై మంది ఠాణాకు వచ్చారు. ఫోన్లు, కెమెరాలు ఇవ్వండంటూ మళ్లీ దాడులు మొదలుపెట్టారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే నాపై దాడికి ప్రయత్నించారు. మహిళా జర్నలిస్టులమని కూడా చూడకుండా ఆ రౌడీలు పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే రాయలేని భాషలో బూతులు తిట్టారు.

మా కెమెరామెన్‌లు తీసిన వీడియోల్లో ఒకటి సోషల్‌మీడియాలో షేర్‌చేశాం. అంతే.. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాగర్‌కర్నూల్ ఎస్పీతో మాట్లాడారు. ఆ ఎస్పీ ఆదేశాలతో మా రెండు కార్లకు పోలీస్ ఎస్కార్ట్ తోడైంది. భయం, ఆందోళనల మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాత్రి ఎనిమిదిన్నర ప్రాంతంలో హైదరాబాద్ పరిసరాలకు చేరుకున్నాం.

***

**తెలంగాణ ఉద్యమం తారస్థాయిలో ఉన్నప్పుడు జర్నలిస్ట్‌గా సాగరహారం, సడక్ బంద్, సంసద్‌యాత్ర, వంటావార్పులతో పాటు అనేక ధర్నాలను, ఎన్నో కార్యక్రమాలను కవర్‌చేశాను. కానీ, ఏనాడూ ఇలా రౌడీలు నాపై దాడి చేయలేదు. ఒక్క నాపైనే కాదు, ఏ మహిళా జర్నలిస్టుపై కూడా దాడులు జరగలేదు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో తన సొంత ఊరైన కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులపై దాడి జరగడం ఏమిటో నాకైతే అర్థం కావడం లేదు. అసలు మన రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికే ఉన్నదా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ఊరు అయితే మాత్రం జర్నలిస్టులు వెళ్లకూడదా? రైతులతో మాట్లాడకూడదా? రైతులకు సంబంధించిన సమాచారాన్ని ఒక జర్నలిస్టుగా ప్రభుత్వానికి చేరవేయకూడదా? చేరవేస్తే తప్పవుతుందా?**

**చివరాఖరు:** ప్రజల సుదీర్ఘ పోరాటాల తర్వాత తెలంగాణను ఇక ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించక తప్పదని కాంగ్రెస్ అధిష్ఠానం అందుకు సిద్ధమైంది. ఆ సమయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు సైతం అధిష్ఠానం చిన్న హింట్ ఇచ్చింది. ఆ సమయంలోనే హైదరాబాద్‌లో దాడులు జరగడం మొదలైంది. ఆ తర్వాతే అర్థమైంది. ఆ దాడులు ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావానికి సంకేతమని!

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి సుమారు తొమ్మిది నెలలు కావస్తున్నది. ఈ తొమ్మిది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకత మూటగట్టుకున్నది. నివురుగప్పి ఉన్న నిజాలను బయటపెడుతున్న నాలాంటి జర్నలిస్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం కిరాయి రౌడీలను ఉసిగొల్పుతున్నది, దాడులకు పాల్పడుతున్నది. మరి ఈ దాడులు ఇస్తున్న సందేశం?

**జై తెలంగాణ! జై జై తెలంగాణ!!**

---

# దారితప్పిన రుణమాఫీ?

**ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. హామీల అమలు గురించి ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రజలతో పాటు ప్రతిపక్షాల బాధ్యత. తన బాధ్యత నుంచి తప్పించుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రధాన ప్రతిపక్షం మీద ఎదురుదాడికి దిగుతున్నది. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు సీఎం రేవంత్‌రెడ్డి.**



జీడిపల్లి రాంరెడ్డి
96666 80051

అధికారంలోకి వచ్చేందుకు అలవిగాని హామీలిచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు వాటిని అమలుచేసేందుకు నానా తంటాలు పడుతున్నది. అర్థం పర్థం లేని నిబంధనలు పెట్టి 11 లక్షల మందికి పైగా కోత పెట్టారు. ఎన్నికల సమయంలో ప్రతి రైతుకు 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నేడు కుటుంబానికి రూ.2 లక్షలకే పరిమితం చేశారు. ఎన్నికలకు ముందు రూ.41 వేల కోట్లని చెప్పి, అధికారంలోకి వచ్చాక రూ.31 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని ప్రకటించి, బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లను కేటాయించి, ఆపై రూ.17 వేల కోట్లతోనే మాఫీ అయిపోయినట్లు ప్రకటించడం శోచనీయం. తెలంగాణవ్యాప్తంగా 70 లక్షల మంది రైతులకు గానూ 60 లక్షల మంది రుణాలు తీసుకోగా, ప్రభుత్వం మాత్రం 44 లక్షల మంది మాత్రమే రుణాలు తీసుకున్నట్లు చెప్తున్నది. ఇక వారిలోనూ 32.5 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి.. తీరా 22 లక్షల మంది రుణాలనే మాఫీ చేశారు.




బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. 1,11,027 ఫిర్యాదులు వచ్చాయంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ హరీశ్‌రావు రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం విడ్డూరం. మాయమాటలు మాట్లాడటం రేవంత్‌రెడ్డికి కొత్తేమీ కాదు. గతంలో కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఆయన సవాల్ విసిరారు. మరి ఆయన రాజకీయ సన్యాసం ఏమైంది? ఫ్రస్టేషన్‌లో ఉన్న రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదు. ఆయనలో ఇంకా అప్పటి ప్రతిపక్ష నాయకుడే కనిపిస్తున్నారు. నోటికి ఏదొస్తే అది మాట్లాడుతూ సీఎం పదవికి మచ్చ తెస్తున్నారు.

రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతుల ఆందోళనలే కనిపిస్తున్నాయి. 'ఇదేం మాఫీ.. మాకు రుణమాఫీ చేస్తారా, లేదా?' అని రైతులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. రుణమాఫీ పూర్తయిందంటూ గప్పాలు కొడుతున్న కాంగ్రెస్ నాయకులు, పాలాభిషేకాలు చేస్తున్న కార్యకర్తలు ఆందోళన చేస్తున్న రైతులకు సమాధానం చెప్పాలి.

కేసీఆర్ హయాంలో రెండుసార్లు రుణమాఫీ జరిగింది. మొదటి పర్యాయం 35.31 లక్షల మంది రైతులకు రూ.16,144 కోట్లు, రెండో పర్యాయం 22.98 లక్షల మంది రైతులకు రూ.13,000 కోట్ల పంట రుణాలు మాఫీ అయ్యాయి. కానీ, ఇలా లొల్లి జరగలేదు. రేషన్‌కార్డులో పేరు లేదని, పేర్లు తప్పుగా ఉన్నాయని, చిన్నాచితకా తప్పులు ఉన్నాయని, ఇతర సాంకేతిక కారణాలు చెప్తూ కొర్రీలు పెడుతున్నారు. బ్యాంకుల చుట్టూ పాస్‌బుక్‌లు, ఆధార్‌కార్డులు పట్టుకొని రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మండల వ్యవసాయాధికారులు స్పందించడం లేదు. అలాంటి తప్పులే ఉన్నప్పుడు రుణాలు ఎలా ఇచ్చినట్టు? అప్పుడు ఈ తప్పులు కనిపించలేదా? అంతేకాదు, రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్నవారు అదనపు మొత్తాలను ముందుగా చెల్లిస్తేనే మాఫీ చేస్తామని చెప్పడం సరికాదు. పంట పెట్టుబడులకే ఇబ్బందులు పడుతున్న రైతులు ఆ సొమ్మును ఎక్కడి నుంచి తేవాలి?

ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీ ఈ విషయమై మొదటినుంచీ కాంగ్రెస్ సర్కార్‌పై ఒత్తిడి తెస్తూనే ఉన్నది. కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర నేతలు రైతుల పక్షాన పోరాడుతూనే ఉన్నారు. అందుకే ప్రశ్నిస్తున్నవారిపై దాడులకు కాంగ్రెస్ తెగబడుతున్నది. అందులో భాగంగానే సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడి జరిగింది. తాజాగా సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో దాడి జరిగింది. అంతేకాదు, సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లిలో రుణమాఫీ అమలు తీరుతెన్నుల గురించి తెలుసుకునేందుకు వెళ్లిన జర్నలిస్టులపై కూడా దాడులు జరిగాయి. ఇలాంటి చిల్లర పనుల వల్ల ప్రభుత్వానికే నష్టం. ఇప్పటికైనా హామీలపై కాంగ్రెస్ సర్కార్ దృష్టి సారించాలి. లేనిపక్షంలో ప్రజలే బుద్ధిచెప్తారు.

---




## కీలుబొమ్మలా సీబీఐ!

కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయాలా, వద్దా? అనే విషయమై తన వాదన వినిపించేందుకు సమయం కావాలని, మరో 14 రోజులు విచారణను వాయిదా వేయాలని సీబీఐ ఇటీవల న్యాయస్థానాన్ని కోరింది. అదే రోజు సీబీఐ అధికారులు మీడియాతో మరోలా మాట్లాడారు. ఆ వ్యాఖ్యలు పత్రికల్లో ఏకపక్ష హెడ్‌లైన్‌గా మారిపోయాయి. కేజ్రీవాల్ బయటకు రాకూడదనే ఉద్దేశంతోనే సీబీఐ ఇలా చేస్తున్నది. కేంద్రం ఆదేశాల ప్రకారమే సీబీఐ కీలుబొమ్మలా మారింది.

**- మనీశ్ సిసోడియా, ఆప్ సీనియర్ నేత**

---

**'యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతాః' అని ఘోషించిన ప్రపంచంలో స్త్రీకి బతికి ఉండటమే పెద్ద వరమైపోయింది. బతికి ఉన్నవారికి కూడా అవమానాలు లేని బ్రతుకు మృగ్యమైపోయింది. అయినా అత్యుత్తమ వ్యక్తిత్వం ఉన్న మనుషులు ఉండవలసిన పార్లమెంటులో 151 మంది నేర చరిత్ర కలిగిన పురుషులున్న దేశంలో ఆడవాళ్ల పరిస్థితి హీనంగా, హేయంగా ఉండకుండా పూజనీయంగా ఉంటుందని ఆశించడం తెలివి తక్కువే కదా!**

# ఆకాశంలో సగం, భూమ్మీద అణువంత!



కనకదుర్గ దంటు
89772 43484




సర్దార్ పటేల్ విగ్రహానికి రూ.3,000 కోట్లు వెచ్చించిన బీజేపీ కేంద్ర ప్రభుత్వం సుమారు 70 కోట్ల స్త్రీ జనాభా రక్షణ కోసం రూ.100 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించడం హాస్యాస్పదం, అన్యాయం కాదా? గర్భవతి బిల్కిస్ బానోను అత్యాచారం చేసి, ఆమె కుటుంబ సభ్యులు 14 మందిని హత్యచేసిన వారికి పడని శిక్ష, ఒక్క డాక్టర్ మహిళను అత్యాచారం చేసి చంపిన ఒక్కడికి (మిగతా వాళ్లను ఎలాగూ దాచిపెట్టారు) పడుతుందని ఆశించగలమా? రెండేండ్ల నుంచి రావణకాష్టంలా మండుతున్న మణిపూర్ అత్యాచారుల మీద కేసులైనా పెట్టారా? ధర్మం కనీసం రెండు పాదాల మీదైనా నడిచింది కాబట్టి, ద్వాపరయుగంలో ద్రౌపదిని అవమానపడకుండా శ్రీకృష్ణుడు కాపాడాడు. మరి ఒంటికాలి మీద నడుస్తున్న ధర్మం ఈ కలియుగంలో ఆడవారిని ఎలా రక్షిస్తుంది.

> **మేకప్ లేకుండా వాణిశ్రీని హీరోయిన్‌గా చూపగలిగిన సాహసి, బాపు డైరెక్షన్‌లో వచ్చిన 'గోరంత దీపం' సినిమాలో నాస్తికుడు ఆరుద్ర రచించిన 'రాయినైనా కాకపోతిని' అన్న అద్భుత రచన ఒక్కసారి గురుచేసుకుందాం.**

'రాయినైనా కాకపోతిని రామపాదము సోకగా' అన్న మాట అహల్యా శాప విమోచనం సూచిస్తుంది. కానీ, కలియుగ పురుషుల్లో, ముఖ్యంగా రాజకీయ నాయకులలో స్త్రీలు, అనుభవిస్తున్న ఈ వెతలు ఎవరు తీరుస్తారు? ఒక్క తెలంగాణ రాష్ట్ర సాధకులు కేసీఆర్ మాత్రమే తన పాలనలో ఈ విషయం గురించి మథించి, షీ టీమ్స్‌ను ఏర్పాటుచేసి 2014 నుంచి డిసెంబర్ 2023 దాక రాష్ట్రంలో స్త్రీలకు రక్షణ కల్పించారు. దేశంలో ఇటువంటి రెండో నాయకుడు కనపడటం లేదంటే అతిశయోక్తి కాదు. మళ్లీ 2024 నుంచి కథ మామూలే! ఆంధ్ర కుమారీ ఆంటీకి రక్షణ, తెలంగాణ మహిళా జర్నలిస్టులకు దెబ్బలు ప్రస్తుత ప్రభుత్వ పక్షపాత ధోరణికి అద్దం పడుతున్నాయి.

> **ఇంతకూ స్త్రీలు ఏం కోరుతున్నారు? మణులా, మాన్యాలా? ఏమీ లేదు. తమంత తాము చదువుకొని, ఉద్యోగాలు చేస్తూ, చదువు లేకపోతే కూలీ, ఇతర పనులు చేస్తూ, సంపాదిస్తూ తమ బతుకు తాము బతుకుతామంటున్నా మగవారి అహంకారం, వివక్ష తగ్గటం లేదు. ఈ విషయంలో బీద, గొప్ప తేడా లేదు, కులాల ప్రసక్తి లేనే లేదు. దేశమంతా లింగవివక్ష సాగుతూనే ఉన్నది. చిన్న విషయాల దగ్గర్నుంచీ, అత్యాచార నేరాల వరకూ ఆడవారికి అవమానం, మగవారి వికృతచేష్టలకు మద్దతు దొరుకుతూనే ఉన్నాయి. దీన్ని అరికట్టడం ఎలా సాధ్యం?**

బలహీనుడిని బలవంతుడు రక్షించేదే నిజమైన నాగరిక సమాజం. శారీరకంగా పురుషుడి కంటే బలహీనురాలైన స్త్రీ నైతికంగా, వ్యక్తిత్వ విలువలలో పురుషుడి కంటే ఎంతో బలవంతురాలు. ఈ విషయం, లింగ సమానత్వం గురించి విషయాలు విద్య ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారా అందరికీ అర్థమైనప్పుడే ఇటువంటి విజ్ఞానం పురుషులకు అబ్బుతుంది. అంతకంటే ముఖ్యమైనది ఏ నేరానికైనా ముఖ్యంగా స్త్రీల మీద, బలహీన వర్గాల మీద జరిగే అకృత్యాలకు శిక్షలు చాలా కఠినంగా ఉండాలి. చిన్న, పెద్ద ఏ నేరాలైనా భయపెట్టే శిక్షలు, వాటి అమలు సరిగ్గా ఉన్నప్పుడే సమాజం బాగుపడుతుంది. 'పది మంది నేరస్థులు తప్పించుకున్నా ఫరవాలేదన్న' మాట పోయి, ఒక నేరస్థుడు కూడా తప్పించుకోలేనిదే నాగరిక సమాజంగా మారుతుందన్న సత్యాన్ని గుర్తించాలి. ఒకరి జీవితం మీద ఇతరులకు మాట్లాడే హక్కే లేనప్పుడు ఆ జీవితాన్ని చిదిమేసే హక్కు ఎవరికి ఉంది? నేరస్థులకు ఉరిశిక్షలు అమానవీయం అయితే మరి అమాయకులను చంపడం అమానవీయం కాదా? 30 ఏండ్ల కిందట గుంటూరు దగ్గర దుండగులు బస్సుకు నిప్పు పెట్టిన సంఘటనలో 27 మంది సజీవ దహనమయ్యారు. ఆ దుండగుల న్యాయవాది వారిని ఉరి తీయకూడదని వాదించాడు. న్యాయానికే వారికి శిక్ష వేసే హక్కు లేనప్పుడు, పక్కవారిని చంపే హక్కు సామాన్యులకు ఉందా? బతికే హక్కు దుండగులకే ఉంటే మరి ఆ 27 మందికి బతికే హక్కు లేదా? ఇటువంటి వెర్రివాదనలు పక్కనపెట్టి శిక్ష రుజువైన ప్రతివారికి ముఖ్యంగా అత్యాచారం, హత్య వంటి సందర్భాలలో ఉరిశిక్షనే ఖరారు చేయాలి. ఒకసారి ఉరిశిక్ష పడ్డాక పైకోర్టులు అతను నేరస్థుడేనా అన్నది పరిశీలించాలి కానీ, శిక్ష తగ్గించకూడదు. ఇటువంటి నేరస్థులు ఇరవై కోట్ల మందిని ఉరితీసినా భారతదేశ జనాభాకి నష్టమేమీ లేదు.

ముఖ్యంగా మన పార్టీ వాడు, పరాయి పార్టీ వాడు అన్న భేదం అసలు పాటించకూడదు. కలకత్తా అత్యాచార సంఘటనను నిరసిస్తున్నవారంతా బిల్కిస్ బానో నిందితులను, మణిపూర్ ఘటనా నిందితులను, ముఖ్యంగా బ్రిజ్‌భూషణ్ వంటి రాజకీయవేత్తలను, నేరచరిత్ర ఉన్న రాజకీయ నాయకులను కూడా శిక్షించాలని కోరాలి. కలకత్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ వారు గురివింద గింజల్లా ప్రవర్తిస్తున్నారు. నిందితులెవరైనా కఠిన శిక్షలుంటేనే న్యాయం, ధర్మం పాటింపబడతాయని గ్రహించాలి. మానవత్వం కంటే, పార్టీ ఐడియాలజీ గొప్పది కాదు. ఒక్క నిందితుడు తప్పించుకోలేనిదే నిజమైన మానవీయ సమాజం అని గ్రహించాలి.

# తీరని రుణం.. రైతుల రణం





వరంగల్ జిల్లా కాపులకనపర్తిలో నిర్వహించిన రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

## 30 వరకే రుణమాఫీ డెడ్‌లైన్

- **ఆ తరువాత ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: ఎర్రబెల్లి**


సంగెం, ఆగస్టు 24 : సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 30 వరకు రుణమాఫీ పూర్తిగా చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. వరంగల్ జిల్లా సంగెం మండలం కాపులకనపర్తిలో శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాయమాటలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. శాసన సభ, పార్లమెంటు ఎన్నికల ముందు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్లు పెట్టి, ఇప్పుడు మాఫీ చేయకుండా రైతులను మోసం చేసిండని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన ఆయన, 40 శాతం మందికి ఇంకా మాఫీ కాలేదన్నారు. పొరపాటు చేశామని మంత్రులు కూడా ఒప్పుకున్నారని తెలిపారు. కాళేశ్వరం, దేవాదుల నీళ్లు లేవని, 24 గంటల కరెంటు ఇస్తలేరని, ఇలాంటి ప్రభుత్వానికి ఎందుకు ఓట్లేశామని ప్రజలు బాధపడుతున్నట్టు చెప్పారు. అర్హులందరికీ రుణమాఫీ చేయకపోతే రైతులతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పరకాల మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాపులకనపర్తి సొసైటీలో 1907 మందిలో ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలేదని అన్నారు. అదే సొసైటీలో పేరాల సాంబయ్య అనే రైతు రూ.లక్ష చెల్లిస్తే రసీదు ఇచ్చారు కానీ బ్యాంకులో జమచేయలేదని, అందుకు కారకులైన చైర్మన్, సీఈవో, ఉద్యోగులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

### మాఫీ చేసి.. మాట నెలబెట్టుకోవాలి: చల్లా

ఆత్మకూరు, ఆగస్టు 24 : రైతులందరికీ రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన మాట్లాడారు. రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, సగం మందికి కూడా రుణమాఫీ చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసేదాకా రైతుల పక్షాన బీఆర్‌ఎస్ రణం కొనసాగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పోలీసులు ఇష్టానుసారంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసులు పెడితే సహించేది లేదని అన్నారు.

# ప్రజాభవన్ ముట్టడి తథ్యం

- **రుణమాఫీకి డెడ్‌లైన్ సెప్టెంబర్ 15**
- **రైతు ఐక్య కార్యాచరణ కమిటీ అల్టిమేటం**
- **రైతుల నిరసనకు బీఆర్‌ఎస్ సంఘీభావం**
- **హాజరైన మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి**
- **ఆర్మూర్‌లో రైతుల మహాధర్నా విజయవంతం**




ఆర్మూర్‌లో రైతుల మహాధర్నాకు సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రి వేముల, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి, జీవన్‌రెడ్డి

నిజామాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ చెప్పినట్టు సెప్టెంబర్ 15లోపు రైతులందరికీ రూ.2లక్ష లోపు రుణాలను సంపూర్ణంగా మాఫీ చేయాలని ఆర్మూర్ డివిజన్ ప్రాంత రైతులు అల్టిమేటం జారీ చేశారు. లేకపోతే ప్రజాభవన్, సెక్రటేరియేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. షరతుల్లేని రుణమాఫీ, రైతుభరోసా అమలుకు ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని నిజామాబాద్ రూరల్, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల పరిధిలోని రైతులు కలిసి ఆర్మూర్‌లోని మామిడిపల్లి చౌరస్తాలో శనివారం నిర్వహించిన మహాధర్నా విజయవంతమైంది. పోలీసుల ఆంక్షలను దాటుకుని వేలాదిగా రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తారు. 44వ జాతీయ రహదారిని ఆనుకుని ఆర్మూర్‌కు వెళ్లే మెయిన్ రోడ్డులో దారిపొడవునా రైతులంతా ధర్నాలో పాల్గొనడంతో కిక్కిరిసింది. ధర్నా ప్రాంతంలో సెల్‌ఫోన్ జామర్లను ఏర్పాటు చేశారని రైతులు తీవ్రంగా మండిపడ్డారు. జామర్లను తొలగించకపోతే జాతీయ రహదారి ముట్టడిస్తామని హెచ్చరించడంతో పోలీసులు వెనక్కి తగ్గినట్టు తెలిసింది. ఆ తర్వాత సాఫీగానే కార్యక్రమం జరిగింది. రైతుల ధర్నాకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, వామపక్ష పార్టీ నేతలు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి వేముల మాట్లాడుతూ.. ఆర్మూర్ రైతులు పోరాటాలకు పెట్టింది పేరని కొనియాడారు. నమ్మి ఓట్లేసిన రైతులకే రేవంత్‌రెడ్డి సున్నం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీపై అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావులతో కలిసి సర్కారును నిలదీశామని వేముల గుర్తు చేశారు. రుణమాఫీపై రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడినట్టు చెప్పారు. బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ నియోజకవర్గాల్లోని 1,44,636 రైతులకుగాను 51,141 మంది రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయని, మిగతా 93,495 మందికి మాఫీ వర్తించలేదని లెక్కలతో వివరించారు. రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే అన్ని పోరాటాలకు బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు.

### ఆంక్షలు దాటుకుని..

రైతు ధర్నాకు ఆర్మూర్ డివిజన్ రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు ఏసీపీని అనుమతి కోరారు.సానుకూల ప్రకటన రాగా రైతులు ధర్నాకు సిద్ధమయ్యారు. కానీ, ధర్నాకు గంటల వ్యవధి ముందు సీపీ కల్మేశ్వర్ ఉత్తర్వులు రైతుల్లో కోపోద్రిక్తులను గురిచేసింది. రైతుల ఆందోళనకు రాజకీయ పార్టీల పేరును ప్రస్తావిస్తూ ప్రకటన విడుదల చేయడంపై రైతులు మండిపడ్డారు. ఆపై సీపీ కల్మేశ్వర్ వచ్చి పోలీసులతో ఆంక్షలు విధించారు. ఆర్మూర్ టౌన్‌లోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ధర్నాప్రాంతం వరకు ఐదంచెల భద్రత, తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బైక్‌లకు అనుమతి నిరాకరించడంతో రైతులంతా కాలినడకన అక్కడికి చేరుకున్నారు.

### ఇది ఆరంభమే

రాజకీయాలకు సంబంధంలేని రైతులంతా ఇంత పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుట్టడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పడుతున్నాయి. ఆర్మూర్‌లో మొదలైన ఈ రైతు ఉద్యమం ఆరంభం మాత్రమే. ధర్నాకు ఆంక్షలుపెట్టి అడుగడుగునా అడ్డుకున్నా వేలాది మంది రైతులు తరలివచ్చారు. ఈ నిరసనతో ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పినట్లయింది.

**- ఏ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆర్మూర్**

### రైతులకు రేవంత్ మోసం

దేశంలో రైతులను నిలువునా మోసం చేసిన ఏకైక వ్యక్తి రేవంత్ రెడ్డే. ఎన్నికల్లో అసత్యాలు చెప్పి, బూటకపు హామీలతో ప్రజలను రేవంత్‌రెడ్డి మోసం చేశారు. రాష్ట్రంపై కనీస అవగాహన లేకుండా పరిపాలన చేస్తున్నారు. బాసర సరస్వతీ సాక్షిగా, ఆర్మూర్ సిద్దులగుట్ట దేవుడి మీద ఒట్టేసి రుణమాఫీపై రేవంత్‌రెడ్డి మాట తప్పారు.

**- బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్టీసీ మాజీ చైర్మన్**

### సెప్టెంబర్ 15 తర్వాత ఉద్యమం తీవ్రతరం..



ఆర్మూర్ రైతులకు ఉద్యమాలు కొత్త కాదు. తెలంగాణ ఉద్యమం, ఎర్రజొన్న బకాయిలు, పసుపుబోర్డు కోసం పోరాటం చేసిన చరిత్ర ఉంది. రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న రేవంత్‌రెడ్డి షరతులను విధిస్తూ మోసం చేస్తుండటం చాలా బాధేస్తున్నది. రైతులంతా ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పాటై చేపట్టిన ఈ ఉద్యమానికి బ్రహ్మాండమైన స్పందన వచ్చింది. సెప్టెంబర్ 15లోపు షరతుల్లేకుండా రూ.2లక్షలోపు రుణాలను మాఫీ చేయాలని అల్టిమేటం జారీ చేస్తున్నాం. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేసి ప్రజాభవన్‌ను ముట్టడిస్తాం.

**- ఇట్టడి లింగారెడ్డి, రైతు ఐక్యకార్యాచరణ కమిటీ**

### చార్ సౌ బీస్ రేవంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డి తెలిసో, తెలియకో ఆరు గ్యారంటీల పేరుతో 420 హామీలు ఇచ్చిండు. వాటిని అమలు చేయకపోతే రేవంత్‌రెడ్డిని ఇకపై చార్ సౌ బీస్ అనాల్సి వస్తుంది. కేసీఆర్ హయాంలో 37 లక్షల బ్యాంక్ ఖాతాలకు రుణమాఫీ జరిగింది. ఇప్పుడు ఆ సంఖ్య 50 లక్షల ఖాతాలకు చేరాల్సి ఉండగా, 22 లక్షల ఖాతాలకే పరిమితమైంది. రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదు. రూ.2 లక్షల రుణం రద్దు చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం.

**- ప్రభాకర్, రైతు ఐక్య కార్యాచరణ కమిటీ**

### ఉద్యమ రుచి చూపిస్తం..



ఎలక్షన్ టైంల యాడికి వస్తే ఆడ లోన్లు మాఫ్ చేస్తనని దేవుళ్లపై ఒట్టు వెట్టుకున్నవ్. గిప్పుడు సీఎం అయ్యినంక మా లోన్లు మాఫ్ చేయమంటే కొర్రీలు పెట్టుడు పద్ధతి కాదు రేవంత్‌రెడ్డి. లోన్ మాఫీ అయితదని మేమంతా ఆశతోని ఉన్నం. మాట తప్పి మమ్మల్ని మోసం చేసుడు కరెక్టు కాదు. రైతులను రోడ్ల మీదకు వచ్చేటట్లు చేసినవ్. మేమంతా ఒక్క టైనం. రెండు లక్షల రూపాల లోన్లు మాఫ్ జెయ్యాలే. లేకుంటే మా ఉద్యమ రుచి చూపిస్తం.

**-నర్సారెడ్డి, రైతు, ఆలూర్**

## • రేవంత్‌రెడ్డిపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు



*రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో శనివారం రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. భువనగిరి, యాదగిరిగుట్ట, మోటకొండూరు, తుర్కపల్లి, బొమ్మలరామారం స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోకు ఫిర్యాదులు అందజేశారు. - యాదాద్రి భువనగిరి*

## ఈపీసీ ప్రాజెక్టుల రద్దు!

- **సాధ్యాసాధ్యాలపై ఇరిగేషన్‌శాఖ కసరత్తు**

హైదరాబాద్, ఆగస్టు24 (నమస్తే తెలంగాణ): నత్తనడకన కొనసాగుతున్న ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) పనులు రద్దు చేయాలని సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇదే అంశంపై శనివారం జలసౌధలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈపీసీ ప్రాజెక్టుల రద్దు వల్ల వచ్చే సమస్యలు, వాటిని ఎలా అధిగమించాలనే అంశంపై సమాలోచనలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2005 నుంచి 2014 వరకు జలయజ్ఞంలో భాగంగా అనేక సాగునీటి ప్రాజెక్టుల పనులను ఈపీసీ విధానం కింద అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించింది. రాష్ట్ర ఏర్పాటు తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈపీసీ విధానాన్ని రద్దు చేసి, లంప్సమ్ విధానాన్ని పునరుద్ధరించింది. స్వరాష్ట్రంలో చేపట్టిన కొత్త పనులన్నీ లంప్సమ్ విధానంలోనే అప్పగించారు. అప్పటికే ఈపీసీకి విధానంలో అప్పగించిన పనులను కొనసాగించారు. ఈపీసీ విధానంలోని లోపాలు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఆ పనులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ పనులన్నీ రద్దు చేయాలని సాగునీటిశాఖ భావిస్తున్నది.

# సీతక్కా.. మా రుణం మాఫీ కాలేదక్కా!

- **మంత్రిగ్రామం జగ్గన్నపేట అన్నదాతల ఆవేదన**
- **సొంతూరులో 1580 మంది రైతులకు అకౌంట్లు**
- **318 మందికి మాత్రమే మాఫీ**
- **లక్ష లోపు పద్దులేనని అసహనం**



**మంత్రుల ఇలాకాలో రైతన్నకు ధోకా**

వరంగల్, ఆగస్టు 24 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.2 లక్షల వరకు ఉన్న రైతుల రుణాలన్నింటినీ మాఫీ చేశామని గొప్పలు చెప్తుంటే.. స్వయానా అదే ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా ఉన్న సీతక్క సొంతూరు జగ్గన్నపేటలో ఎక్కువ మందికి రుణాలు మాఫీ కాలేదు. దీంతో 'సీతక్కా.. మా రుణాలు మాఫీ కాలేదక్కా' అంటూ అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. రుణాలు మాఫీ చేయించుకునేందుకు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ అలిసిపోతున్నారు. పొలం పనులు చేసుకోలేకపోతున్నామని వాపోతున్నారు. కేవలం 20 శాతం మంది రైతులకే రుణాలు మాఫీ అయ్యాయని విమర్శిస్తున్నారు. అది కూడా రూ.లక్ష లోపు ఉన్న రుణాలే మాఫీ అయిన జాబితాలో ఉన్నాయని, రూ.లక్షపైన ఉన్న రుణాలు మాఫీ కాలేదని పెదవి విరుస్తున్నారు. అంతిమంగా.. పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) సొంతూరు ములుగు జిల్లా ములుగు మండలం జగ్గన్నపేటలో రుణమాఫీ పథకం అటకెక్కిందని రైతులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇక.. జాబితాలో ఉన్న రైతులు బ్యాంకులకు వెళ్లి మళ్లీ లోను కావాలని అడిగితే.. వడ్డీ పైసలు చెల్లిస్తేనే లోను ఇస్తామని బ్యాంకర్లు చెప్తున్నట్టు పేర్కొన్నారు. సీతక్క గ్రామపంచాయతీ పరిధిలో అన్నంపల్లి, సారంగపల్లి, చిన్నగుంటూరుపల్లి, పులిగుండం, ఆరెపల్లి అనుబంధ గ్రామాలున్నాయి. అన్ని కలిపి ఈ పంచాయతీ పరిధిలో 820 కుటుంబాలు, 1750 ఓటర్లు ఉన్నారు. గ్రామపంచాయతీలో 1,580 మంది రైతులకు బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. ములుగు జిల్లా కేంద్రంలోని కెనరా బ్యాంకు (దేవగిరి పట్నం), ఎస్‌బీఐ(ములుగు), పీఏసీఎస్(ములుగు)లో జగ్గన్నపేట గ్రామ రైతులు పంట రుణాలు తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడతల్లో చేసిన రుణమాఫీ కేవలం 318 మంది రైతులకే వర్తించింది. మిగతా 80 శాతం మంది రైతులకు ఈ పథకం వర్తించలేదు.

### అప్పుడు అయినోళ్లకు ఇప్పుడు కాదన్నరు

నాకు 1:22 గుంటల భూమి ఉంది. 2015లో రూ.30 వేల అప్పు తీసుకుంటే.. కేసీఆర్ సర్కారు 2023లో రూ.40 వేలు మాఫీ చేసింది. ఇంకో రూ.26 వేల అప్పు ఉండె. ఇప్పుడు మొదటివిడతల నా పేరు రాలేదెందుకంటే గతంల మాఫీ అయినోళ్లకు ఇప్పుడు అయితలేవని చెప్తే, మొత్తం అప్పు తీర్చిన. మళ్ల లోన్‌పెంచి అకౌంట్లో జమ చేస్తామని చెప్పిండ్లు.

**-దోబె ముత్తయ్య, జగ్గన్నపేట, ములుగు మండలం, ములుగు జిల్లా**

### అందరికీ మాఫీ చెయ్యాలె

నాకు 1:25 గుంటల భూమి ఉంది. బ్యాంకులో రూ.35 వేలు అప్పు ఉంది. 2023లో కేసీఆర్ ఉన్నప్పుడు రూ.30 వేలు మాఫీ అయినయి. అప్పుడు మళ్లీ తీసుకున్న అప్పు ఉన్నది. రుణ మాఫీ ఫస్ట్ లిస్టుల నా పేరు లేదు. ఎవుసం చేసేటోళ్లు అందరికీ మాఫీ ఇయ్యాలె.

**-ఈసం సారక్క, జగ్గన్నపేట, ములుగు మండలం, ములుగు జిల్లా**

# భట్టి ఊరిలో మాఫీ వట్టిదే

### ఆర్థిక మంత్రి గ్రామంలో.. అందని ద్రాక్షగా రుణమాఫీ



ఖమ్మం, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ పాలకుల మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు మాత్రం రైతుల గడప కూడా చేరడం లేదు. రుణమాఫీ ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సొంత గ్రామమైన వైరా నియోజకవర్గంలోని స్నానాల లక్ష్మీపురంలోనూ అనేక మంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఈ గ్రామంలో మొత్తం 232 మంది రైతులు రుణమాఫీకి అర్హులు కాగా కేవలం 94 మందికే రుణమాఫీ దక్కింది. మిగిలిన 138 మందికి స్వల్ప కారణాలను సాకుగా చూపిస్తూ మాఫీ చేయలేదు. దీంతో గత 4 రోజులుగా వైరాలోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లి రుణమాఫీ కోసం మరోసారి దరఖాస్తు చేసుకున్నారు. వైరా మండలం గొల్లపూడి, రెబ్బవరం, పుణ్యపురం, పినపాక, సోమవరం వంటి గ్రామాల్లో అనేకమంది రైతులకు రుణమాఫీ కాలేదు.

### మాఫీకాకపోతే ఇబ్బందులే..

నాకున్న రెండెరాల పొలానికి బ్యాంకు నుంచి రూ.90 వేల రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా రూ.2 లక్షల రుణమాఫీలో నా పేరు లేదు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా. ప్రభుత్వం మాఫీ చేయకపోతే మరిన్ని కష్టాల్లో పడతాను. ప్రభుత్వం మా లాంటి పేదలను ఆదుకునేందుకు వెంటనే రుణమాఫీ చేయాలి.

**-అమ్మిక కృష్ణయ్య, రైతు, స్నానాల లక్ష్మీపురం, వైరా నియోజకవర్గం**

### డిప్యూటీ సీఎం ఊర్లో అంతంత మాత్రమే..

నేను బ్యాంకులో రూ.2 లక్షలు రుణం తీసుకున్నా. రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. ఉప ముఖ్యమంత్రి స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో కూడా రుణమాఫీ అంతంతమాత్రంగానే జరిగింది. తక్షణమే ఆయన స్పందించి గ్రామంలో రుణం తీసుకున్న అందరికి మాఫీ చేయాలి. అప్పుడే రైతులకు న్యాయం జరిగినట్టు అవుతుంది.

**-అమ్మిక రామారావు, మాజీ సర్పంచ్, స్నానాల లక్ష్మీపురం, వైరా నియోజకవర్గం**

### కొలువు రాలేదని నిరుద్యోగి ఆత్మహత్య



రాజశేఖర్(ఫైల్)

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 24: ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో నిరుద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. రామ్‌నగర్‌కాలనీకి చెందిన తంగెళ్లపల్లి రాజశేఖర్ బీటెక్ చదివాడు. ఇంటి వద్దే ఉండి ఉద్యోగానికి ప్రయత్నిస్తున్నాడు. ఎంతకీ జాబ్ రాకపోవడం, చదువు కోసం చేసిన అప్పులు పెరిగాయి. శనివారం ఉదయం తండ్రి పనికి వెళ్లగా, రాజశేఖర్ ఇంట్లో ఉరేసుకున్నాడు. కేసు ద ర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

### నేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 24: ఉపాధి లేక రాజన్న సిరిసిల్లా జిల్లాలో ఓ నేత కార్మికుడు ఆత్యహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని కేసీఆర్ నగర్‌లో ఉంటున్న బోయిని సదానందం(36) మరమగ్గాలు నడుపుతున్నాడు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో పనిలేక ఖాళీగా ఉంటున్నాడు. కుటుంబ పోషణ, అప్పులు భారమై ఆందోళన చెందాడు. శనివారం ఇంట్లోనే గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ దవాఖానకు తీసుకెళ్లారు.



### రిజర్వాయర్‌లో నీళ్లున్నా.. పారని కాల్వలు

*జనగామ మండలం అసలే కరువు ప్రాంతం.. నీరులేక అనేక తిప్పలుపడ్డ ఈ ప్రాంతానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గోదావరి జలాలు తీసుకొచ్చి సస్యశ్యామలం చేసింది. కాల్వల ద్వారా గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపింది. గతంలో ఎక్కడ చూసినా కోనసీమను తలపించిన ఈ ప్రాంతం నేడు బీడువారిన పొలాలతో దర్శనమిస్తున్నది. బొమ్మకూర్ రిజర్వాయర్‌లో నిండుగా నీళ్లున్నా మండలంలోని గ్రామాలకు నీరు విడుదల చేయకపోవడంతో రైతుల పనులు సాగడం లేదు. – జనగామ రూరల్*

### వయనాడ్ విలయంతో ద్రవించిన హృదయం

- **పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**
- **వయనాడ్‌లో పర్యటన.. 20 లక్షల చెక్కు అందజేత**

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): వయనాడ్ విలయంతో తన హృదయం ద్రవించిందని మంత్రి సీతక్క అన్నారు. వయనాడ్‌లో విలయానికి అతలాకుతలమైన ప్రాంతాలను శనివారం ఆమె పరిశీలించారు. ముండక్కై శ్మశానవాటికలో మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబాల సహాయార్థం సేకరించిన రూ.20 లక్షల చెక్కును అక్కడి ఎమ్మెల్యే టీ సిద్ధిఖీకి అందజేశారు. సుమారు రూ.10 లక్షల విలువైన దుస్తులు, నిత్యావసరాలను అందచేశారు. అనంతరం అక్కడి మీడియాతో మాట్లాడారు. పోయిన ప్రాణాలను తీసుకురాలేకపోయినా తనకు అనుబంధం ఉన్న వయనాడ్ ప్రజలకు నైతిక మద్దతు పలికేందుకు వచ్చినట్టు తెలిపారు. విపత్తు బాధితుల జీవితాలను పునర్నిర్మించేందుకు సాయం చేస్తానని భరోసా ఇచ్చారు.

### టార్చర్ భరించలేకే గడ్డిమందు తాగిన

- **వేరే ఉద్యోగం కోసం ఎన్వోసీకి దరఖాస్తు చేసుకున్నా సకాలంలో ఇవ్వకుండా సతాయించారని ఆరోపణ**
- **పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నం**

ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట, ఆగస్టు 24: కొత్త ఉద్యోగంలో చేరేందుకు నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వడంలో ఎంపీడీవో, ఎంపీవో అవమానకరంగా మాట్లాడటంతో తట్టుకోలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్టు రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కిష్టారావుపల్లి కార్యదర్శి లంబాడా శ్రీనివాస్ వాపోయాడు. మెదక్ జిల్లా హవేలీ ఘన్‌పూర్ మండలం ఫరీద్‌పూర్‌కు చెందిన శ్రీనివాస్ రాజన్న సిరిసిల్ల జిల్లా కిష్టారావుపల్లి కార్యదర్శిగా బదిలీపై వచ్చాడు. ఉద్యోగం చేస్తూనే గురుకులం జూనియర్ లెక్చరర్‌గా, మున్సిపల్ సీనియర్ అకౌంటెంట్‌గా ఉద్యోగాలు సాధించాడు. గురుకుల జూనియర్ లెక్చరర్‌గా ఈ నెల 28న, సీనియర్ అకౌంటెంట్‌గా సెప్టెంబర్ 3న జాయిన్ కావాల్సి ఉంది. అందుకు సంబంధించి ఎన్వోసీ కోసం కలెక్టర్‌కు 10 రోజుల క్రితం అర్జీ పెట్టుకున్నట్టు తెలిపాడు. ఈ నెల 21న ఎంపీడీవో శశికళ, ఎంపీవో అబ్దుల్ వాజీద్‌కు అర్జీ పెట్టుకున్నానని, ఈ సమయంలో ఇక్కడే సరిగా విధులు నిర్వహించడం లేదు.. అక్కడెట్లా చేస్తావ్? అని ఎంపీవో అసహనంతో మాట్లాడారని, వెంటనే ఎంపీడీవో వద్దకు వెళ్లి తన ఎన్వోసీ ఇప్పించాలని కోరగా కాసేపు ఆగాలని చెప్పడంతో మనోవేదనకు గురై గడ్డిమందు తాగినట్టు తెలిపాడు. స్థానికులు అతన్ని ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఆయన పరిస్థితిని తెలుసుకునేందుకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ఇల్లంతకుంట మాజీ జడ్పీటీసీ వేణు అక్కడికి వెళ్లారు.

### కొనుక్కునే పెన్షన్ మాకొద్దు

**ఎన్‌ఎంఓపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ**

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): నూతన పెన్షన్ విధానంపై కేంద్ర క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ఏదైనప్పటికీ ఉద్యోగి తన కంట్రిబ్యూషన్‌తో పెన్షన్‌ను కొనుక్కునే విధానాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌ఎంఓపీఎస్) సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ తేల్చిచెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 1970 సెంట్రల్ సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు పాత విధానంలోనే పెన్షన్ ఉండాలని డిమాండ్ చేశారు. ఉద్యోగి తన సర్వీస్‌లో 50% మొత్తాన్ని జమచేస్తే ప్రభుత్వం 20% తీసుకొని మిగతా 30 శాతం ఉద్యోగులకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. 20 శాతాన్ని నష్టపోతామని తెలిసి ఏ ఉద్యోగైనా పెట్టుబడి పెడతారా? అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ విధానంపై కేంద్రం పునరాలోచించాలని కోరారు.



*నిజామాబాద్ జిల్లా గన్నారం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న మెగ్యానాయక్ తండావాసులు*

## విద్యుత్ కోతలపై భగ్గుమన్న ప్రజలు

- **గన్నారం సబ్ స్టేషన్ ముట్టడి**

ఇందల్వాయి, ఆగస్టు 24: తరచూ విద్యుత్తు కోతలపై ప్రజలు భగ్గుమన్నారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలోని మెగ్యానాయక్ తండా వాసులు శనివారం గన్నారం సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. నిత్యం కరెంట్ కోతలు విధిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సహకరిస్తానని ఎస్సై మనోజ్‌కుమార్ హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని తండా వాసులు హెచ్చరించారు.

## • ట్రిపుల్ ఆర్ బాధితుల ఆందోళన




చౌటుప్పల్, ఆగస్టు 24 : రీజినల్ రింగ్ రోడ్డు కోసం భూములు, ఇండ్లు కోల్పోతున్న బాధితులు శనివారం ఆందోళనకు దిగారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అంతకుముందు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. ట్రిపుల్ ఆర్ జంక్షన్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. బొంతల చంద్రారెడ్డి, మాటూరి బాలరాజు, బండారు నర్సింహ, బూరుగు కృష్ణారెడ్డి, ఆకుల ధర్మయ్య, చీరిక సంజీవరెడ్డి, బత్తుల శ్రీశైలం, భూ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.


## ఇన్ఫోసిస్‌పై కాగ్నిజెంట్ దావా

న్యూఢిల్లీ, ఆగస్టు 24: దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్‌పై కాగ్నిజెంట్ గుర్రుమన్నది. వాణిజ్య రహస్యాలు బహిర్గతం చేసినందుకుగాను ఇన్ఫోసిస్‌పై అమెరికా ఫెడరల్ కోర్టులో కాగ్నిజెంట్ దావా దాఖలు చేసింది. వాణిజ్య రహస్యాలతోపాటు హెల్త్‌కేర్ ఇన్సూరెన్స్ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి కీలక అంశాలు బయటకు పొక్కడాన్ని కాగ్నిజెంట్ అభ్యంతరాలు వ్యక్తంచేసింది. కాగ్నిజెంట్ ఆరోపణలను ఇన్ఫోసిస్ కొట్టిపారేసింది. ఈ విషయంపై కోర్టులో తాడోపేడో తెల్చుకుంటామని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## విక్రయదారులకు అమెజాన్ ఊరట

ముంబై, ఆగస్టు 24: విక్రయదారులకు అమెజాన్ శుభవార్తను అందించింది. వారి ఉత్పత్తులపై విధిస్తున్న ఫీజును 12 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత పండుగ సీజన్‌లో మరిన్ని ఉత్పత్తులను విక్రయించేందుకు అవకాశం కల్పించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నది. తగ్గించిన ఫీజు వచ్చే నెల 9 నుంచి అమలులోకి రానున్నట్లు పేర్కొంది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో ఆయా ఉత్పత్తులను బట్టి విక్రయ ఫీజును 3-12 శాతం వరకు వసూలు చేయనున్నది. దీంతో రూ.500 లోపు ధర కలిగిన ఉత్పత్తులను విక్రయించేవారికి ప్రత్యేక ప్రయోజనాలు కలుగనున్నాయని అమెజాన్ ఇండియా డైరెక్టర్ అమిత్ నందా తెలిపారు. ఈ ఫీజు తగ్గింపు పండుగ సీజన్‌కు అనుకూలంగా ఉంటున్నప్పటికీ ఇది తాత్కాలికం కాదని కంపెనీ పేర్కొంది.

# వచ్చే సమీక్షలోనే వడ్డీ కోతలు



ఎంపీసీ సభ్యుడు జయంత్ వర్మ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 24: ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుండటంతో వచ్చే సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించడానికి రిజర్వుబ్యాంక్‌కు వీలు పడనున్నట్లు ద్రవ్యపరపతి సమీక్ష(ఎంపీసీ) సభ్యుడు జయంత్ వర్మ వెల్లడించారు. వచ్చే సమీక్షల్లో ఆర్బీఐ అర శాతం వడ్డీరేట్లను తగ్గిస్తాది అనుకుంటున్నా అని ఒక ప్రైవేట్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. వచ్చే ఆరు నెలల్లో సెంట్రల్ బ్యాంక్ 25 బేసిస్ పాయింట్లు తగ్గించడానికి ఓటు వేయనున్నట్లు, మిగతా పావు శాతం ద్రవ్యోల్బణం, ఇతర పరిణామాలు కూడా కీలకం కానున్నయాన్నరు. ఆహార ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పడుతుండటంతో గత కొన్ని నెలలుగా ధరల సూచీ తగ్గుతూ వస్తున్నదన్నారు. జూలై నెలకుగాను ధరల సూచీ 59 నెలల కనిష్ఠ స్థాయి 3.5 శాతానికి తగ్గిన విషయం తెలిసిందే. అంతక్రితం ఏడాది 7.4 శాతంగా ఉన్నది. అమెరికా ఫెడరల్ రిజర్వు నిర్ణయాలకు అనుగుణంగా ఆర్బీఐ నిర్ణయం తీసుకుంటున్నన్నదానిపై దేశీయ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటాం కానీ, ఫెడ్, గ్లోబల్ నిర్ణయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోలేమని స్పష్టంచేశారు.

### తగ్గిన ఆహార పదార్థాల ధరలు

రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ఆహార పదార్థాల ధరలు ప్రస్తుతం తగ్గుముఖం పట్టాయి. దీంతో గడిచిన రెండు నెలల్లో ఆహార ద్రవ్యోల్బణం ఐదేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దేశవ్యాప్తంగా ఆశించిన స్థాయి కంటే అధికంగా వర్షాలు కురుస్తుండటం, ఖరీఫ్ సీజన్‌లో పంటల విస్తీర్ణం పెరగడంతో ధరలు దిగువముఖం పట్టాయి. భారత వృద్ధిపై ఆందోళన వ్యక్తం చేసిన ఆర్బీఐ..ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయని, అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, యుద్ధమేఘాలు తగ్గిపోవడంతో భవిష్యత్తులో వృద్ధి ఆశాజనకంగా ఉంటుందన్నారు. గత మూడేండ్లుగా ఏడు శాతం వృద్ధిని నమోదు చేసుకుంటున్న భారత్..భవిష్యత్తులో ఇంతే స్థాయిలో ఆశించవచ్చునని వర్మ వెల్లడించారు.

### వడ్డీరేట్లు తగ్గిస్తాం: ఫెడ్ చైర్మన్ పావెల్

వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలున్నాయని అమెరికా ఫెడరల్ రిజర్వు చైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలిచ్చారు. ఫెడరల్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ కాన్సాస్ సిటీ వార్షిక సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వడ్డీరేట్లను ఎంతమేర తగ్గించాలనే విషయాన్ని ఇప్పుడే చెప్పలేమని, ముున్ముందు విడుదలకానున్న స్థూల ఆర్థికాంశాలు, భవిష్యత్తు పరిణామాలు డిసైడ్ చేస్తాయన్నారు. 2022 మార్చి నుంచి 2023 జూలై వరకు వడ్డీరేట్లను 11 శాతం పెంచింది. దీంతో ఫెడ్‌ఖ వడ్డీరేటు 5.25-5.50 శాతానికి చేరుకున్నాయి.

# మారుతి నుంచి ఐదు కార్లు

### వచ్చే ఏడాదిలోగా విడుదల చేయనున్న సంస్థ



న్యూఢిల్లీ, ఆగస్టు 24: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ స్పీడ్ పెంచింది. ఇప్పటికే పలు మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్న సంస్థ..వచ్చే ఏడాది కాలంలో మరో ఐదు మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. ఈ కార్లు రూ.10 లక్షల లోపు ఉండవచ్చునని అంచనా. వచ్చే మూడు నుంచి నాలుగేండ్లలో ఎనిమిది సరికొత్త మాడళ్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించిన సంస్థ..వచ్చే ఏడాదిలోగానే దీంట్లో సగం అందుబాటులోకి తీసుకురాబోతుండటం విశేషం. దీంతోపాటు ఉత్పత్తి, ఎగుమతులను సైతం పెంచుకోవడానికి ప్రణాళికలను వేగవంతం చేస్తున్నది. వచ్చే ఏడాదిలోగా విడుదల చేయనున్న కార్లలతో పెట్రోల్, సీఎన్‌జీ, హైబ్రిడ్ మాడళ్లు ఉన్నాయి. విడుదల చేయనున్న మాడళ్ల వివరాలు..

### సరికొత్త డిజైర్

ఈ ఏడాది పండుగ సీజన్ నాటికి నయా డిజైర్ కారును అందుబాటులోకి తీసుకురాబోతున్నది. డిజైనింగ్, ఫీచర్స్, ప్లాట్‌ఫాం, ఇంజిన్ అన్ని రకాలు నూతన స్విఫ్ట్ మాడల్‌గానే ఉండనున్నాయి. 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో తయారుకానున్న ఈ మాడల్ అధిక మైలేజీ ఇవ్వనున్నది.

### తొలి ఈవీ కారు

వచ్చే రెండు నుంచి మూడేండ్లలో తన తొలి ఈవీ కారును దేశీయ మార్కెట్‌కు పరిచయం చేయబోతున్నది మారుతి. 3.4 మీటర్ల పొడువు కలిగిన ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 230 కిలోమీటర్ల వరకు ప్రయాణించనున్నదని అంచనా. ఈ కారు 2026-27 వరకు అందుబాటులోకి రానున్నది.

### నయా బాలెనో

నయా బాలెనో అందుబాటులోకి తీసుకురాబోతున్నది సంస్థ. 1.2 లీటర్, 3- సిలిండర్ పెట్రోల్ ఇంజిన్, హైబ్రిడ్ టెక్నాలజీతో రూపొందించిన ఈ మాడల్ లీటర్‌కు 35 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనున్నది. 2026లో ఈ మాడల్‌ను తీసుకొచ్చే ఉద్దేశంలో సంస్థ ఉన్నది.

# జియో ఐదు ప్లాన్లు

### రూ.199 నుంచి రూ.299 వరకు

ముంబై, ఆగస్టు 24: దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో కస్టమర్లను ఆకట్టుకోవడానికి మరో కొన్ని చౌకైన ప్లాన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇటీవల ప్లాన్ల ధరలను 30 శాతం వరకు పెంచడంతో కస్టమర్లు ఇతర నెట్‌వర్క్‌లను ఎంచుకోనుండటంతో వీరిని లక్ష్యంగా చేసుకొని ఐదు చౌకైన ప్లాన్లను ప్రవేశపెట్టింది. 18 రోజుల నుంచి 28 రోజుల కాలపరిమితితో రూ.200 ప్రారంభ చార్జీతో వీటిని తీసుకొచ్చింది. ఈ అన్నిరకాల ప్లాన్లలో అన్‌లిమిటెడ్ కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లతోపాటు జియోటీవీ, జియో సినిమా, జియో క్లౌడ్‌ను ఉచితంగా సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చును. వీటి వివరాలు..

**జియో అత్యంత చౌకైన ఐదు ప్లాన్ల వివరాలు..**

- **రూ.199 ప్లాన్**
  కాలపరిమితి 18 రోజులు
  డాటా 27 జీబీ(రోజుకు 1.5 జీబీ)
- **రూ.209 ప్లాన్ వివరాలు**
  కాలపరిమితి 22 రోజులు
  రోజుకు జీబీ డాటా చొప్పున
- **రూ.239 ప్లాన్ వివరాలు**
  కాలపరిమితి 22 రోజులు
  33 జీబీల డాటా(రోజుకు 1.5 జీబీ)
- **రూ.249 ప్లాన్ వివరాలు**
  కాలపరిమితి 28 రోజులు
  28 జీబీల డాటా(రోజుకు 1 జీబీ)
- **రూ.299 ప్లాన్ వివరాలు**
  కాలపరిమితి 28 రోజులు
  42 జీబీల డాటా(రోజుకు 1.5 జీబీ)




# దేశంలో నకిలీ నోట్ల హల్‌చల్

### ఆరేండ్లలో సుమారు రూ.15 లక్షల నోట్లు సీజ్

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): దేశంలో పెద్దనోట్లు రద్దుచేసి ఎనిమిదేండ్లు పూర్తైనప్పటికీ ఇంకా నకిలీ నోట్లు చలమణి అవుతూనే ఉన్నాయి. రిజర్వు బ్యాంకు నివేదిక ఆధారంగా కేంద్ర సర్కార్ పార్లమెంట్‌కు తాజాగా చెప్పిన సమాధానం ప్రకారం.. నకిలీ నోట్లు వినియోగం అంతకంతకు పెరిగినట్టు వెల్లడించింది. గడిచిన ఆరేండ్ల నివేదికను పరిశీలిస్తే ప్రతిఏటా రూ.2 లక్షలకుపైగా నకిలీ నోట్లు సీజ్ అవుతూనే ఉన్నాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.3.17 లక్షల విలువైన నకిలీ కరెన్సీని సీజ్ చేశారు. నిరుడు మాత్రం కాస్త తగ్గి రూ.2.22 లక్షలు సీజ్ చేసినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నల్లధనం, నకిలీ నోట్లను నిర్మూలించేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు అప్పట్లో చెప్పారు. కానీ, నల్లధనం అటుంచి..నకిలీ నోట్లు మాత్రం ఇప్పటికీ చలామణి అవుతునూ ఉన్నాయి. మరోవైపు, నోట్ల రద్దు తర్వాత కేవలం రూ.8.50 కోట్ల విలువైన నకిలీ కరెన్సీని పట్టుకొని 39 కేసులు నమోదు చేసినట్టు జాతీయ దర్యాప్తు సంస్థ వెల్లడించింది. అయితే, 2020లో రూ.92 కోట్ల విలువైన 8,34,947 నోట్లను స్వాధీనం చేసుకున్నట్టు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించింది. అంతకుముందు 2019లో రూ.25 కోట్ల విలువైన 2,87,404 నోట్ల సీజ్‌చేసింది. మరోవైపు, 2018-19లో రూ.3,17,384 విలువైన నకిలీ కరెన్సీలను సీజ్ చేసిన దర్యాప్తు సంస్థలు..ఆ తర్వాత 2019-20లో రూ.2,96,695, 2020-21లో రూ.2,08,625, 2021-22లో రూ.2,30,971, 2021-22లో రూ.2,25,759, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2,22,639 నకిలీ కరెన్సీని సీజ్‌చేసినట్టు తాజాగా వెల్లడించారు. నకిలీ కరెన్సీలో 1, 2, 5, 10, 20, 50, 100, 200, 500 (కొత్త, పాత సిరీస్ నోట్లు) 1000, 2000 నోట్లు ఉన్నాయి.



### నోట్లలో కొత్త భద్రతా ఫీచర్లు

నకిలీ నోట్లను తగ్గించడానికి ఎప్పటికప్పుడు కొత్త భద్రతా ఫీచర్లతో నోట్లను తయారు చేస్తున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు.

# నేను తప్పు చేయలేదు

- కోల్‌కతా హత్యాచార కేసు ప్రధాన నిందితుడు
- అతడితోపాటు మరో ఆరుగురికి పాలీగ్రాఫ్ టెస్టు ప్రారంభం



సంజయ్ రాయ్

కోల్‌కతా/న్యూఢిల్లీ: కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన కేసులో మరో ట్విస్ట్ చోటుచేసుకొన్నది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సంజయ్ రాయ్‌ను శనివారం కోర్టు ముందు ప్రవేశపెట్టిన సందర్భంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. పాలీగ్రాఫ్ టెస్ట్(లై డిటెక్టర్ టెస్ట్)కు ఎందుకు అంగీకరించావని మేజిస్ట్రేట్ వేసిన ప్రశ్నతో సంజయ్ రాయ్ కన్నీరుమున్నీరు అయ్యాడు. జడ్జి ప్రశ్నకు సమాధానం ఇస్తూ తాను నిర్దోషినని, తనపై తప్పుడు కేసు మోపారని తెలిపాడు. కాగా, సంజయ్ రాయ్‌కు పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించేందుకు జిల్లా కోర్టు ఈ సందర్భంగా అనుమతించింది. కోర్టు నుంచి అనుమతి, పరీక్ష చేయాల్సిన వ్యక్తి సమ్మతి తీసుకొన్న తర్వాతనే ఈ లై డిటెక్టర్ టెస్టును నిర్వహించాల్సి ఉంటుంది.

### ఏడుగురికి 'లై డిటెక్షన్' టెస్టులు

ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌తోపాటు మరో ఆరుగురికి శనివారం పాలీగ్రాఫ్ టెస్టులు ప్రారంభమయ్యాయని అధికారులు వెల్లడించారు. సంజయ్ రాయ్‌కు అతన్ని ఉంచిన జైల్లో ఈ పరీక్షను నిర్వహిస్తుండగా, ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్, హత్యాచార ఘటన జరిగిన రాత్రి డ్యూటీలో ఉన్న నలుగురు డాక్టర్లు, పౌర వలంటీర్‌కు కోల్‌కతా సీబీఐ ఆఫీస్‌లో చేస్తున్నారు.

## తప్పించుకోబోయి.. చెరువులో దూకి!

### అస్సాం గ్యాంగ్ రేప్ ప్రధాన నిందితుడు మృతి

న్యూఢిల్లీ: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు.. పోలీసు కస్టడీ నుంచి తప్పించుకోబోయి చెరువులో దూకి మరణించాడు. ఈ ఘటన అస్సాంలోని నాగావ్ జిల్లాలో శనివారం చోటుచేసుకొన్నది. పోలీసుల కథనం ప్రకారం.. నాగావ్ జిల్లాలో గురువారం ట్యూషన్ వెళ్లి తిరిగి వస్తున్న ఓ బాలికపై ముగ్గురు వ్యక్తులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న తఫుజల్ అనే వ్యక్తిని విచారణ అనంతరం క్రైమ్ సీన్ రీక్రియేట్ చేసేందుకు నేరం జరిగిన చోటుకు శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తీసుకెళ్తున్నారు. ఆ సమయంలో పోలీసుల నుంచి తప్పించుకొన్న నిందితుడు సమీపంలోని చెరువులో దూకాడు.

## ఫుట్‌పాత్ కుంగి ఏపీ మహిళ గల్లంతు

### మలేషియాలో దుర్ఘటన

కౌలాలంపూర్, ఆగస్టు 24: మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో శుక్రవారం హఠాత్తుగా నడక దారి కుంగిపోవడంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయలక్ష్మి(45) 8 మీటర్ల గొయ్యిలో గల్లంతయ్యారు. చిత్తూరు జిల్లా అనిమిగాని పల్లెకు చెందిన ఆమె కౌలాలంపూర్‌లో కుటుంబంతో కలిసి పూసల వ్యాపారం చేస్తున్నట్టు సమాచారం. ఘటన జరిగిన డాంగ్ వాంగి ప్రాంతం రెండు ప్రధాన నదుల మధ్యలో ఉంది. గురువారం ఆకస్మిక వర్షాల వల్ల ఆ ప్రాంతంలో హఠాత్తుగా వరదలు సంభవించాయి. బాధితురాలి జాడ కనిపెట్టే వరకు గాలింపు కొనసాగుతుందని స్థానిక పోలీస్ అధిపతి తెలిపారు. సీసీటీవీ కెమెరాల పుటేజీ సాయంతో ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

## 2026 మార్చి నాటికి నక్సలిజం నుంచి విముక్తి

### కేంద్ర హోం మంత్రి అమిత్ షా

రాయ్‌పూర్: 2026 మార్చినాటికి నక్సల్ హింస నుంచి దేశానికి విముక్తి కల్పిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో యాంటీ నక్సల్ ఆపరేషన్స్‌పై జరిగిన సమావేశం అనంతరం శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వామపక్ష తీవ్రవాదంపై అంతిమ దాడికి సమయం వచ్చిందని చెప్పారు. మన దేశంలో ప్రజాస్వామిక వ్యవస్థకు అతి పెద్ద సవాల్ నక్సలిజమని తెలిపారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఈ సవాల్‌ను స్వీకరించిందని, ఆయుధాలు పట్టినవారిని ప్రధాన జీవన స్రవంతిలోకి తేవడానికి ప్రయత్నించిందని చెప్పారు. నక్సలిజం వల్ల గత నాలుగు దశాబ్దాల్లో 17,000 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. నక్సల్ నేతలను మట్టుబెట్టామని తెలిపారు.

**అంతర్-జాతీయం**

# కేంద్రంపై మళ్లీ పోరుబాట

- నవంబర్ 26న అన్నదాతలు, కార్మికుల దేశవ్యాప్త ఆందోళన
- భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ప్రకటించిన ఎస్కేఎం, సీటీయూ




న్యూఢిల్లీ, ఆగస్టు 24: కేంద్రంలోని మోదీ సర్కార్‌పై రైతు, కార్మిక సంఘాలు మరోసారి పోరుబాట పట్టాయి. హక్కులు, డిమాండ్ల సాధన కోసం రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజైన నవంబర్ 26న దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు(సీటీయూ) శుక్రవారం ప్రకటించాయి. బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా బ్యాంకు యూనియన్ల ఉమ్మడి వేదిక ఈనెల 28న చేపట్టిన సమ్మెకు మద్దతిస్తున్నట్టు తెలిపాయి. లేబర్ కోడ్‌ల ఆమోదాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాలు సెప్టెంబర్ 28న తలపెట్టిన 'బ్లాక్ డే' నిరసన కార్యక్రమంలో పాల్గొంటామని ఎస్కేఎం నేతలు పేర్కొన్నారు. సంయుక్త సమావేశంలో పలు అంశాలపై చర్చించిన రైతు, కార్మిక సంఘాల నేతలు ఈ మేరకు భవిష్యత్తు ఉద్యమ కార్యచరణను ప్రకటించారు. కేంద్రంలోని ఎన్డీయే సర్కార్ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల ప్రభుత్వమని విమర్శించారు. పంటలకు ఎంఎస్పీతో సహా రైతుల ఇతర డిమాండ్లను కేంద్రం నిర్లక్ష్యం చేస్తున్నదని, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అది ప్రస్ఫుటం అయిందని పేర్కొన్నారు. నిరుద్యోగం, వ్యవసాయ రంగ సంక్షోభం తదితర సమస్యలు బడ్జెట్‌లో పట్టించుకోలేదని ఎస్కేఎం, సీటీయూ ఆగ్రహం వ్యక్తం చేశాయి. త్వరలో నాలుగు రాష్ర్టాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో ఆయా రాష్ర్టాల్లో బీజేపీ, దాని మిత్రపక్ష పార్టీలను ఓడించేందుకు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకొన్నారు. అదేవిధంగా దేశంలో మహిళలపై పెరుగుతున్న హింస, నేరాల ఘటనలను ఖండించిన నేతలు.. పౌరులందరి భద్రతకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈసారి మిత్రపక్షాల మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్న బీజేపీకి.. రైతు, కార్మిక సంఘాల ఉమ్మడి ఆందోళనలు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మహారాష్ట్రలో కూలిన హెలికాప్టర్

- హైదరాబాద్‌కు వస్తుండగా ప్రమాదం
- పైలట్, ముగ్గురు ప్రయాణికులకు గాయాలు



పుణె, ఆగస్టు 24: మహారాష్ట్రలో శనివారం ఓ ప్రైవేటు హెలికాప్టర్ కుప్పకూలింది. ముంబై నుంచి హైదరాబాద్ వస్తున్న క్రమంలో పుణె జిల్లా ముల్షి తహశీల్ పరిధిలోని కొంద్వాల్ గ్రామ సమీపంలో అదుపుతప్పి కూలిపోయిందని అధికారులు వెల్లడించారు. పైలట్ సహా మరో ముగ్గురు ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. తీవ్ర గాయాలైన పైలట్‌ను పౌద్ దవాఖానకు తరలించారు. మిగతా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయని ఓ అధికారి తెలిపారు. డీజీసీఏ బృందం ఘటనాస్థలికి చేరుకొని ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించింది. హెలికాప్టర్ కూలిన ఏరియాలో శుక్రవారం రాత్రి నుంచి భారీ వర్షాలు పడుతున్నాయని, ప్రతికూల వాతావరణం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకొని ఉండొచ్చని పౌద్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ మనోజ్ యాదవ్ పేర్కొన్నారు. హెలికాప్టర్ గ్లోబల్ వెక్ట్రా ఏవియేషన్ కంపెనీకి చెందినదని తెలిపారు. ముంబై నుంచి బయలుదేరే సమయంలో వాతావరణం బాగానే ఉన్నదని, అయితే పౌద్ ఏరియాకు వచ్చే సరికి ప్రతికూల వాతావరణం ఎదురైందని తెలిపారు. దీంతో హెలికాప్టర్‌ను ల్యాండ్ చేసేందుకు పైలట్ ప్రయత్నించగా, సాధ్యం కాక ఒక చెట్టును ఢీకొని నేల కూలిందని వివరించారు.

## రుమీ ప్రయోగం సక్సెస్

### పునర్వినియోగ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన 'స్పేస్ జోన్ ఇండియా'

చెన్నై, ఆగస్టు 24: భారత్‌లో తొలి పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్ 'రుమీ-2024'ను తమిళనాడు స్టార్టప్ కంపెనీ 'స్పేస్ జోన్ ఇండియా' శనివారం ప్రయోగించింది. రాకెట్ 80 కిలోల బరువు, 3.5 మీటర్ల పొడవు ఉంటుంది. ప్రపంచంలో హైడ్రాలిక్ మొబైల్ కంటెయినర్ లాంచ్‌ప్యాడ్ నుంచి ప్రయోగించిన తొలి హైబ్రిడ్ రాకెట్ ఇదేనని స్పేస్ జోన్ ఇండియా సీఈవో ఆనంద్ చెప్పారు. కిలో కంటే తక్కువ బరువున్న మూడు క్యూబ్ ఉపగ్రహాలతోపాటు 50 పికో ఉపగ్రహాలను భూ ఉప కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్టు తెలిపారు. వాతావరణ పరిస్థితులతోపాటు కాస్మిక్ రేడియేషన్, యూవీ రేడియేషన్, గాలి నాణ్యత తదితర అంశాల వివరాలను క్యూబ్ ఉపగ్రహాలు సేకరిస్తాయని, నింగిలో కంపన స్థాయిలతోపాటు ఓజోన్ పొర స్థితిగతులను పికో ఉపగ్రహాలు గుర్తిస్తాయని వివరించారు. ఉపగ్రహాలను జారవిడిచిన తర్వాత పారాచ్యూట్ సాయంతో 'రుమీ' సముద్రంలో పడిపోయిందని తెలిపారు.

# మరో ఆరు నెలలు అంతరిక్షంలోనే

- సునీత, విల్ మోర్ వచ్చేది ఫిబ్రవరిలోనే!
- జూన్ 5న అంతరిక్ష కేంద్రానికి వ్యోమగాములు
- వీరు వెళ్లిన వ్యోమనౌకలో సాంకేతిక సమస్యలు
- 8 రోజుల మిషన్‌కు వెళ్లి 8 నెలలు అక్కడే!



సునీత

వాషింగ్టన్, ఆగస్టు 24: భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ భూమిపైకి తిరిగి వచ్చేందుకు మరో ఆరు నెలలు పట్టనుంది. ఈ మేరకు శనివారం నాసా కీలక ప్రకటన చేసింది. సునీతా విలియమ్స్‌తో పాటు మరో వ్యోమగామి బారీ విల్‌మోర్‌ను ఫిబ్రవరిలో తీసుకువస్తామని, అప్పటివరకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే వీరు ఉంటారని నాసా ప్రకటించింది. వీరు వెళ్లిన బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌకలో సాంకేతిక సమస్యలు వచ్చినందున, దీంట్లో తిరుగు ప్రయాణం ప్రమాదకరమని నాసా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో వ్యోమగాములు లేకుండా ఆటోపైలట్ పద్ధతిలో దీనిని తిరిగి భూమి మీదకు తీసుకురావాలని నిర్ణయించింది. కాగా, ఎనిమిది రోజులు మిషన్‌లో భాగంగా సునీత, విల్‌మోర్ జూన్ 5న బయలుదేరారు. వీరు వెళ్లేటప్పుడే వ్యోమనౌకలో హీలియం లీక్ కావడంతో ప్రొపల్షన్ వ్యవస్థలో లోపాలు, వాల్వ్‌లో సమస్యలు వచ్చాయి. ఎలాగోలా జూన్ 6న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి సురక్షితంగా చేరుకున్నారు.

### ఏమిటీ మిషన్?

భూమి నుంచి ఐఎస్ఎస్‌కి మనుషులను తీసుకెళ్లి, తీసుకురావడం కోసం బోయింగ్ కంపెనీ స్టార్‌లైనర్ అనే వ్యోమనౌకను తయారుచేసింది. దీని ద్వారా అంతరిక్ష కేంద్రానికి వాణిజ్య ప్రయాణాలు చేపట్టాలనేది బోయింగ్ సంస్థ లక్ష్యం. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో కలిసి అంతరిక్ష కేంద్రానికి వెళ్లే, తిరిగి వచ్చే వ్యోమగాములకు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని బోయింగ్ అనుకుంటున్నది. స్టార్‌లైనర్‌కు ఈ సామర్థ్యాలు ఉన్నాయని ప్రదర్శించేందుకు సునీతా, విల్‌మోర్‌ను అంతరిక్ష కేంద్రానికి పంపించింది. ఇప్పుడు వ్యోమనౌకలో సాంకేతిక సమస్యలతో బోయింగ్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది.

# రాఖీలు కడితే.. నోటీసులు!

- కేటీఆర్‌కు దట్టి, రాఖీలు కట్టిన ఆరుగురు మహిళా కమిషన్ సభ్యులకు తాఖీదులు
- మహిళా కమిషన్ ఎదుట కేటీఆర్ హాజరు
- యథాలాపంగా చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేసినట్టు కమిషన్‌కు వివరించా
- మరోసారి రమ్మన్నారు.. తప్పకుండా వెళ్తా
- బీఆర్ఎస్ మహిళా నేతలపై కాంగ్రెస్ మహిళా నేతల దాడులను ఖండిస్తున్నా: కేటీఆర్



హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు రాఖీలు కట్టిన మహిళా కమిషన్ సభ్యులకు రేవంత్‌రెడ్డి సర్కారు నోటీసులు ఇచ్చింది. తెలంగాణ మహిళా కమిషన్ ఎదుట శనివారం హాజరైన కేటీఆర్‌ను సోదరుడిగా భావించి కమిషన్ సభ్యులు దట్టి, రాఖీలు కట్టారు. ఇటీవలే రాఖీ పండుగ జరగడంతో సోదరుడిగా భావించి కేటీఆర్‌కు ఆరుగురు సభ్యులు రేవతిరావు, అఫ్రోజ్ షాహీనా, గజ్జెల పద్మ, ఉమాయాదవ్, సూదమ్ లక్ష్మి, కొమ్ము ఈశ్వరి రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించారు. మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరైన కేటీఆర్‌కు కార్యాలయంలోనే రాఖీ కట్టడంపై కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆమె ఆదేశం మేరకు కమిషన్ కార్యదర్శి ఆ ఆరుగురు సభ్యులకు నోటీసులు జారీచేశారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద మాత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీపౌర్ణమి రోజు రాఖీ కట్టారు. సోదరుడిగా భావించి కేటీఆర్‌కు రాఖీ కట్టిన మహిళా కమిషన్ సభ్యులపై మాత్రం రేవంత్‌రెడ్డి సర్కారు కక్ష సాధింపు చర్యలకు దిగడం గమనార్హం.

### మహిళలపై దాడుల సంగతేంటి?

రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులపై మహిళా కమిషన్ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ప్రయాణాలపై ఇటీవల యథాలాపంగా చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చేందుకు శనివారం హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లో మహిళా కమిషన్ ఎదుట ఆయన హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చట్టాన్ని, మహిళలను, రాజ్యాంగబద్ధ సంస్థలను గౌరవించే వ్యక్తిగా మహిళా కమిషన్ ఎదుట హాజరైనట్టు చెప్పారు. మహిళలపై తాను యథాలాపంగా చేసిన వ్యాఖ్యలకు అప్పుడే క్షమాపణ చెప్పినట్టు తెలిపారు. మహిళలపై తనకు అపారమైన గౌరవం ఉన్నదని పేర్కొన్నారు. మహిళా కమిషన్ ఆదేశం మేరకు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇచ్చినట్టు వివరించారు. తాను యథాలాపంగా చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేశానని కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. గత 8 నెలల్లో మహిళలపై జరిగిన దారుణాలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కొరవడిందని, విద్యార్థుల పట్ల లైంగికదాడుల వంటి అంశాలపై కమిషన్ వద్ద ప్రస్తావించేందుకు అన్ని వివరాలతో వెళ్లినట్టు వివరించారు. కమిషన్ తనను మరోమారు కలవాలని చెప్పిందని, తప్పకుండా మళ్లీ వస్తానని స్పష్టం చేశారు. తన వివరణపై కమిషన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలని పేర్కొన్నారు. ఒక మాట దొర్లినందుకే మహిళలను గౌరవించే వ్యక్తిగా క్షమాపణలు చెప్పినట్టు వివరించారు. తనతోపాటు బుద్ధభవన్‌కు వచ్చిన బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులపై మహిళా కాంగ్రెస్ నేతలు నెయిల్ కట్టర్ చాకులతో గాయపరిచారని, ఈ ఘటనను మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుని చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### దాడి కాంగ్రెస్ దుష్ట సంస్కృతికి నిదర్శనం

కేటీఆర్‌తోపాటు ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మిరెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మహిళా నేతలు కూడా మీడియాతో మాట్లాడారు. మహిళా కమిషన్ ఎదుట హాజరు కావాలని ఆదేశించడం, వచ్చాక దాడులు చేయడం శోచనీయమమని సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ దుష్ట సంస్కృతికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళల పట్ల కేటీఆర్‌కు నిబద్ధత ఉన్నది కాబట్టే కమిషన్ ఇచ్చిన సమయం కంటే ముందే హాజరయ్యారని చెప్పారు. బాధ్యతాయుతంగా వివరణ ఇచ్చారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం మహిళా శాసనసభ్యులను అవమానించటంతోపాటు తమ పార్టీ నేతలపై దాడి చేయించారని విమర్శించారు.

### ప్రతిదాంట్లో రాజకీయాలు: సబిత

కాంగ్రెస్ పార్టీ ప్రతి దాంట్లోనూ రాజకీయాలు చేసి లబ్ధిపొందాలని చూస్తున్నదని మాజీ మంత్రి, చేవెళ్ల ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. చట్టంపై ఉన్న గౌరవంతో మహిళా కమిషన్ ఎదుట కేటీఆర్ హాజరై తన హుందాతనాన్ని చాటుకున్నారని చెప్పారు. దానిని కూడా మహిళా కాంగ్రెస్ నాయకులు అడ్డుకొనే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు, నాయకులపై దాడులు చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులపై భౌతికదాడికి పాల్పడిన వ్యక్తులపై తక్షణమే మహిళా కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్, దళిత మహిళ, బాలికపై లైంగికదాడి ఘటనలను మహిళా కమిషన్ సుమోటోగా తీసుకోవాలని సబితారెడ్డి కోరారు.

# మహిళా కాంగ్రెస్ దౌర్జన్యం

- మీడియా సాక్షిగా, పోలీసులను అడ్డంపెట్టుకొని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ప్రతినిధులపై దాడి
- నెయిల్ కట్టర్ చాకులతో గాయపర్చిన కార్యకర్తలు
- మహిళలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- మహిళా కమిషన్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



తోపులాడుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ మహిళా శ్రేణులు

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): మహిళా కమిషన్ ఇచ్చిన నోటీసుపై వివరణ ఇచ్చేందుకు కేటీఆర్ శనివారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర మహిళా కమిషన్ ఎదుట హాజరయ్యారు. కేటీఆర్‌కు సంఘీభావంగా ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, మహిళా నాయకులు మాలె శరణ్యారెడ్డి తదితరులు వెంట వచ్చారు. కేటీఆర్‌తోపాటు కార్యాలయం లోపలికి వెళ్లేందుకు వారికి అనుమతి ఇవ్వకపోవడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదే సమయంలో అక్కడే ఉన్న మహిళా కాంగ్రెస్ నేతలు దౌర్జన్యానికి దిగారు. మీడియా సాక్షిగా పోలీసుల అండతో రెచ్చిపోయారు. మహిళలకు కేటీఆర్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత నేతృత్వంలో ఆ పార్టీ శ్రేణులు బుద్ధభవన్ గేటును తోసుకొని దూసుకొచ్చారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, మహిళా నేతలకు గాజులు చూపిస్తూ కవ్వింపు చర్యలకు దిగారు. బీఆర్ఎస్‌కు, కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వారిపైకి దూసుకెళ్లడంతో ఉద్రిక్తత నెలకొన్నది. కాంగ్రెస్‌కు పోటాపోటీగా బీఆర్ఎస్ మహిళా శ్రేణులు కూడా ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఒక్కసారిగా గందరగోళంగా మారింది. పరస్పరం తోపులాటలు, నినాదాలతో మహిళా కమిషన్ కార్యాలయం ఎదుట పరిస్థితి రణరంగంగా మారింది. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నాయకులు పలువురు తమపై నెయిల్ కట్టర్ కత్తులతో దాడిచేశారని బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు ఆరోపించారు. గాయాలను మీడియాకు చూపించారు. మధ్యాహ్నం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతతోపాటు ఇతర మహిళా నాయకులను పోలీసులు అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.



నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు

### దొంగ పోలీసులపై చర్యలు తీసుకోవాలి: సునీతారావు

పోలీసులు తమను జుట్టు పట్టుకొని బూట్లతో తన్నారని, దీనిపై పోలీస్ కమిషనర్ విచారణ జరిపించి యూనిఫాం వేసుకున్న దొంగ పోలీసులపై చర్యలు తీసుకోవాలని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు డిమాండ్ చేశారు. మహిళలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ శనివారం మహిళా కమిషన్ కార్యాలయం వద్ద జరిగిన ఆందోళన సందర్భంగా పోలీసులు తమపట్ల వ్యవహరించిన తీరును ఆమె ఖండించారు. సంఘటన అనంతరం గాంధీభవన్‌లో సునీతారావు విలేకరులతో మాట్లాడుతూ, తమపట్ల దురుసుగా వ్యవహరించిన పోలీసులపై సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఓ మహిళా కార్యకర్తకు గాయాలు అయ్యాయని, వేలు విరిగిపోయిందని సునీతారావు తెలిపారు.



## జిట్టాను పరామర్శించిన కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): అనారోగ్యంతో యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పార్టీ సీనియర్ నాయకులు జిట్టా బాలకృష్ణారెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు శనివారం పరామర్శించారు. ఆయనకు అందుతున్న వైద్యం వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. జిట్టా బాలకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతోనూ కేటీఆర్ మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని, జిట్టా కోలుకుంటున్నట్లు వైద్యులు చెప్పారని వారికి తెలిపారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి తదితరులున్నారు.

## మహిళా జర్నలిస్టులపై దాడులు ఆపండి

- సోషల్ మీడియాలో ట్రోల్స్ నివారించండి
- ఫిర్యాదు చేయగానే స్పందించే సిస్టం పెట్టాలి
- మహిళా జర్నలిస్టుల వినతి

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా తమపై జరుగుతున్న దాడులు, ట్రోల్స్‌ను ఆపాలని తెలంగాణ మహిళా జర్నలిస్టులు డిమాండ్ చేశారు. రాజకీయ వార్తాంశాలను కవర్ చేసే మహిళా జర్నలిస్టులపై పార్టీల కార్యకర్తలు టార్గెట్‌చేసి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ట్రోల్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లెలో జర్నలిస్టులు సరిత, విజయారెడ్డి పర్యటించి రుణమాఫీపై గ్రౌండ్ రిపోర్ట్ కోసం వెళ్లినప్పుడు కాంగ్రెస్ మద్దతుదారులు, సీఎం అభిమానులు బైకులతో రౌండప్‌చేసి, కెమెరా, ఫోన్లు లాక్కొని భయభ్రాంతులకు గురిచేశారని ఉదహరించారు. మహిళా జర్నలిస్టుల సమస్యలపై స్పందించే క్విక్ సపోర్ట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. మహిళా జర్నలిస్టులను రాజకీయ పార్టీలు, మద్దతుదారులు నడిపే పేజీల నుంచి, ఫేక్ అకౌంట్స్ నుంచి వచ్చే ట్రోల్స్‌కు ఆ రాజకీయ పార్టీలనే బాధ్యులను చేయాలని సూచించారు. ఈ మేరకు పోలీస్ శాఖ అన్ని రాజకీయ పార్టీలకు స్పష్టమైన హెచ్చరికలు జారీచేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రానికి చెందిన 48 మంది మహిళా జర్నలిస్టులు సంతకాలు చేసిన పత్రికా ప్రకటనను శనివారం విడుదల చేశారు.

# పీసీసీపై పీటముడి?

- ఎటూ తేల్చని అధిష్ఠానం
- మహేశ్‌కుమార్ గౌడ్‌కు మధుయాష్కీ నుంచి తీవ్ర పోటీ
- సీఎం, సీనియర్ నేతల మధ్య తారస్థాయికి ఆధిపత్య పోరు



హైదరాబాద్, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): టీపీసీసీ అధ్యక్షుడి ఎంపికపై మళ్లీ పీటముడి పడింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కీలక మంత్రులు ఢిల్లీలో రెండు రోజులు మంత్రాంగం సాగించినా అధిష్ఠానం ఎటూ తేల్చకుండా వారిని తిప్పిపంపింది. పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై పార్టీలో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరినట్టు తెలిసింది. తన అనుయాయులను పీసీసీ పీఠంపై కూర్చోబెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తుండగా ఇందుకు చెక్ పెట్టేందుకు సీనియర్ నేతలు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. మొన్నటివరకు పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ పేరు దాదాపు ఖరారైందని అన్నారు. శనివారం మధ్యాహ్నానికి సీనియర్ నేత మధుయాష్కీగౌడ్ ముందువరుసలోకి వచ్చినట్టు ఢిల్లీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఆయనకు పలువురు సీనియర్ మంత్రులతోపాటు నేతలు మద్దతు పలుకుతున్నట్టు తెలిసింది. పీసీసీ పదవికి సీఎం రేవంత్‌రెడ్డి సూచించిన పేర్లపై అధిష్ఠానం పెద్దగా ఆసక్తి చూపించలేదని తెలిసింది. అలా చేస్తే.. పార్టీ, ప్రభుత్వం రెండూ ఆయన చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలిసింది.

### సీఎం.. సైలెంట్!

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి రెండు రోజుల ఢిల్లీ పర్యటన ముగిసి శనివారం హైదరాబాద్‌కు తిరిగివచ్చారు. ఈసారి కూడా కాంగ్రెస్ అధిష్ఠానం వారిని ఉత్తచేతులతోనే తిప్పి పంపింది. పీసీసీ అధ్యక్షుడి ఎన్నిక, మంత్రివర్గ విస్తరణపై తుది నిర్ణయం తీసుకుంటారని భావించినా సీఎం రేవంత్‌రెడ్డి 20వ పర్యటనలోనూ ఢిల్లీ పెద్దలు ఏమీ తేల్చలేదు. దీంతో సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు ఆశావహులంతా ఉసూరుమంటూ తిరిగి రావాల్సి వచ్చింది. ఢిల్లీలో రెండో రోజు సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడా బయటికి కనిపించకపోవటం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఇద్దరు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పించగా.. శనివారం ఎలాంటి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనలేదు. సాధారణంగా ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారి సీఎం రోజూ ఏదో ఒక హడావుడి చేస్తుంటారు. అధికారిక కార్యక్రమాలు లేకపోతే కనీసం నేతలతో సమావేశాలు, మీడియాతో చిట్‌చాట్ చేస్తుంటారు. కానీ అలాంటిదేమీ కనిపించలేదు. మీడియాతో కూడా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాత్రమే మాట్లాడారు. దీంతో 'సీఎం ఎందుకు సైలెంట్ అయ్యారు' అని కాంగ్రెస్ వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది.

#### ఆరు నెలలుగా ముప్పతిప్పలు

పీసీసీ చీఫ్, మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానం 6 నెలలుగా ముప్పుతిప్పలు పెడుతున్నదని ఆశావహులు మండిపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు నుంచీ అదిగో.. ఇదిగో.. అంటూ ఊరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన మంత్రుల ప్రమాణ స్వీకారం అంటూ రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసేదాకా వెళ్లిందని గుర్తుచేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యేదాకా కోడ్‌ను, ఆ తర్వాత ఆషాఢమాసం అంటూ అడ్డుకున్నారని చెప్తున్నారు. శ్రావణమాసం మొదలుకాగానే ప్రమాణ స్వీకారమే అంటూ ఊరించారని.. మరో వారంలో శ్రావణం ముగుస్తున్నా తేల్చడం లేదని చెప్తున్నారు. ఓవైపు ఢిల్లీ పెద్దలు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడం, మరోవైపు పార్టీ, ప్రభుత్వంలో ఒత్తిడి పెరగటం వల్లే రేవంత్‌రెడ్డి శనివారం ఎక్కడా కనిపించలేదని చర్చ జరుగుతున్నది.

### ఒకరికి ఒకరు చెక్ పెట్టే పనిలో.

సీఎం రేవంత్‌రెడ్డి సన్నిహితులకు పీసీసీ పదవి దక్కొద్దని సీనియర్ నేతలు, తనవారికి కాకుండా ఇతరులెవరికీ పీసీసీ పదవి దక్కొద్దని రేవంత్‌రెడ్డివర్గం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. తన వారికి కాకుండా సీనియర్లకు, అధిష్ఠానానికి దగ్గరగా ఉండే నేతలకు పీసీసీ పీఠం దక్కితే తనకు చెక్ పడినట్టేనని రేవంత్ భావిస్తున్నట్టు పార్టీలో చర్చ జరుగుతున్నది. రేవంత్ వర్గం నేతలకు పీసీసీ పీఠం దక్కితే తమ పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని సీనియర్ నేతలు ఆందోళనలో ఉన్నట్టు చెప్తున్నారు. ఒకరి ప్రయత్నాలను మరొకరు అడ్డుకుంటున్నట్టు సమాచారం.

## సీఎం రేవంత్‌కు వివేకం రావాలి

**బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్**

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): ఆకతాయితనంతో వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిలో వివేకం నెలకొనాలని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆశించారు. సీఎం రేవంత్ ముఖ్యమంత్రిగా ఉన్నతిని ప్రదర్శించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సీఎం దుందుడుకు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులను తన అనుచరులతో వీరంగం సృష్టించినట్టే.. శనివారం కేటీఆర్ మహిళా కమిషన్ కార్యాలయానికి హాజరైతే అవే చర్యలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి తన ఆకతాయితనాన్ని వీడి వివేకంతో వ్యవహరించాలని సూచించారు.

## రేవంత్‌రెడ్డి పేరిట ప్రభుత్వ భూమి!

- 2009 ఎలక్షన్ అఫిడవిట్‌లో వెల్లడి
- 2023 అఫిడవిట్‌లో ఎందుకు పెట్టలె
- సోషల్‌మీడియాలో నెటిజన్ ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ పేరిట ప్రభుత్వ భూమి ఉన్నట్టు 2009 ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారని, 2023 అఫిడవిట్‌లో ఎందుకు పెట్టలేదని ఎక్స్ వేదికగా భరత్ అనే నెటిజన్ పోస్టు చేశారు. ఈ విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గోపన్పల్లి సర్వే నంబర్ 372, 306, 3, 292లో భాగం ఉన్నట్టుగా, 127 తన పేరు మీద ఉన్నట్టు 2009 ఎన్నికల అఫిడవిట్‌లో రేవంత్‌పేర్కొన్నారని నెటిజన్ వివరించారు. 2023 అఫిడవిట్‌లో 128/ఏఏ మాత్రమే ఉన్నట్టు తెలిపారని వెల్లడించారు. సర్వే నంబర్ 3, 292 అనేవి ప్రభుత్వ భూములని, ఆ ఊర్లో సర్వే నంబర్ 372 లేనేలేదని పేర్కొన్నారు. సర్వే నంబర్ 3, 292 రేవంత్‌వి అయితే 2023లో ఎందుకు అఫిడవిట్‌లో పెట్టలేదని ప్రశ్నించారు. ఎన్నికల అఫిడవిట్లతోపాటు, రెవెన్యూ రికార్డుల పత్రాలను కూడా అందులో పోస్ట్ చేశారు.

# 'ధరణి' రద్దు అనవసరం

- సవరణలు చేసి కొనసాగించవచ్చు
- తప్పుచేసిన అధికారిపై చర్యలుండాలి
- ఆర్ఓఆర్ చట్టంపై మాజీ ఎంపీ వినోద్



హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): ధరణి చట్టం -2020 రద్దు చేయాల్సిన అవసరంలేదని, సవరణలు చేస్తే సరిపోతుందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రభుత్వానికి శనివారం లేఖ రాశారు. తెలంగాణ రికార్డ్స్ రైట్స్ బిల్లు 2024 కు సూచనలు చేయమని ప్రజలు, న్యాయవాదులు, రెవెన్యూ, రిటైర్డ్ అధికారులను కోరారని చెప్పారు. రెవెన్యూ చట్టాల గురించి తోటి న్యాయవాదులతో కూలంకషంగా చర్చించానని తెలిపారు.

### సబ్ సెక్షన్ చేర్చాలి

సెక్షన్-1కు అదనంగా మరొక సబ్‌సెక్షన్‌ను ఏర్పాటుచేయాలని సూచించారు. గత ప్రభుత్వం కూడా ధరణి చట్టం వచ్చాక మార్పులు చేయాలని అభిప్రాయపడిందని గుర్తు చేశారు. ఎన్నికలు రావడంతో చేయలేకపోయారని తెలిపారు. గత ప్రభుత్వ చట్టంలో తప్పు చేసిన అధికారిపై చర్యలు తీసుకునే వెసులుబాటు ఉన్నదని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో యాజమానికి ఎక్కడ భూమి ఉన్నా ఒకటే నంబర్ చెప్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో యాంబిగ్విటీ (సందిగ్ధత, అస్పష్టత) పదాన్ని కొత్త చట్టం నుంచి తొలగించాలని కోరారు. యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూఐఎన్) ఇచ్చారని తెలిపారు. ఆర్వోఆర్ చట్టంలోని 20 సెక్షన్‌లను లోతుగా అధ్యయనం చేసి తమ అభిప్రాయం చెప్పామని తెలిపారు.

# ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలి

**మున్నూరుకాపు అపెక్స్ కౌన్సిల్‌లో ఎంపీ వద్దిరాజు**

హైదరాబాద్, ఆగస్టు24 (నమస్తే తెలంగాణ) : మున్నూరుకాపులంతా రాజకీయాలకతీతంగా ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. మున్నూరుకాపు సంఘం అపెక్స్ కౌన్సిల్ సమావేశం శనివారం నగరంలోని రాజరాజేశ్వరి గార్డెన్స్ హాల్‌లో కౌన్సిల్ కన్వీనర్ పుటం పురుషోత్తమరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న తమ కులానికి మంత్రివర్గంలో చోటులేకపోవడం విచారకరమన్నారు. త్వరలో చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణలో మున్నూరుకాపులకు అవకాశం ఇవ్వాలని కోరారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అపెక్స్ కౌన్సిల్ గౌరవ చైర్మన్‌గా కొనసాగేందుకు అంగీకరించిన బీజేపీకి, కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.50కోట్లు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి అపెక్స్ కౌన్సిల్ కృతజ్ఞతలు తెలిపింది. కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ విగ్రహాన్ని నగరంలో ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రభుత్వ విప్, అపెక్స్ కౌన్సిల్ చైర్మన్ ఆది శ్రీనివాస్, పురుషోత్తమరావు, బాలకిషన్, శ్రీరామ్‌చక్రవర్తి, కౌన్సిల్ కోర్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మున్నూరుకాపు అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర




# రేవంత్ రాజకీయ హైడ్రామా!

## అత్యవసరంగా ఎందుకు కూల్చారు?

- ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై రాష్ట్ర హైకోర్టు మండిపాటు
- యథాతథ స్థితిని కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ) మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌కు నోటీసులు ఇచ్చిన గంటకే ఎలా కూల్చివేస్తారని హైడ్రాను హైకోర్టు ప్రశ్నించింది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అంత అత్యవసరంగా ఎందుకు కూల్చివేశారని నిప్పులు చెరిగింది. ప్రభుత్వమే యథాతథస్థితిని కొనసాగించాలని ఇచ్చిన ఉత్తర్వులు ఇంకా పెండింగ్‌లో ఉండగానే ఎలా కూల్చేస్తారనే లా పాయింట్‌ను లేవనెత్తింది. కనీసం వివరణ ఇవ్వడానికి కూడా అవకాశం ఇవ్వరా అంటూ మండిపడింది. చట్ట ప్రకారం నోటీసుకు వివరణ ఇచ్చేందుకు కనీస గడువు ఉండాలి కదా? అని ప్రశ్నించింది. హైదరాబాద్ కొండాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ కూల్చివేతల వ్యవహారంలో యథాతథస్థితి కొనసాగించాలని హైకోర్టు శనివారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కన్వెన్షన్‌ను కూల్చివేసిన హైడ్రా తీరును తీవ్రంగా ఆక్షేపించింది. శనివారం ఉదయం నోటీసులు ఇచ్చి ఆ వెంటనే ఎలా కూల్చిస్తారని మండిపడింది.

### హౌస్ మోషన్ పిటిషన్

సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేతను సవాలు చేస్తూ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నల్లా ప్రీతమ్‌రెడ్డి హౌస్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ టీ వినోద్‌కుమార్ అత్యవసరంగా విచారణ చేపట్టారు. ఎన్ కన్వెన్షన్ నిర్మాణ క్రమబద్ధీకరణ (బీఆర్‌ఎస్) వ్యవహారంపై ప్రభుత్వమే స్టేటస్ కో (యథాతథ స్థితి) ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ ఉత్తర్వులను ప్రభుత్వమే తిరిగి ఎలా ఉల్లంఘిస్తుందని ప్రశ్నించారు. తదుపరి ఉత్తర్వుల వరకు స్టేటస్ కో ఆదేశాలు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. ఇరుపక్షాలు యథాతథస్థితిని కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్ కన్వెన్షన్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరగా అందుకు న్యాయమూర్తి నిరాకరించారు. నోటీసులు ఇవ్వలేదని పిటిషనర్, ఇచ్చామని ప్రభుత్వం చెప్తున్నదని, అయితే నోటీసులు ఇచ్చినట్టు తగిన ఆధారాలు కూడా చూపడం లేదని, ప్రాథమికంగా దీనిపై లోతుగా విచారణ చేయాల్సిన అవసరం ఉన్నందున స్టేటస్ కో ఆదేశాలు జారీ చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రతివాదులు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. తమ్మిడికుంట చెరువు విస్తీర్ణం 29 ఎకరాలని అంటున్నారని, ల్యాండ్ గ్రాబింగ్ కోర్టులో చెరువు విస్తీర్ణం 26 ఎకరాలని ప్రభుత్వం చెప్పిందని, ఈ వివరాలపై పొంతన లేనందున యథాతథస్థితి ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి, నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్, హైడ్రా కమిషనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 9వ తేదీకి వాయిదా వేశారు.

### ఇది హైడ్రామా: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో హైడ్రా పేరుతో హైడ్రామా నడుస్తున్నదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఏ చర్యలైనా అందరికీ సమానంగా వర్తింపచేయాలని, ఇష్టమొచ్చినట్టు చేస్తామంటే కుదరదని అన్నారు. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై ఢిల్లీలో ఆయన స్పందిస్తూ.. గతంలో ఎలా అనుమతులు ఇచ్చారని, అక్రమ నిర్మాణాలకు రోడ్లు, విద్యుత్తు, నీటి సదుపాయం ఎలా కల్పించారని ప్రశ్నించారు.

### హైకోర్టు స్టే ఎందుకు ?: రఘునందన్‌రావు

చెరువుల్లోని ఆక్రమణలను సర్వే చేసి కూలగొట్టాలని సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే... ఎన్ కన్వెన్షన్‌పై హైకోర్టు స్టే ఇవ్వడమేంటని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ కూలగొట్టడంపై ఆయన స్పందిస్తూ.. 2015లో స్టే ఇస్తే ఇప్పటివరకు ఈ కేసు ఎందుకు విచారణకు రాలేదని, ఇది ఎవరి తప్పు అని ప్రశ్నించారు. స్టే ఇచ్చే ముందు సుప్రీం కోర్టు ఆదేశాలపై హైకోర్టు జడ్జీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

### అధికారులకు పూర్తి స్వేచ్ఛ
### మంత్రి జూపల్లి

ప్రభుత్వ వ్యవస్థలు వాటి పని అవి చేసుకుంటూ పోతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తమ ప్రభుత్వం అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని తెలిపారు.

### ఎవరిపైనా కక్ష లేదు
### మంత్రి పొన్నం

ప్రభుత్వం ఎవరి మీదైనా కక్షతో, వ్యక్తిగత ద్వేషంతో, ఉద్దేశపూర్వకంగా చర్యలు తీసుకోదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమాజంలో పరివర్తన తెచ్చేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగానే అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నట్టు పేర్కొన్నారు.



తుమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నదంటూ హైడ్రా అధికారులు కూల్చివేసిన నాగార్జున ఎన్ కన్వెన్షన్ సెంటర్

# ఎన్ కన్వెన్షన్ కూల్చివేత

- తుమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో 3.30 ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు: హైడ్రా కమిషనర్ రంగనాథ్
- స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్ సిటీబ్యూరో/మాదాపూర్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలోని మాదాపూర్ పరిధిలో ఉన్న తెలుగు సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లోని అనధికారిక నిర్మాణాలను శనివారం హైడ్రా కూల్చేసింది. తెల్లవారుజామున పోలీసుల బందోబస్తుతో జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో, భారీ యంత్రాలతో హైడ్రా అధికారులు ఎన్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని అక్రమ నిర్మాణాలను కూల్చేశారు. తమ్మిడికుంట చెరువుకు ఆనుకొని నిర్మించిన మరో రెండు షెడ్లను సైతం హైడ్రా కూల్చేసింది. ఎన్ కన్వెన్షన్‌లోని అక్రమ కట్టడాల కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఓ ప్రకటన విడుదల చేశారు. దానిలో పలు కీలక అంశాలను ఆయన పేర్కొన్నారు. ఖానామెట్ గ్రామ పరిధిలోని తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్‌ట్యాంక్‌లెవల్) పరిధిలో ఒక ఎకరా 12 గుంటలు, బఫర్ జోన్‌లో 2.18 ఎకరాల స్థలంలో అనధికారికంగా నిర్మాణాలు చేశారని, దీనిపై ఫిర్యాదులు రావడంతో కూల్చేసినట్టు కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. 2014లో హెచ్‌ఎండీఏ తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయగా, 2016లో ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు తెలిపారు. ప్రాథమిక నోటిఫికేషన్‌పై ఎన్ కన్వెన్షన్ యజమాన్యం హైకోర్టుకు వెళ్లిందని, చట్టప్రకారం నడుచుకోవాలని, ఎఫ్‌టీఎల్ నిబంధనలను పాటించాలంటూ ఆనాడు హైకోర్టు ఆర్డర్ ఇచ్చినట్టు తెలిపారు. ఆ తర్వాత ఎఫ్‌టీఎల్ సర్వే పూర్తిచేసి, ఆ నివేదికను ఎన్ కన్వెన్షన్ యజమాన్యానికి అధికారులు అందించారని తెలిపారు. అనంతరం కన్వెన్షన్ యజమాన్యం మియాపూర్ అదనపు జిల్లా జడ్జి కోర్టును ఆశ్రయించిందని, ఈ కేసు ఆ కోర్టులో పెండింగ్‌లో ఉన్నదని తెలిపారు. ఇది తప్పా.. ఏ కోర్టు కూడా స్టే ఆర్డర్లు ఇవ్వలేదని హైడ్రా కమిషనర్ వెల్లడించారు.

### జీహెచ్‌ఎంసీ అనుమతులు లేవు

ఎన్ కన్వెన్షన్ యజమాన్యం నిబంధనలు ఉల్లంఘించి 3.30 ఎకరాల్లో చేపట్టిన అనధికార నిర్మాణాలకు జీహెచ్‌ఎంసీ ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఇదే యజమాన్యం బిల్డింగ్ రెగ్యులరైజ్ స్కీమ్ (బీఆర్‌ఎస్)లోనూ తమ నిర్మాణాల రెగ్యులరైజ్‌కు ప్రయత్నించగా, అది తిరస్కరణకు గురయ్యిందని పేర్కొన్నారు. తమ్మిడికుంట చెరువుకు మాదాపూర్ పరిసర ప్రాంతాల్లోని నాలాలు అనుసంధానమై ఉన్నాయని, హైటెక్ సిటీ ప్రాంతంలో వరదనీరు నిలిచే సమస్య తీవ్రంగా ఉన్నదని తెలిపారు. ఒక పక్క చెరువు కబ్జాకు గురికావడంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం 50 నుంచి 60 శాతం వరకు కుచించుకుపోయిందని, దీంతో భారీ వర్షాలు పడిన సమయంలో తమ్మిడికుంట చెరువు దిగువన ఉన్న ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, పేద, మధ్య తరగతి కుటుంబాల ఇండ్లు నీటిలో మునిగిపోతూ తీవ్ర ఆస్తి నష్టానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే నిర్ణీత ప్రక్రియను అనుసరించి నీటిపారుదల, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి తమ్మిడికుంట చెరువులో అనధికారిక నిర్మాణాలను పూర్తిగా కూల్చివేశామని రంగనాథ్ చెప్పారు. తెలంగాణ హైకోర్టు శనివారం మధ్యాహ్నం ఈ కూల్చివేతలపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఎన్ కన్వెన్షన్ కూల్చివేత ఘటనతో వచ్చే నెల వరకు వివాహ, ఇతర ఫంక్షన్ల నిర్వహణకు ఎన్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌ను బుక్ చేసుకున్న నిర్వాహకులు ఆందోళనలో పడ్డారు. ఇప్పటికే ఆహ్వాన పత్రికలు అందజేసిన వారు మరో ఫంక్షన్‌హాల్ కోసం వెతుకులాటలో పడ్డారు.

## అంగుళం భూమినీ ఆక్రమించలేదు!



- కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా కూల్చివేతలు
- నోటీసులివ్వకుండా కూల్చడం బాధాకరం
- తీర్పు వ్యతిరేకంగా వస్తే నేనే కూల్చివేసేవాడిని
- ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై సినీనటుడు నాగార్జున

హైదరాబాద్, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): కోర్టు నుంచి స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ దానికి విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్ కట్టడాలను కూల్చివేయడం బాధాకరమని ఎన్ కన్వెన్షన్ యజమాని, సినీ నటుడు అక్కినేని నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్య పూర్తిగా చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అది పూర్తిగా ప్రైవేటు భూమి అని, అంగుళం కూడా చెరువు భూమిని తాము ఆక్రమించలేదని స్పష్టం చేశారు. తాజా పరిణామాల వల్ల తాము ఆక్రమణలు చేశామని, తప్పుడు నిర్మాణాలు చేపట్టామని ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉన్నదని, ఆ అభిప్రాయాన్ని పోగొట్టాలనేదే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్ కన్వెన్షన్ కూల్చివేత చర్యపై ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఈ నిర్మాణ కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపై కోర్టు స్టే కూడా మంజూరు చేసిందని తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోకుండా చట్టవిరుద్ధంగా కూల్చివేతలు చేపట్టారని మండిపడ్డారు. కూల్చివేతకు ముందు తమకు ఎలాంటి నోటీసు కూడా జారీ చేయలేదని తెలిపారు. చట్టాన్ని గౌరవించే పౌరుడిగా, ఒకవేళ కోర్టు తనకు వ్యతిరేకంగా తీర్పునిస్తే తానే స్వయంగా నిర్మాణాలను కూల్చివేసేవాడినని తెలిపారు. కానీ ఓ వైపు కోర్టులో కేసు నడుస్తుండగా, మరోవైపు స్టే ఉండగా అధికారులు చేసిన ఈ చట్ట విరుద్ధ చర్యలకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.

## హైడ్రా పరిధి విస్తరణ!

**111 జీవో పరిధి గ్రామాల వరకు వర్తింపు**
**నేడో, రేపో ఆర్డినెన్స్**
**అందుకోసమే అసెంబ్లీ ప్రోరోగ్!**

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) పరిధిని ప్రభుత్వం విస్తరించనున్నదా? అంటే తాజా పరిణామాలు అవుననే అంటున్నాయి. హైడ్రా పరిధిని 111 జీవో పరిధి గ్రామాల వరకు వర్తింపజేయనున్నట్టు తెలుస్తున్నది. దీనికోసం నేడో, రేపో ఆర్డినెన్స్ కూడా జారీ చేసే అవకాశాలున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆర్డినెన్స్ జారీ చేసేందుకే అసెంబ్లీని ప్రోరోగ్ చేసినట్టు తెలుస్తున్నది. దీంతో 111 జీవో పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి ఉమ్మడి రాష్ట్రంలో హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలాశయాల పరివాహక ప్రాంతాల్లోని 84 గ్రామాల్లో నిర్మాణాలపై ఆంక్షలు విధిస్తూ 111 జీవోను తీసుకొచ్చారు. జీవో వల్ల ఆ పల్లెలన్నీ బఫర్ జోన్‌లోకి వెళ్లాయి. అయితే, గత బీఆర్‌ఎస్ సర్కారు ఆ జీవోను రద్దుచేసి అక్కడి ప్రజలకు స్వాంతన చేకూర్చింది. ఫలితంగా ఆ ప్రాంతాల్లో భూముల రేట్లు కూడా పెరిగాయి, క్రయవిక్రయాలు జోరందుకొని నిర్మాణాలు వెలిశాయి. అయితే, ఇప్పుడు ఈ 84 గ్రామాలకు హైడ్రా పరిధిని వర్తింపజేస్తే ప్రస్తుతం ఏర్పాటైన నిర్మాణాల సంగతి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతున్నది.

## చట్టప్రకారమే కూల్చివేతలు: భట్టి

హైదరాబాద్, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగర పరిధిలో చట్టప్రకారమే హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఢిల్లీలో ఉన్న ఆయన తాజాగా ఎన్ కన్వెన్షన్ కట్టడాల కూల్చివేతపై స్పందించారు. బఫర్ జోన్‌లో మాత్రమే కాదని, ఏకంగా చెరువుల్లోనే నిర్మాణాలు చేపట్టారని, వాటిని కూల్చేస్తున్నామని తెలిపారు. హైడ్రా చేసే ప్రతి పనికీ నోటీసులు ఇచ్చిన తర్వాతే చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. హైడ్రా ఏర్పాటును ప్రజలందరూ ఆహ్వానిస్తున్నారని చెప్పారు.

# తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం!

- అక్రమం అంటూ రాత్రికి రాత్రే కూల్చివేతలు
- వాదన వినిపించే సమయమివ్వని అధికారులు
- కోర్టుకెళ్లే లోపే సమస్తం నేలమట్టం
- కూల్చివేతలు పూర్తయ్యేదాకా అధికారుల ఫోన్లు స్విచ్చాఫ్



హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): దొంగరాత్రి నిర్మాణాల మీదికి వస్తున్న బుల్డోజర్లు.. ఇంట్లో ఉన్నవారు బయటకు వచ్చి చూసే లోపే ప్రహరీగోడలను తొక్కుకుంటూ ఇండ్ల మీదికి వస్తున్న భారీ పొక్లెయినర్లు.. నగర శివార్లలో ఇప్పుడు ఇవే భీతావహ దృశ్యాలు ఆ ప్రాంత నివాసులలో భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండ ఉత్తరప్రదేశ్‌లో రాజ్యమేలుతున్న బుల్డోజర్ల సంస్కృతిని గుర్తుకు తెస్తున్నదని నగరవాసులు అంటున్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బాటలోనే తెలంగాణ ప్రభుత్వం కూడా నడుస్తున్నదని అభిప్రాయపడుతున్నారు. గడిచిన నెల రోజులుగా అక్రమ నిర్మాణాల కూల్చివేత పేరుతో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఏకపక్షంగా ఉంటున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. అక్రమార్కుల భరతం పట్టే విషయం ఎలా ఉన్నా.. ఆ పేరుతో అరాచక పాలనకు తెరతీస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం నోటీసు ఇవ్వకపోవడం.. బాధితుల వాదన వినకపోవడం.. న్యాయం కోసం కోర్టును సంప్రదించే సమయం కూడా ఇవ్వకపోవడం.. కనీసం ఇంట్లో సామాన్లన్నా బయటకు తెచ్చుకొనే సమయం ఇవ్వకుండా అధికారులు అరాచకంగా వ్యవహరిస్తున్న వైనంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. హైడ్రా అధికారులు రాత్రికి రాత్రి వచ్చి లోపల ఉన్నవారిని అందరినీ బయటకు వెళ్లగొట్టి కూల్చివేతలు ప్రారంభిస్తున్నారు. ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, విలువైన ఫర్నిచర్.. ఇలా వస్తువులన్నింటినీ ధ్వంసం చేస్తున్నారు. విద్యాసంస్థల నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకుంటున్నారు. విద్యాసంవత్సరం మధ్యలో ఉద్దేశపూర్వకంగా తరగతి గదులనూ కూల్చే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

### న్యాయస్థానాలకు వెళ్లకుండా..దొంగరాత్రే..

హైడ్రా పేరుతో నగరంలో గత నెల రోజులుగా సాగుతున్న కూల్చివేతలను గమనిస్తే.. అంతా ఓ పథకం ప్రకారం, అర్ధరాత్రి లేదా తెల్లవారుజామునే పనిని ప్రారంభిస్తున్నట్టు స్పష్టమవుతున్నది. లేదా సెలవు రోజు తెల్లవారు జామున కూల్చివేతలను చేపడుతున్నారు. ఉదయం పది గంటలలోపే తమ టార్గెట్‌ను నేలమట్టం చేసేస్తున్నారు. బాధితులకు న్యాయపరమైన ఊరట లభించకుండా ఉండేందుకే వ్యూహాత్మకంగా తమ కూల్చివేతలను చేపడుతున్నట్టు తెలుస్తున్నది. ఒకవేళ నోటీసులు ఇచ్చి, పనిదినాల్లో, పనివేళల్లో నిర్మాణాలను కూల్చేందుకు వెళ్తే యజమానులు అలర్ట్‌గా ఉంటారని, వారు అప్పటికప్పుడు తమ బాధను న్యాయస్థానానికి చెప్పుకునే అవకాశం లభిస్తుందని, ఉన్నతాధికారులతో లేదా ఇతరులతో ఫోన్లు చేయించి తమ పనిని అడ్డుకుంటారని, ఆ అవకాశం ఇవ్వకుండా ఉండేందుకే అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున, సెలవు దినాల్లో కూల్చివేతలు చేపడుతున్నట్టు చెప్పుకుంటున్నారు. బాధితులు కోర్టులకు వెళ్లి తమ గోడును వెళ్లబోసుకునే లోపే వారి ఆస్తులను నేలమట్టం చేస్తున్నారు. బాధితులు తాము నిరపరాధులమని, తమ వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని చెప్పుకునేలోపే అంతా ముగించేస్తున్నారు.

### ఫోన్లు స్విచ్చాఫ్

హైడ్రా చేస్తున్న నిర్మాణాల కూల్చివేతలో మరో ప్రధానమైన అంశం అధికారులు ఫోన్లు స్విచ్చాఫ్ చేసుకోవడం. ఏ నంబరులో అందుబాటులో ఉన్నారో ఎవ్వరికీ చెప్పకపోవడం.. కమిషనర్ మొదలు అధికారులందరూ ఫోన్లు బంద్ చేసుకుంటున్నారు. కూల్చాల్సిన నిర్మాణాల వివరాలను ఇచ్చి కింది స్థాయి సిబ్బందిని మాత్రమే పంపిస్తున్నారు. ఒకవేళ అధికారుల ఫోన్లు అందుబాటులో ఉన్నా.. ఎవరి ఫోన్లు ఎత్తడంలేదన్న ఆరోపణలున్నాయి.

### బుల్డోజర్ రాజకీయమేనా?

ఉత్తర్‌ప్రదేశ్ తరహాలో తెలంగాణలో కూడా ప్రత్యర్థులను భయపెట్టేందుకు బుల్డోజర్లతో రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కేవలం ప్రత్యర్థిపార్టీని, ఆ పార్టీకి అనుకూలంగా ఉండే వర్గాలను టార్గెట్ చేసేందుకే ఈ తరహా కూల్చివేతలు జరుగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హైడ్రా అన్నది ఉత్త హైడ్రామా అని, అసలు ఉద్దేశం వేరే ఉన్నదన్న అభిప్రాయాలు వస్తున్నాయి.

## 'బుల్డోజర్ న్యాయం' అనాగరికం



- ఆమోదయోగ్యం కాదు.. వెంటనే ఆపాలి
- చట్టం చేసే వారికి, ఉల్లంఘించే వారికి తేడా ఉండాలి
- ప్రభుత్వాలే నేరస్థుల్లా ప్రవర్తించొద్దు
- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక

న్యూఢిల్లీ, ఆగస్టు 24: 'బుల్డోజర్ న్యాయం' ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, దీనిని వెంటనే ఆపేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్‌లో ఛతార్‌పూర్ జిల్లాలో ఓ నిరసన సందర్భంగా చెలరేగిన హింసలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి నివాసాన్ని ప్రభుత్వం కూల్చేసింది. ఈ ఘటనపై శనివారం 'ఎక్స్'లో ప్రియాంక స్పందించారు. 'ఏదైనా నేరంలో ఎవరైనా నిందితుడిగా ఉంటే, అతడి నేరాన్ని, శిక్షను కోర్టు మాత్రమే నిర్ణయిస్తుంది. ఆరోపణ రాగానే నిందితుడి కుటుంబాన్ని శిక్షించడం, వారికి నిలువ నీడ లేకుండా చేయడం, చట్టాన్ని ఉల్లంఘించడం, ఇంటిని కూలగొట్టడం న్యాయం కాదు. ఇది తీవ్ర అనాగరికం, అన్యాయం' అని ఆమె పేర్కొన్నారు.

### బుల్డోజర్ న్యాయాన్ని ఆపాలి

చట్టాలు చేసే వారికి, చట్టాలు ఉల్లంఘించే వారికి తేడా ఉండాలని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. ప్రభుత్వాలే నేరస్థుల్లా ప్రవర్తించొద్దని అన్నారు. నాగరిక సమాజంలో చట్టం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, మానవత్వాన్ని పాటించడం తప్పనిసరి అని ఆమె పేర్కొన్నారు. రాజధర్మాన్ని నెరవేర్చలేని వారు, సమాజం లేదా దేశ సంక్షేమం కోసం పని చేయలేరని అన్నారు. 'బుల్డోజర్ న్యాయం' ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, దీనిని ఆపాలని ఆమె డిమాండ్ చేశారు.

## భవన నిర్మాణాలకూ నిబంధనలు

**నీటి వనరుల సమీప భవనాలకూ వర్తింపు • 2011కు ముందు 13 ఏండ్లలో 19 జీవోలు**
**వాటిని కలగలిపి 2012లో కాంగ్రెస్ సర్కారు కొత్త జీవో**

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): జంట జలాశయాల సమీపంలో నిర్మాణాలకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నిషేధిత, ఆంక్షల జోన్ల వంటి నిబంధనలు ఉన్నట్టే.. ఇతర నీటి వనరుల సమీపాల్లో నిర్మించే భవన నిర్మాణాల అనుమతుల కోసం కూడా ప్రత్యేక నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఈ మేరకు 7.4.2012న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 168ని జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ఆధారంగానే అనుమతులు ఇస్తున్నారు. 1998 నుంచి 2011 వరకు భవన నిర్మాణ అనుమతుల నిబంధనల కోసం ఇచ్చిన 19 జీవోలను కలిపి జీవో 168ని తెచ్చారు.

### జోన్ల పరిధిలో నిర్మాణాలకు నిబంధనలు

- 10 మీటర్ల విస్తీర్ణం వరకు ఉన్న కాల్వలు, వాగులు, నాలాలకు చుట్టూ రెండు మీటర్ల నిర్మాణాలకు ఆంక్షలు వర్తింపు.
- 10 మీటర్ల విస్తీర్ణం కంటే ఎక్కువ విస్తీర్ణంలోని కాల్వలు, వాగులు, నాలాలకు చుట్టూ 9 మీటర్ల వరకు ఆంక్షలు.
- 10 హెక్టార్ల కంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్న చెరువులు, ట్యాంకులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ నుంచి తొమ్మిది మీటర్ల వరకు నిర్మాణాలకు ఆంక్షలు వర్తింపు.
- 10 హెక్టార్లు అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న చెరువులు, ట్యాంకులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ నుంచి 30 మీటర్ల వరకు నిర్మాణాలకు ఆంక్షలు వర్తింపు.
- పంచాయతీల పరిధిలో ఉండే నదులకు నిర్ధారించిన హద్దుల నుంచి 100 మీటర్ల వరకు నిర్మాణాలకు ఆంక్షలు వర్తింపు.
- కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో ఉండే నదులకు నిర్ధారించిన హద్దుల నుంచి 50 మీటర్ల వరకు నిర్మాణ అనుమతులపై ఆంక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జంట జలాశయాలు అనేవి నదిపై నిర్మించినవి. దీని ప్రకారం 2013కు ముందు నిర్మాణాలకు 100 మీటర్లు, ఆ తర్వాత (జంట జలాశయాల పరిధిలో మున్సిపాలిటీలు ఏర్పడిన సమయం) 50 మీటర్ల నిబంధనలు వర్తిస్తాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## సినీ పెద్దలు కలవలేదనే కక్ష !

**ఎన్ కన్వెన్షన్‌పై మంత్రి ఫిర్యాదు**
**3 రోజుల్లోనే హైడ్రా నేలమట్టం**
**కోమటిరెడ్డికి దూరంగా సినీ పెద్దలు**
**లెక్క తేలుస్తానని ఆనాడే వార్నింగ్**

హైదరాబాద్, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ)/హైదరాబాద్ సిటీబ్యూరో/మొయినాబాద్: సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సినీ పెద్దలు కోపం తెప్పించారా? మంత్రికి, సినీ పెద్దలకు మధ్య దూరం పెరిగిందా? అందరి లెక్కలు తేలుస్తానన్న మంత్రి అన్నంత పనీ చేశారా ? అంటే ప్రస్తుత పరిణామాలు నిజమే కాబోలు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సినిమాటోగ్రఫీ మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తరువాత తెలుగు సినీ రంగానికి చెందిన పెద్దలు ఆయన్ను కలవలేదు, అభినందించలేదు. దీంతో మంత్రి కోమటిరెడ్డి అసహనానికి గురైనట్టు ప్రచారం జరిగింది. తనను దిల్‌రాజు మినహా ఇంకెవరూ అభినందించలేదని అప్పుడే తన ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. తాజాగా వారం క్రితం కూడా కూల్చివేతలపై హింట్ ఇచ్చారు. ఆక్రమణలను కూల్చివేస్తామని, ఇందులో ఎంత పెద్దవారున్నా, సినీ ప్రముఖులున్నా వదిలిపెట్టబోమని ప్రెస్‌మీట్‌లో ప్రకటించారు. చెప్పినట్టుగానే సినీ నటుడు నాగార్జునకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్‌పై ఈనెల 21న సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 24న హైడ్రా ఎన్ కన్వెన్షన్‌ను నేలమట్టం చేసింది. అంటే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫిర్యాదు చేసిన రోజుల వ్యవధిలోనే హైడ్రా శరవేగంగా తన పని పూర్తి చేయడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాడు సినీ పెద్దలు మంత్రిని కలవకపోడమే నేడు కూల్చివేతలకు దారి తీసిందనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

### జీవో 111లో ఒక్కటీ కూల్చనియ్యం

జీవో 111 పరిధిలో ఏ ఒక్క నిర్మాణాన్నీ కూల్చనీయమని, ఒక్క నిర్మాణం కూల్చివేసినా పూర్తి బాధ్యత తనదేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హిమాయత్‌నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఒక రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామన భీమ్‌భరత్‌తో కలిసి వచ్చారు. జీవో 111 పరిధిలో నిర్మాణాలను కూల్చివేస్తున్నారని స్థానిక నేతలు చెప్పడంతో మంత్రి స్పందించారు. ఆ నిర్మాణాల జోలికి వెళ్లొద్దని అధికారులను ఆదేశించాలని సీఎంను కోరినట్టు చెప్పారు.



హైడ్రా కూల్చేసిన హిమాయత్‌నగర్ పరిధిలో ఉన్న కావేరీ సీడ్స్ కంపెనీ భవనం

## హైడ్రా చూపు ఒక వైపేనా?

**కూల్చివేతల్లో కనిపించని పారదర్శక విధానం**

- పరిధి దాటి కావేరీ సీడ్స్ భవనం కూల్చివేత
- ఎన్ కన్వెన్షన్‌పై మంత్రి ఫిర్యాదు..మూడ్రోజుల్లోనే నేలమట్టం
- అనురాగ్ యూనివర్సిటీ భవనాలపై నీటిపారుదల శాఖ ఫిర్యాదు
- కాంగ్రెస్ నేతల అక్రమ నిర్మాణాలపై పడని హైడ్రా పంజా

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధానప్రతినిధి, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): హైడ్రా.. ఇప్పుడు రాష్ట్రంలో ప్రధాన చర్చనీయాంశం. ఆరంభంలో ఆదర్శంగా అనిపించిన ఈ ఏజెన్సీ అడుగులు క్రమేణా వివాదాస్పదంగా మారుతున్నాయి. కూల్చివేతలను ఎవరూ తప్పు పట్టడంలేదు. కానీ ఎంపికలోనే అసలు మర్మం దాగి ఉందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ముఖ్యంగా రాజకీయ కక్షసాధింపులకు హైడ్రా పావుగా మారుతుందనే విమర్శలకు నానాటికీ బలం చేకూరుతుంది.

### హైడ్రా పరిధి ఎక్కడి వరకు ?

హైడ్రా కూల్చివేతల పర్వంలో భాగంగా గండిపేట ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలని వేసిన అడుగులు అనుమానాల నిప్పును రాజేశాయి. వాస్తవానికి గత నెల 19న ప్రభుత్వం హైడ్రాకు సంబంధించిన ఉత్తర్వుల్లో స్పష్టంగా ఔటర్‌ను పరిధిగా నిర్ధారించి, గ్రామాల పేర్లు సహా పొందుపరిచింది. కానీ హైడ్రా యంత్రాంగం ఔటర్ రింగు రోడ్డు దాటి.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ గ్రామ పరిధిలో ఉన్న కావేరీ సీడ్స్ కంపెనీ భవనాన్ని కూల్చివేసింది. అదేమంటే.. గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నందున కూల్చివేసినట్టు స్పష్టం చేసింది. పరిధిదాటి ఎందుకు పోయారనే దానిపై నేటికీ స్పష్టత కరువు. తాజాగా శనివారం సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను నేలమట్టం చేశారు. దీనిపై ఈ నెల 21న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మించినందున కూల్చివేసినట్టు ఆధారాలతో హైడ్రా ప్రకటన చేసింది. కానీ ఎన్ కన్వెన్షన్‌పై నీటిపారుదల శాఖ చెరువులో కబ్జా అయినట్టుగా ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపురం పరిధిలోని నాదం చెరువు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు ఉన్నాయని అనురాగ్ యూనివర్సిటీ భవన సముదాయంపై నీటిపారుదల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడ తమ్మిడికుంట వ్యవహారంలో రాష్ట్ర మంత్రి ఫిర్యాదు చేస్తే, ఇక్కడ నాదం చెరువుకు సంబంధించి నీటిపారుదల శాఖ ఫిర్యాదు చేసింది. ఇందులో ఒకరు సినీ ప్రముఖుడు కాగా... మరొకరు ప్రతిపక్ష బీఆర్‌ఎస్ శాసనసభ్యుడు. దీంతో హైడ్రా అడుగులు ఎటువైపు పడుతున్నాయనేది సుస్పష్టం. ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ నేత అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తే హైడ్రా ప్రతిష్ఠ పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

## అక్రమ నిర్మాణాలు తెలిస్తే కూల్చేస్తాం

**జలమండలి అధికారుల వివరణ • అసలు గుర్తించనే లేదని అనుమానాలు**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): జంట జలాశయాల పరిధిలో అక్రమ నిర్మాణాలు ఉన్నట్టు తెలిస్తే కూల్చి వేస్తామని జలమండలి తెలిపింది. జంట జలాశయాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో రాజకీయ ప్రముఖుల సౌధాలపై 'నమస్తే తెలంగాణ' శనివారం కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. క్రమణలు ఉన్నట్టు తెలిస్తే కూల్చివేస్తామని జలమండలి అధికారులు ప్రకటించడం గమనార్హం. ఈ నేపథ్యంలో అసలు జంట జలాశయాల పరిధుల్లో అసలు అక్రమ నిర్మాణాలు ఉన్నాయా? లేవా? అనే వివరాలపై మాత్రం అధికారులు స్పష్టత ఇవ్వలేదు. గతంలో అనేకచోట్ల ఆక్రమణలు ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. వాటిని ఇప్పుడు వెల్లడించలేదు. ఒకవేళ ఆక్రమణలు లేవని నిర్ధారిస్తే.. ఎలాంటి ఆక్రమణలను ఇప్పటివరకు తాము గుర్తించలేదనే ప్రకటన కూడా చేయలేదు. గండిపేట రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్‌ను 17 90గా నిర్ధారిస్తూ సర్వే నిర్వహించినట్టు పేర్కొన్నారు. కానీ 70వ దశకంలో 1792 వరకు నీటిని నిల్వచేసిన జలాశయంలో 1790ని ఎఫ్‌టీఎల్‌గా నిర్ధారించేందుకు కారణాన్ని మాత్రం వెల్లడించలేదు.

# ‘బెట్టింగ్’ ఇన్‌ఫ్లూయెన్సర్లు!

- డబ్బుల కోసం నిషేధిత యాప్‌లకు ప్రమోషన్
- భారీగా ముట్టజెబుతున్న యాప్‌ల నిర్వాహకులు
- క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, గివ్ అవేలతో టీనేజర్లపై వల
- ఈజీ మనీ కోసం గుడ్డిగా ఫాలో అవుతున్న వైనం

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): సోషల్ మీడియాలో కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు అడ్డదారులు తొక్కుతున్నారు. సైబర్ మోసగాళ్లు ఇచ్చే డబ్బులకు కక్కుర్తిపడి యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, టెలిగ్రామ్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా బెట్టింగ్ యాప్‌లు, లోన్ యాప్‌లను అడ్డగోలుగా ప్రమోట్ చేస్తూ తమను గుడ్డిగా ఫాలో అవుతున్నవారిని ఇరకాటంలో పెడుతున్నారు. మొదట ఏవేవో ఆసక్తికరమైన వీడియోలు చేస్తూ, సూక్తులు చెబుతూ టీనేజర్లను ఆకట్టుకుంటున్నారు. అలా ఫాలోవర్లు, సబ్‌స్క్రైబర్లు పెరగ్గానే నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ద్వారా తెలివిగా బెట్టింగ్‌లు పెట్టిస్తున్నారు.



### విలువైన బహుమతులు ఆశ చూపి..

‘మీకు ఐఫోన్-15 కావాలా? ఖరీదైన వాచ్‌లు కావాలా? అయితే వెంటనే నా చానెల్‌ను సబ్‌స్క్రైబ్ చేసి, కింద ఉన్న టెలిగ్రామ్ లింక్‌ను ఓపెన్ చేయండి. అందులో నా చానల్‌లో జాయిన్ అవ్వండి. నేను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పండి. లేదంటే చిన్న చిన్న గేమ్స్ ఆడి ఐఫోన్లను సొంతం చేసుకోండి. గేమ్‌లో గెలిచి ప్రతిరోజూ డబ్బులు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు పొందండి. జాగ్రత్తగా ఆడండి’ అంటూ ఓ ఇన్‌ఫ్లూయెన్సర్ తన యూట్యూబ్ అకౌంట్‌లో ఉన్న దాదాపు 4.22 మిలియన్ మంది సబ్‌స్క్రైబర్లకు రోజూ ఆశపెడుతున్నాడు. అతను ఇచ్చిన లింక్‌ను ఓపెన్‌చేస్తే నేరుగా అతని టెలిగ్రామ్ చానల్ ఓపెన్ అవుతుంది. అందులో వీడియో కింద ఇచ్చిన ఏపీకే ఫైల్ లింక్‌ను ఓపెన్ చేయగానే ‘1విన్’ అనే బెట్టింగ్ యాప్ ఓపెన్ అవుతుంది. అందులో కనీసం రూ.300 బెట్టింగ్ పెట్టమంటాడు. అలా పెడితే.. మొదటిసారి కనీసం రూ.600 వస్తాయి. ఆ డబ్బులతో మళ్లీ బెట్టింగ్ పెడితే.. విన్నింగ్ అమౌంట్ పెరుగుతుంది. ఆ యాప్‌ల నిర్వాహకులు మనతో రూ.50 వేల వరకు బెట్టింగ్ పెట్టించి మొత్తాన్ని ఒకేసారి ఖతం చేస్తారు.

### డబ్బుల కోసం లోన్‌యాప్‌ల ఉచ్చులోకి

ఇన్‌ఫ్లూయెన్సర్లు చెప్పే బెట్టింగ్ యాప్‌లలో ఎంతో మంది యువకులు డబ్బులు కోల్పోతున్నారు. తక్షణ డబ్బుల కోసం అనధికారిక లోన్ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. ఎలాంటి డాక్యుమెంట్లు ఇవ్వకపోయినా రూ.10 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణం ఇస్తుండటంతో ఆ యాప్‌ల నుంచి లోన్లు తీ సుకుంటున్నారు. అవి చెల్లించలేక, ఇంట్లో చెప్పుకోలేక, స్నేహితుల నుంచి తీసుకున్న అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికిలోనై బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్ గుడిమల్కాపూర్‌కు చెందిన 20 ఏండ్ల ఇంజినీరింగ్ విద్యార్థి ‘1విన్’ బెట్టింగ్ యాప్‌లో డబ్బులు కోల్పోవడంతో బయట చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు. తర్వాత ఆ అప్పులన్నీ అతని తల్లిదండ్రులు తీర్చాల్సి వచ్చింది.

### మరికొన్ని దారుణాలు

హైదరాబాద్‌కు చెందిన కాలేజీ విద్యార్థి శ్రీనివాస్‌కు ఖరీదైన బైక్‌లు, ఫోన్లు, వాచీలు అంటే ఇష్టం. అతడు సోషల్ మీడియాలో అభిమానించే ఓ ఇన్‌ఫ్లూయెన్సర్ (స్టార్) ప్రమోట్ చేసిన బెట్టింగ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశాడు. రూ.100తో రీచార్జ్ చేసి, స్నేహితులకు రిఫర్ చేస్తే గివ్ అవే కింద యాపిల్ ఫోన్ ఇస్తానని ఆ స్టార్ చెప్పడంతో.. శ్రీనివాస్ ఫాలో అయ్యాడు. బెట్టింగ్ చేస్తూ క్రమంగా ఈజీమనీకి అలవాటు పడ్డాడు. మొదట్లో డబ్బులు వచ్చినా, ఆ తర్వాత పోవడం మొదలైంది. దీంతో నిరక్షరాస్యులైన తన తల్లిదండ్రులను మోసగించి వారి అకౌంట్‌లోని డబ్బును సైతం బెట్టింగ్‌లో పెట్టి రూ.లక్షలు కోల్పోయాడు. రంగారెడ్డి జిల్లాకు చెందిన సోమేశ్ వీడియోను చూసి రెండు వారాల తర్వాత జీతం కూడా మిగలకుండా బెట్టింగ్‌లో కోల్పోయాడు.

## ఇన్‌ఫ్లూయెన్సర్లపై చర్యలు ఏవీ?

యువత జీవితాలను నాశనం చేస్తున్న యాప్‌లను ఇష్టారీతిన ప్రమోట్ చేస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్లపై పోలీసులు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం బెట్టింగ్ చాలా ప్రమాదకరంగా మారిందని, ఎంతోమంది యువకులు వీటికి బానిసలవుతున్నారని పోలీసులు చెప్తున్నా చర్యలు మాత్రం శూన్యం. ఎలాంటి రక్షణ లేని ఏపీకే ఫైల్స్, యాప్స్ డౌన్‌లోడ్ చేయడం వల్ల డాటాతోపాటు డబ్బులు కోల్పోతున్నారు. అనధికారిక యాప్‌లను ప్రమోట్ చేయడంలో సోషల్ ఇన్‌ఫ్లూయెన్సర్లు బాధ్యతతో వ్యవహరించకపోవడంతో ఎంతో మంది యువత, వారి తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పబ్లిక్ ప్లేసుల్లో రీల్స్ చేసేవారిని కట్టడి చేస్తున్నట్టే.. సోషల్ మీడియాలో ప్రమాదకర బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసేవారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు హెచ్చరికలు జారీచేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## లోన్‌యాప్ వేధింపులకు యువకుడి బలి




శ్రీకాంత్ (ఫైల్)

శ్రీరాంపూర్, ఆగస్టు 24: లోన్‌యాప్ వేధింపులు ఓ యువకుడిని బలితీసుకున్నాయి. ఉరేసుకునే ముందు అతడు తీసిన సెల్ఫీ వీడియో కంటతడిపెట్టించింది. ఈ ఘటన మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా అరునక్కనగర్‌లో చోటుచేసుకుంది. అరునక్కనగర్‌లో నివసించే నమ్మాబాజి శ్రీకాంత్(29) తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టేవాడు. ప్రైవేట్ లోన్ యాప్‌లో రూ. 5లక్షలు, ఫ్రెండ్స్, ఫైనాన్స్‌ల వద్ద రూ.10 లక్షల దాకా అప్పులు చేశాడు. ట్రేడ్ మార్కెట్‌లో డబ్బులు పెట్టి నష్టపోయాడు. లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు కూడా ఎక్కువయ్యాయి. అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపం చెందినట్టు సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. ఆపై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

# రాష్ర్టానికి డెంగ్యూ ఫీవర్

## 8 నెలల్లోనే 5,246 కేసులు నమోదు

- గత ఏడాదితో పోల్చితే 36% పెరుగుదల
- విజృంభిస్తున్న చికున్‌గున్యా, మలేరియా
- ప్రభుత్వ వైఫల్యంతో ప్రజలకు ప్రాణసంకటం
- లెక్కలు తగ్గించి చెప్తున్న వైద్యారోగ్యశాఖ




డెంగ్యూ కేసులు (ఆగస్టు 21 నాటికి – డీపీహెచ్ లెక్కల ప్రకారం)

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం డెంగ్యూ కోరల్లో చిక్కుకున్నది. ప్రభుత్వ వైఫల్యం ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఆగస్టు 22 నాటికి ఏకంగా 5,246 కేసులు నమోదయ్యాయి. ఇందులో 40 శాతం కేసులు ఒక్క హైదరాబాద్‌లోనే వెలుగు చూశాయి. మొత్తం 2,148 మందికి పాజిటివ్‌గా తేలింది. ఇవి ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ పోర్టల్ (ఐఐహెచ్‌పీ)లో నమోదుచేసిన అధికారిక లెక్కలు మాత్రమే. ఇంకా అనధికారికంగా కేసులు రెట్టింపు ఉంటాయని అంచనా. ప్రస్తుతం ప్రతి వంద మంది అనుమానితుల్లో 7-8 మందికి డెంగ్యూ పాజిటివ్‌గా తేలుతున్నది. ఇప్పటివరకు 8 మంది డెంగ్యూతో మరణించినట్టు వైద్యారోగ్యశాఖ చెప్తున్నది. కానీ మరణాలు పదుల సంఖ్యలో ఉంటాయని వైద్యనిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇటీవల ఒకే రోజులో ఐదుగురు మరణించడాన్ని ఉదహరించారు. దీంతోపాటు రాష్ట్రంలో మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు సైతం విజృంభిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణ, దోమల నియంత్రణ చర్యలు, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించటం, వైద్యశాఖ సన్నద్ధత.. ఇలా అన్ని విభాగాల్లోనూ ప్రభుత్వం విఫలమైంది. ఫలితంగా గత ఏడాదితో పోల్చితే ఈసారి ఏకంగా 36 శాతం కేసులు అధికంగా నమోదయ్యాయి. గత ఏడాది జనవరి 1 నుంచి ఆగస్టు 22 వరకు రాష్ట్రంలో 3,861 కేసులు వెలుగు చూశాయి. ఈ ఏడాది అదనంగా 1,385 కేసులు పెరిగాయి.

### విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

డెంగ్యూతోపాటు రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన జ్వర సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మంది జ్వరాలతో బాధపడుతున్నట్టు తేలింది. డెంగ్యూ కేసులు అధికంగా నమోదవుతున్న జిల్లాల్లో హైదరాబాద్ (2,148 మంది) టాప్‌లో ఉన్నది. అధికారిక లెక్కల ప్రకారమే ఈ ఏడాది 106 చికున్‌గున్యా కేసులు వెలుగు చూశాయి. పాజిటివిటీ రేటు 5 శాతంగా ఉన్నది. 188 మందికి మలేరియా సోకింది. సీజనల్ వ్యాధులపై శనివారం కోఠిలో డీపీహెచ్ రవీందర్ నాయక్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఇందులో ఈ ఏడాది ఆగస్టు 21 వరకు 6,648 కేసులు వెలుగు చూసినట్టు తెలిపారు. అయితే ఐఐహెచ్‌పీ గణాంకాలతో పోల్చితే కేసుల సంఖ్య తక్కువగా ప్రకటించారని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే విషయంపై జర్నలిస్టులు ప్రశ్నించగా.. వివరాలను మరోసారి సరిచూసుకుంటానని డీహెచ్ సమాధానం ఇచ్చారు. ఐఐహెచ్‌పీతో పోల్చితే దాదాపు 600 కేసులను తక్కువగా పేర్కొన్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే కేసుల సంఖ్య 40 శాతం తక్కువ చేసి చూపించారని చెప్తున్నారు.

### సన్నద్ధతలో విఫలం

సీజనల్ వ్యాధులను కట్టడి చేయడంలో ప్రభుత్వం విఫలం కావడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వైద్య నిపుణులు చెప్తున్నారు. దోమల నియంత్రణకు ఇతర శాఖలను సమన్వయం చేయటంలో వైద్యశాఖ వైఫల్యం చెందిందని విమర్శిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో దోమలు పెరిగాయని చెప్తున్నారు. వానకాలం మొదలయ్యే సమాయానికి గతంలో పల్లెప్రగతి, పట్టణప్రగతి వంటి కార్యక్రమాలు నిర్వహించి, పారిశుద్ధ్య చర్యలు చేపట్టేవారని, దోమలు పెరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో రసాయనాలు పిచికారీ చేసేవారని, నిల్వ ఉంచిన నీటిని తొలగించేవారని గుర్తు చేస్తున్నారు. కానీ ఈ ఏడాది ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పక్కన పెట్టడంతో పారిశుద్ధ్యం లోపించిందని అంటున్నారు. దీనికితోడు వైద్యారోగ్యశాఖ ముందస్తు చర్యలు తీసుకోలేదని, సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయలేదని, నివారణ చర్యల పట్ల ప్రచారం చేయలేదని మండిపడుతున్నారు. మరోవైపు రాష్ట్రంలో మందుల కొరత నెలకొన్నదని, సాధారణంగా సీజనల్ వ్యాధులకు ముందే పీహెచ్‌సీ నుంచి అన్ని స్థాయుల దవాఖానల్లో బఫర్ స్టాక్‌ను ఉంచుకోవాలని, కానీ ఈసారి అనేక దవాఖానల్లో సెలైన్ బాటిళ్లు, యాంటిబయాటిక్స్ కూడా లేని దుస్థితి నెలకొన్నదని చెప్తున్నారు. ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పేర్కొంటున్నారు.

## డెంగ్యూతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

### మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలో విషాదం



ప్రేమ్‌కుమార్ (ఫైల్)

తొర్రూరు, ఆగస్టు 24: డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలో చోటుచేసుకుంది. తొర్రూరు పట్టణం బీరప్పనగర్‌కు చెందిన రమేశ్, లక్ష్మీకాంత కుమారుడు బేతమల్ల ప్రేమ్‌కుమార్ (23) వరంగల్ జిల్లా బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లి జ్వరం బారినపడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఇంటికి పిలిపించారు. తొర్రూరులోని ఓ ప్రైవేట్ దవాఖానలో శుక్రవారం చికిత్స చేయించి అదే రోజు ఇంటికి తీసుకొచ్చారు. శనివారం ఉదయం జ్వరం తీవ్రం కావడం, వాంతులు, ఫిట్స్ రావడంతో పట్టణంలోని మరో ప్రైవేట్ దవాఖానకు తరలించారు. రక్తకణాలు పూర్తిగా తగ్గాయని, పెద్ద దవాఖానకు తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించడంతో ఖమ్మంలోని మరో ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేతికొచ్చిన కొడుకు డెంగ్యూతో చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## హైదరాబాద్‌లో రోజూ 2 కోట్ల సైబర్ మోసాలు

### గుజరాత్‌లో 36 మంది అరెస్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): సైబర్ మోసాల వల్ల హైదరాబాద్ ప్రజలు రోజుకు సగటున రూ.2 కోట్ల చొప్పున ఏటా రూ.800 కోట్ల వరకు నష్టపోతున్నారని, విద్యావంతులు సైతం అత్యాశకు పోయి ఈ మోసాల బారిన పడుతున్నారని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు ఇటీవల 7 బృందాలతో గుజరాత్‌లో స్పెషల్ ఆపరేషన్ నిర్వహించి వివిధ కేసుల్లో 36 మందిని అరెస్టు చేశారని, వీరికి దేశవ్యాప్తంగా 983 కేసులతో, తెలంగాణలో 131 కేసులతో సంబంధం ఉన్నదని వెల్లడించారు. ఈ ముఠాల చేతిలో బాధితులు రూ.12.49 కోట్ల వరకు మోసపోయారని తెలిపారు. నిందితుల నుంచి రూ.1.51 కోట్లు రికవరీ చేసి, బాధితులు ఇప్పించామని, మరో రూ.2.89 కోట్లు ఫ్రీజ్ చేశామని సీపీ వివరించారు.

## 2న కలెక్టరేట్ల ముట్టడి

### ‘బీసీ’ జాతీయ అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్, ఆగస్టు24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో సమగ్ర కుల గణన ప్రారంభించి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలనే ప్రధాన డిమాండ్‌తో సెప్టెంబర్ 2న కలెక్టరేట్ల ముట్టడికి బీసీ సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది. సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం ప్రకటన విడుదల చేశారు. శ్రీకృష్ణ జన్మాష్టమి నేపథ్యంలో 26న తలపెట్టిన కార్యక్రమాన్ని సెప్టెంబర్ 2కు వాయిదా వేసినట్టు పేర్కొన్నారు.


## మంత్రుల సమీక్షకు హాజరుకాలేదని..

### సంగారెడ్డి ఆర్డీవోపై బదిలీ వేటు

సంగారెడ్డి, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి ఆర్డీవో వసంతకుమారిపై బదిలీ వేటు పడింది. 21న మంత్రి రాజనర్సింహ సంగారెడ్డిలో పర్యటించారు. మంత్రి పర్యటనలో ప్రొటోకాల్ విధులు సక్రమంగా నిర్వహించలేదని, కలెక్టరేట్‌లో మంత్రి రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ నిర్వహించిన సమీక్షకు ఆర్డీవో వసంతకుమారి గైర్హాజరు కావడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. పదిరోజుల్లోగా వివరణ ఇవ్వాల్సిందిగా ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఆర్డీవోను ఆదేశించారు. ఆర్డీవోను ఏటూరు నాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్)గా బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జహీరాబాద్ ఆర్డీవో రాజుకు సంగారెడ్డి ఆర్డీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ విషయం జిల్లా రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ‘బెస్ట్ అవైలబుల్’కు నిధుల విడుదలేది?

### మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్న



హైదరాబాద్, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు నిధులు విడుదల చేయకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 150 బెస్ట్ అవైలబుల్ స్కూళ్లను (బీఏఎస్) ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో విద్య కోసం నిర్వహిస్తున్నారని ఆయన శనివారం ఎక్స్ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఈ స్కూళ్లలో మొత్తం 25 వేల మంది చదువుకుంటున్నారని, ఇందులో 18 వేల మంది ఎస్సీ క్యాటగిరీ, 7 వేల మంది ఎస్టీ క్యాటగిరీ విద్యార్థులు ఉన్నట్టు పేర్కొన్నారు. అణచివేతకు గురైన వర్గాలకు సంబంధించిన వారు, తమ కుటుంబాల్లో చదువుకుంటున్న తొలి తరం వారు, ఎక్కువ మంది జోగిని వ్యవస్థకు గురైన వారి పిల్లలు, కూలీల పిల్లలు ఉన్నారని తెలిపారు. పేద విద్యార్థులకు లబ్ధి చేకూర్చే ఇలాంటి పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు.



నిజామాబాద్‌లో కమ్యూనిటీ మీడియేటర్ల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్

## వివాదాలు ఉన్నచోటే పరిష్కారాలు

### హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్

వినాయక్‌నగర్, ఆగస్టు 24: పౌర సమాజంలో ఎక్కడ వివాదాలు ఉంటాయో, పరిష్కారాలు కూడా అక్కడే దొరుకుతాయని హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్ జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన కమ్యూనిటీ మీడియేటర్ల మూడురోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనుషుల మధ్య తలెత్తిన వివాదాలు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే వీలున్నదని తెలిపారు. వృద్ధులైన తల్లిదండ్రులను పోషించని వారి సంతానం మధ్యవర్తిత్వ భాషను అర్థం చేసుకోవాలని సూచించారు. భవనానికి పునాది ఎంత బలమైనదో మధ్యవర్తిత్వానికి కమ్యూనిటీ మీడియేటర్లు అంత బలమైన వారని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జే శ్రీనివాస్ రావు అన్నారు. మనుషుల మధ్య నెలకొన్న చిన్న, చిన్న విభేదాలు మొదటి దశలోనే తుంచి వేయాలని సూచించారు. కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ మాట్లాడుతూ లోక్ అదాలత్, మధ్యవర్తిత్వ వ్యవస్థలలో కమ్యూనిటీ మీడియేటర్లు ప్రధాన భూమిక పోషించాలని కోరారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి పంచాక్షరి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, ఇతర జడ్జీలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ బకాయిలపై అధికారుల సీరియస్

### మిల్లుల యజమానుల ఇంట్లో వస్తువులు స్వాధీనం

పెబ్బేరు/కొత్తకోట, ఆగస్టు 24 : సీఎంఆర్ ధాన్యం బకాయి పడిన రెండు మిల్లుల యజమానుల ఇంట్లోని వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలు వనపర్తి జిల్లా పెబ్బేరు, కొత్తకోట మండలాల్లో శనివారం చోటుచేసుకున్నాయి. రంగాపురంలోని శివసాయి ఇండస్ట్రీస్ రైస్ మిల్లు.. ప్రభుత్వానికి రూ. 3,57,22,693 సీఎంఆర్ ధాన్యానికి సంబంధించి బకాయి పడింది. జనుంపల్లిలోని మిల్లు యజమాని విజయ ఇంటికి వెళ్లి టీవీ, ఇన్వర్టర్, ఏసీ, స్కూటీలు, మిల్లులోని రిఫ్రిజిరేటర్‌ను, కొత్తకోట మండలం నాటవెల్లిలోని వెంకటేశ్వర ట్రేడర్స్ యజమాని వెంకటరమణ ఇంట్లోని కారు, ఏసీ, ఇన్వర్టర్లు, ఫ్రిజ్, టీవీలను తహసీల్దార్ కార్యాలయాలకు తరలించారు.

## చకచకా పంచాయతీ ఓటరు జాబితా

- కనీసం ఐదుగురు... గరిష్ఠంగా 21 మంది వార్డుసభ్యులు
- 6న ముసాయిదా జాబితా.. 21న తుది జాబితా

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీ ఎన్నికల కసరత్తులో భాగంగా వార్డుల వారీగా ఓటరు జాబితా తయారి ప్రక్రియ చురుగ్గా సాగుతున్నది. పంచాయతీల్లో జనాభా ఆధారంగా వార్డులు ఎన్ని ఉండాలనే ఉన్నతాధికారులు నిర్దేశించారు. 2011 జనాభాను పరిగణనలోకి తీసుకొని వార్డుల సంఖ్యను నిర్ధారించారు. గ్రామంలో ఉన్న ఓటర్ల సంఖ్య, అన్ని వార్డుల్లో సమానంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే వార్డుల వారీగా ముసాయిదా జాబితాను రూపొందించారు. కార్యదర్శులకు ఎదురయ్యే సమస్యలు, సందేహాలను ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు తీరుస్తున్నారు. వార్డులవారీగా జాబితా తయారు చేయటంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించిన ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకొంటున్నారు. జాబితాలో కొందరు ఒకే కుటుంబానికి చెందినవారు ఉన్నా.. వారి పేర్లు ఒకే దగ్గర లేకపోవటంతో వారందర్నీ గుర్తించడానికి ఎక్కువ సమయం పడుతున్నదని కార్యదర్శులు చెప్తున్నారు. ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం వచ్చే నెల 6న ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 21న తుది జాబితాను ప్రకటిస్తారు. అయితే, ఇదే సమయంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను కూడా క్లియర్ చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారు. పారిశుద్ధ్యం, సర్టిఫికెట్ల జారీ తదితర పనులు చేసుకోవాల్సి ఉంటుందని, వీటన్నింటినీ ఒకేసారి చేయాల్సి రావడంతో ఒత్తిడికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

## 124 మందికి ‘ప్రగతి చక్ర’

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): టీజీఎస్‌ఆర్టీసీలో ఉత్తమ సేవలు అందించిన 124మంది ఉద్యోగులకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రగతిచక్ర అవార్డులు అందజేశారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో శనివారం అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్థ ఎండీ వీసీ సజ్జనార్, ఉన్నతాధికారులతో కలిసి అవార్డుగ్రహీతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు, పతకాలు, బ్యాడ్జీలు, నగదు రివార్డులు ప్రదానం చేశారు. వరంగల్-2 డిపో డ్రైవర్ మెరుగు సంపత్ కుటుంబ సభ్యులకు రూ.1.15కోట్ల విలువైన ప్రమాద బీమా చెక్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కృష్ణకాంత్, వినోద్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ అడ్వయిజర్ విజయపుష్ప, ఉషాదేవి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల ఆగ్రహజ్వాల!

- వేతన పెంపు, క్రమబద్ధీకరణను పట్టించుకోని సర్కారు
- హామీల అమలుకు టీచర్లు, ఆయాల డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): ‘రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను క్రమబద్ధీకరిస్తాం’ ఇదీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన కోటిన్నొక్క హామీల్లో ఒకటి. మరిప్పుడు ఆ హామీ గురించి కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడమే లేదు. ఈ విషయమై పలుమార్లు ప్రభుత్వ పెద్దలను కలిసేందుకు వెళ్తే పట్టించుకునే నాథుడే లేదని అంగన్‌వాడీ అసోసియేషన్ ప్రతినిధులు వాపోతున్నారు. పోస్టులను క్రమబద్ధీకరించడంతోపాటు వేతన స్కేల్ పెంచాలన్న డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్లకు రూ.13,400 మాత్రమే వేతనం చెల్లిస్తుండగా, రూ.21 వేలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇదే దశలో వేతన పెంపు అంశంపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సానుకూలతను వ్యక్తం చేయడంతో దీనిపై గట్టిగా ప్రయత్నిస్తున్నట్టు అంగన్‌వాడీ టీచర్లు చెప్తున్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం మంత్రులు, అధికారులు చుట్టూ తిరుగుతున్నామని టీచర్లు, ఆయాలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అంగన్‌వాడీల సమస్యలను పట్టించుకోని రేవంత్‌రెడ్డి సర్కారుపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆగ్రహంతో ఉన్నారు.

# అసోసియేషన్లు చెబితే ప్రమోషన్ ఇచ్చాం

- ‘సీఎం శాఖలోనే పదోన్నతుల అర్రాస్ కథనం’ నేపథ్యంలో సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ వర్షిణి వివరణ



గురుకుల సొసైటీలోని టీచర్లను సొసైటీ ఏవిధంగా ట్రీట్ చేస్తున్నదో.. బదిలీలు, గ్రీవెన్స్‌ను ఏరీతిన నిర్వహించిందో అర్థం చేసుకునేందుకు ప్రత్యక్ష సాక్ష్యం ఈ ఫొటోనే. జీవో-317, డిస్‌లొకేటెడ్ అభ్యర్థులను ఈ నెల 21వ తేదీన పిలిపించి కార్యాలయ ఆవరణలో బైక్ పార్కింగ్ షెడ్డు కింద క్రమపద్ధతి లేకుండా గ్రీవెన్స్ నిర్వహిస్తున్న అధికారులు

హైదరాబాద్, ఆగస్టు24 (నమస్తే తెలంగాణ): పదోన్నతుల్లో నిబంధనలన్నీ పాతరేశామని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల సంస్థ బాహాటంగానే చెప్పుకున్నది. నిబంధనలు, జీవోలు పక్కనపెట్టి యూనియన్ నేతల మాటలకే విలువనిచ్చి డీఎల్ ప్రమోషన్లు కల్పించామని అంగీకరించింది. గురుకుల సొసైటీలో చేపట్టిన బదిలీలు, ప్రమోషన్ల తీరుపై ‘సీఎం శాఖలోనే పదోన్నతుల అర్రాస్’ పేరిట ‘నమస్తే తెలంగాణ’లో ప్రత్యేక కథనం ప్రచురించిన నేపథ్యంలో సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణి స్పందిస్తూ, శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కథనంలో ప్రచురితమైన పలు అంశాలపై వివరణ ఇచ్చారు. బదిలీలు, ప్రమోషన్లలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, నిబంధనలన్నీ పాటించి పూర్తి పాదర్శకతతో, అందరి సమక్షంలో, జీవో-80 సమయపాలనను అనుసరిస్తూ, సీనియార్టీ జాబితాల ఆధారంగా, ఉద్యోగుల అభ్యర్థనలన్నీ పరిగణనలోకి తీసుకుని, వారి సమ్మతితోనే నిర్వహించామని వెల్లడించారు. 317 జీవోకు సంబంధించి 570 మందికి కేటాయింపులు చేశామని, ఖాళీలను బట్టి 555 మంది కాంట్రాక్టు ఉద్యోగుల పునఃకేటాయింపులు, 256 మంది అదనపు ఉద్యోగులకు పునఃకేటాయింపులు, 17 క్యాడర్లలో 854 మందికి పదోన్నతులు, 1,928 మంది ఉద్యోగుల బదిలీలు, 1,452 మందికి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ల ప్రక్రియ పూర్తి చేశామని వివరించారు.

### పదోన్నతుల్లో అవకతవకల్లేవ్

ప్రొవిజనల్ జాబితాలను ప్రకటించి, ఉద్యోగుల అభ్యంతరాలను స్వీకరించి, తుది సీనియార్టీ జాబితాలను ప్రచురించి నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా సొసైటీ క్యాడర్లలో అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి, పోస్టింగ్‌లు ఇచ్చామని సెక్రటరీ వర్షిణి తెలిపారు. సొసైటీ వైస్‌చైర్మన్ ఆమోదం, సర్వీస్ అసోసియేషన్ల తీర్మానం మేరకే డీఎల్ లెక్చరర్లను 100% పదోన్నతుల ద్వారా భర్తీ చేశామని స్పష్టంచేశారు. గవర్నింగ్ బాడీ నిర్ణయం మేరకే అర్హులైన మహిళా అభ్యర్థులు లేకపోవడంతో పురుషులను మహిళా డిగ్రీ కాలేజీల్లో 30% కోటాలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్స్‌గా ప్రమోషన్లు కల్పించామని తెలిపారు. సొసైటీలో కొందరు డీఎల్ పురుష అభ్యర్థులు సంస్థలో ఎనిమిదేండ్లకు పైగా వివిధ హోదాల్లో పనిచేస్తున్నారని, వారి సర్వీస్‌ను, సర్వీస్ అసోసియేషన్ల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని తాజాగా డీఎల్ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పించామని, అం దులో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లే దని పేర్కొన్నారు. ఫిర్యాదుల స్వీకరణకు సైతం ఆన్‌లైన్ సౌకర్యం కల్పించామని, 789 ఫిర్యాదులు రాగా మెరిట్ ప్రకారం పరిష్కరిస్తున్నామని, జీవో-317కు సంబంధించి 560 ఫిర్యాదులను మంత్రివర్గ ఉపసంఘానికి పంపించామని తెలిపారు.

## అవసరానికో నిబంధన!

హైదరాబాద్, ఆగస్టు24 (నమస్తే తెలంగాణ): ‘సత్యం చెప్పే హరిశ్చంద్రులం అవసరానికో అబద్ధం’ అనే సినిమా పాట సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థకు అచ్చుగుద్దినట్టుగా సరిపోతుందని, అందుకు ఉన్నతాధికారుల ప్రస్తావిస్తున్న అంశాలే నిదర్శనమని గురుకుల వర్గాలే విమర్శిస్తున్నాయి. ఇదే విషయమై సోషల్ వెల్ఫేర్ సొసైటీతోపాటు అన్ని సొసైటీల్లోని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. సొసైటీ తీరును తూర్పారపడుతుండటంతోపాటు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నారు.

### అంశాల వారీగా సంధిస్తున్న ప్రశ్నలు

- సొసైటీ పాదర్శకత పాటిస్తే, మరెందుకు సీనియార్టీ జాబితాలు మూడేసి మార్చారు? డిస్‌లొకేటెడ్ పేరుతో జూలై 9 అర్ధరాత్రి లిస్ట్ పెట్టి 10న కౌన్సిలింగ్‌కు పిలిచారు. మూడు రోజులపాటు కౌన్సిలింగ్ నిర్వహించి చివరికి దానిని ఎందుకు రద్దుచేశారు? పీజీటీలకు జూలై 15న కౌన్సిలింగ్ అంటూ 14న అర్ధరాత్రి ఆన్‌లైన్‌లో పెట్టి ప్రమోషన్ లిస్ట్‌లను అదే రోజు మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా ఎందుకు అప్‌లోడ్ చేస్తూనే ఉన్నారు? జాబితాలన్నీ పారదర్శకంగా రూపొందించి వేకెన్సీలన్నీ చూపి భర్తీ చేస్తే పోస్టులు లేనిచోట సిబ్బందిని ఎలా భర్తీ చేశారు? ఒక్కో పోస్ట్‌లో ఇద్దరు లేదా ముగ్గురిని ఎలా కేటాయించారు?
- డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పోస్టులను 100% ప్రమోషన్ల ద్వారానే భర్తీ చేసేందుకు గవర్నింగ్ బాడీ వైస్‌చైర్మన్ ఆమోదం తెలిపారని, సర్వీస్ అసోసియేషన్లు విజ్ఞప్తి చేశాయని చెప్తున్నారు. సొసైటీ వైస్‌చైర్మన్‌కు ఎలాంటి అధికారాలూ లేవు. అంతిమ నిర్ణయాధికారం చైర్మన్‌గా వ్యవహరించే సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిదే. చైర్మన్ అంగీకారం లేకుండా ఎలా అమలుచేశారు?

## బదిలీల్లో పొరపాట్లు వాస్తవమే

- టీచర్లు నష్టపోవద్దనే వెళ్లాను
- కాంగ్రెస్ నేత హర్షవర్ధన్‌రెడ్డి
- ‘నమస్తే తెలంగాణ’ కథనంపై స్పందన

హైదరాబాద్, ఆగస్టు24 (నమస్తే తెలంగాణ) : సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇటీవల చేపట్టిన బదిలీ లు, పదోన్నతుల్లో కొన్ని త ప్పులు జరిగాయని కాంగ్రెస్ నేత హర్షవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. బాధితులు ఫోన్‌చేస్తేనే తాను వెళ్లానని, ఏ ఉద్యోగికీ నష్టం వాటిల్లకుండా చూడాలని అధికారులతో మాట్లాడానని, అంతే తప్ప అక్కడ మరేమీ లేదని పేర్కొన్నారు. గురుకుల బదిలీలు, పదోన్నతుల్లో అక్రమాలకు సంబంధించిన అంశాలపై ‘అర్రాస్.. ఎవరికి హర్షం..?’ పేరిట ‘నమస్తే తెలంగాణ’లో శనివారం ప్రచురితమైన కథనంలో తన పేరే స్ఫురణకు వచ్చేలా ఉందని, తప్పుడు సంకేతాలు వెళ్తాయంటూ హర్షవర్ధన్‌రెడ్డి స్పందించారు.